www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

దూసుకొస్తున్న ఫెంగల్

మళ్లీ బలపడిన తీవ్ర వాయుగుండం

నేడు పుదుచ్చేరి సమీపంలో తీరం దాటనున్న తుఫాన్.. దక్షిణ కోస్తా, సీమ జిల్లాలకు రెడ్ ఎలెర్ట్

తీరం వెంబడి పెరిగిన గాలుల తీవ్రత.. దక్షిణ కోస్తా తీరంలో అలల ఉధృతి

కృష్ణపట్నం రేవులో ఆరో నంబరు భద్రతా సూచిక.. నేడు, రేపు భారీ వర్ష సూచన

3

శనివారం | 30-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 225 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ. 10.30 తదుపరి అమావాస్య నక్షత్రం: విశాఖ మ. 12.34 తదుపరి అనూరాధ; వర్జ్యం: సా. 4.52-6.35; దుర్ముహూర్తం: ఉ. 6.32-8.00; అమృతఘడియలు: తె. 3.12-4.55; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వద్దంటే విన్నారా?

సొంత ఆర్థిక శాఖ సూచనలూ బుట్టదాఖలు

యూనిట్ రూ.2.49 దాటొద్దని స్పష్టీకరణ




తక్కువ ధరే ప్రామాణికంగా తీసుకోవాలని విస్పష్ట సూచన

ప్రాజెక్టు ఆలస్యంపైనా అప్పుడే జాగ్రత్తలు

అయినా పట్టించుకోని జగన్ సర్కారు

ఆర్థిక శాఖ సిఫారసులు 'తోసిపుచ్చిన' కేబినెట్

అన్ని చార్జీలూ కలిపితే యూనిట్ రూ.5పైనే



agency with a long pipeline, mitigate the delay risks on its PSAs. Accordingly, in case of delays on any tranche, the Energy Department may consider negotiating a condition that SECI substitute that tranche with any PSA entered by it (SECI) subsequent to that tranche and which becomes operational before

(f) The Energy Department may also ensure that the price of Rs 2.49 per unit includes all taxes and duties.

(f) The Energy Department may also ensure that the price of Rs 2.49 per unit includes all taxes and duties.

(g) The Energy Department may also ensure that the scheduling of the supply is done as per the requirements of the state government, and the state's interests are protected in the scheduling mechanism agreed with SECI

అన్ని రకాల సుంకాలు, చార్జీలు కలిపినా యూనిట్ సోలార్ విద్యుత్తు ధర రూ.2.49కు మించొద్దని తన నివేదికలో స్పష్టం చేసిన ఆర్థిక శాఖ.



అయినా.. అలవోకగా జగన్ అబద్ధాల ప్రవాహం

'అదానీ' నుంచి సౌర విద్యుత్తు కొనుగోలుకు సంబంధించిన కేబినెట్ నోట్ ఫైల్‌పై తన ప్రభుత్వంలోని విద్యుత్తు శాఖ మంత్రే సంతకం చేసేందుకు ససేమిరా అన్నారు. అర్ధ రాత్రి అనుమానాస్పదంగా వచ్చిన ఫైలుపై సంతకం చేసేది లేదన్నారు! అన్ని చార్జీలూ కలిపినా యూనిట్ ధర రూ.2.49 దాటొద్దని ఆర్థిక శాఖ సిఫారసు చేసింది. అయితే.. నాటి సీఎం జగన్ సంబంధిత మంత్రి స్పందనను పట్టించుకోలేదు. ఆర్థిక శాఖ సూచనలూ విని పించుకోలేదు. 'అదానీ' కోసం అడ్డగోలుగా ముందుకెళ్లారు. ఇప్పుడేమో.. సన్మానాలు చేయాలి, శాలువాలు కప్పాలి అంటున్నారు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు ఒప్పందానికి.. అర్థంలేని సమర్థన! పైగా.. శాలువాలు కప్పాలి, సన్మానాలు చేయాలి అనే డిమాండ్లు! 'సెకీ'తో సౌర విద్యుత్తు ఒప్పందంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరిది! అమెరికాలో పెట్టిన కేసులో తన పేరే లేదని దబాయింపు... అంతర్‌రాష్ట్ర రవాణా చార్జీలు (ఐఎస్‌టీసీ) లేవని బుకాయింపు! ఒప్పందం అక్రమమైతే 'ఆంధ్రజ్యోతి' అనాడే తప్పు పట్టేది కదా అని కూడా జగన్ ప్రశ్నించారు. ఎవరి సంగతో ఎందుకు! ఈ ఒప్పందాన్ని అప్పటి ఆర్థిక శాఖే పరోక్షంగా తప్పుబట్టింది. అనేక జాగ్రత్తలు చెప్పింది. సూచనలు చేసింది. అన్నింటికంటే ముఖ్యంగా...

మిగతా 2వ పేజీలో...

మినహాయింపు ఏదీ.. ఎక్కడ?

7000 మెగావాట్ల సౌర విద్యుత్తుపై ఐఎస్‌టీసీ చార్జీలకు మినహాయింపు ఇవ్వాలని సీఈఆర్‌సీని కోరిన ఈఆర్‌సీ

జీపీఏ అమల్లోకి వస్తే ఐఎస్‌టీసీ వర్తించదని ఆందోళన

ఈఆర్‌సీ లేఖపై జగన్ ఏం చెబుతారని నిపుణుల ప్రశ్న

2



జనంపై మళ్లీ సర్దు'పోటు'

జగన్ ఆఖరి ఇంధన సర్దుబాటు భారం రూ.9,412 కోట్లు

ప్రభుత్వంపై 1,500 కోట్ల వ్యవసాయ రాయితీ భారం

వచ్చే నెల నుంచి యూనిట్‌కు 92 పైసలు వసూలు

2026 నవంబరు దాకా వసూలుకు ఈఆర్‌సీ ఆదేశం

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ పాపం విద్యుత్తు వినియోగదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు ఎడాపెడా విద్యుత్తు కొనుగోలు చేసినందుకు గాను ఇప్పుడు జనంపై సర్దుబాటు చార్జీల భారం పడుతోంది. జగన్ పాలనకు సంబంధించి ఆఖరి ఇంధన సర్దుబాటు భారం రూ.9,412 కోట్లు కాగా, ఇందులో రూ.1,500 కోట్లు వ్యవసాయ విద్యుత్తు రాయితీ కింద డిస్కమ్‌లకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.12,844 కోట్లు సర్దుబాటు చేసేందుకు ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి డిస్కమ్‌లు ప్రతిపాదనలు పంపాయి. అందులో రూ.3,432 కోట్లుకు కోత విధించిన ఈఆర్‌సీ... మిగిలిన రూ.7,912 కోట్లు (వ్యవసాయ సబ్సిడీ రూ.1,500 కోట్లు పోను) ప్రజల నుంచి వసూలు చేసుకొనేందుకు ఆమోదం తెలిపింది. ఈ సర్దుబాటు చార్జీలను యూనిట్‌కు 92 పైసలు చొప్పున వచ్చే నెల (డిసెంబరు) నుంచి 2026 నవంబరు వరకూ వసూలు చేయాలని డిస్కమ్‌లను ఆదేశించింది.

'భూ'చోళ్ల భరతం పడదాం!



రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి అనగాని, అధికారులు

సహకరించిన సిబ్బందిపై క్రిమినల్ కేసులు

ఎంతటివారైనా వదిలిపెట్టొద్దు.. రెవెన్యూ శాఖకు సీఎం ఆదేశాలు

22ఏ నుంచి డీ-నోటిఫై చేసిన భూమి 4,21,433 ఎకరాలు!

ప్రజలు బాధలు పడేది రెవెన్యూ శాఖతోనే.. జనాలను తిప్పించుకోవడం, వేధించడం కొందరు అధికారులకు అలవాటైంది

భూ రికార్డులు, ధ్రువీకరణ పత్రాల కోసం ఇంకా మీపైనే ఆధారపడాలా?

భూఅక్రమాలు జరిగిన టాప్-10 మండలాలపై దృష్టి

రీవెరిఫికేషన్ నివేదిక ఆధారంగా చర్యలు.. సమీక్షలో సీఎం స్పష్టీకరణ

జగన్ హయాంలో అడ్డగోలుగా ప్రభుత్వ భూములను దోచుకున్నవారిపై కఠిన చర్యలకు కూటమి ప్రభుత్వం సమాయత్తమైంది. 22ఏ జాబితా నుంచి 4,21,433.97 ఎకరాలు డీ-నోటిఫై చేశారని తెలిసి ముఖ్యమంత్రి నివ్వెరపోయారు. దురాక్రమణదారులతో అంటకాగిన రెవెన్యూ అధికారులను వదిలే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. చట్టాలను ఉల్లంఘించి దారుణాలు చేసిన వారిపై పకడ్బందీగా కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలన్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూములను దోచుకున్న ప్రైవేటు భూరాబందులు, వారికి సహకరించిన రెవెన్యూ సిబ్బందిపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. భూ దురాక్రమణదారులకు, ప్రభుత్వ భూములను అక్రమంగా స్వాహాచేసిన వారికి రెవెన్యూ వ్యవస్థను దాసోహం చేసి.. అక్రమాల్లో

మిగతా 12వ పేజీలో...

స్మగ్లింగ్‌కు అడ్డాగా కాకినాడ పోర్టు

అధికారుల నిర్లక్ష్యంతో దేశ భద్రతకు తీవ్ర ముప్పు



కాకినాడ పోర్టులో అధికారులను ప్రశ్నిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అత్యంత ప్రమాదకర పోర్టుగా కేంద్రానికి లేఖ రాస్తా

రేషన్ బియ్యం మాఫియా నెట్‌వర్క్‌ను కట్టడి చేస్తా

ఇప్పుడు బియ్యం ఎగుమతి.. రేపు పేలుడు, మత్తు పదార్థాలు దిగుమతి కావని గ్యారెంటీ ఏంటి?

తనిఖీలకు వస్తానంటే 2 నెలలుగా అడ్డుకుంటున్నారు

సముద్రంలో ఓడపైకి వెళ్లడం కుదరదని అబద్ధాలు

డిప్యూటీ సీఎంగా నాకే అధికారులు సహకరించలేదు

నేనొస్తున్నానని తెలిసి జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లారు

కాకినాడ పోర్టులో మీడియాతో పవన్ కల్యాణ్



కాకినాడ పోర్టు, నౌకలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని తనిఖీ చేసిన ఉప ముఖ్యమంత్రి

తుఫాను ముప్పుతో సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా సాహసించి తొమ్మిది మైళ్లు సముద్రంలో ప్రయాణం

కాకినాడ పోర్టును ఇలాగే వదిలేస్తే పాకిస్థాన్ వంటి శత్రుదేశాల నుంచి కసబ్ వంటి ఉగ్రవాదులు వచ్చే ముప్పు పొంచి ఉంది. ఇలా తీర ప్రాంతాన్ని నిర్లక్ష్యంగా వదిలేస్తే దేశ భద్రతకే పెను ప్రమాదం. అందుకే కాకినాడ పోర్టు అత్యంత ప్రమాదకరంగా ఉందని ప్రధాని, కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తా.

\- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు అడ్డాగా మారిపోయిందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. ఇంత భారీగా బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. తీరప్రాంత జిల్లాల్లో ఏ మాత్రం భద్రత లేకపోవడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇది దేశ భద్రతకే తీవ్ర ముప్పుగా పరిగణిస్తుందన్నారు. పోర్టు నుంచి యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నప్పుడు భవిష్యత్తులో

మిగతా 13వ పేజీలో...

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు

3

డిసెంబరు 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కార్డుల్లో మార్పులు, చేర్పులకూ అవకాశం

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు

కొట్టివేత

2

నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయింది: కోర్టు



ముద్దాయిలను నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్టు ప్రకటన

9 ఏళ్లపాటు సాగిన కేసులో గుంటూరు కోర్టు తీర్పు

అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రికి

20 ఎకరాలు



మరిన్ని సంస్థలకూ భూ కేటాయింపులు

కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు

గతంలో ఇచ్చిన భూములకు ఓకే

ఆ కేటాయింపులకు గడువు పొడిగింపు

పాత ధరలకే పాత వారికి భూములు

నూతన పాలసీ మేరకు కొత్తగా భూ కేటాయింపులు

12



సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్, అజయ్ మాకెన్, అంబిక సోని, ఖుర్షీద్

ఎన్నికల అక్రమాలపై ఉద్యమం

దేశవ్యాప్తంగా ప్రజాఉద్యమం చేపడతాం

పార్టీ ప్రక్షాళనకు కఠిన చర్యలు తప్పవు

అదానీ కుంభకోణం, మణిపూర్ అల్లర్లు, మత కల్లోలాలపై ఆందోళనల నిర్వహణ

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో తీర్మానం

కార్యకర్తలు పోరాటం ఆపొద్దు: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు, ప్రశ్నార్థకంగా మారిన ఎన్నికల కమిషన్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా.. దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్వహించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. ఈవీఎంల దుర్వినియోగం, ఓట్ల లెక్కింపు, ఓటర్ల జాబితా విషయంలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన

మిగతా 9వ పేజీలో...

'మహా' ఎన్నికల అక్రమాలపై నిగ్గుతేల్చండి.. ఈసీకి 12 పేజీల నివేదిక

మత్తు వదిలించేస్తాం



రాష్ట్రాన్ని గంజాయి రహితంగా చేయడమే లక్ష్యం

గంజాయి కేపిటల్‌గా దేశంలో ఏపీకి చెడ్డపేరు వచ్చింది

మన్యంలో ప్రతి గిరిజన బిడ్డనూ ఈగల్ బృందం కలుస్తుంది

గంజాయి సాగుతో సమాజానికి జరిగే నష్టమేంటో వివరిస్తాం

వారిని ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లిస్తాం

రైతు నుంచి వినియోగదారుడి వరకూ చైన్‌లింక్ తెగ్గొడతాం

ప్రతి ఒక్కరూ సహకరించాలి: ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ

2

మత్తు బారిన పడిన బిడ్డలను చూసి ఆవేదన చెందొద్దు

ప్రతి తల్లీ 'ఈగల్'కు బ్రాండ్ అంబాసిడర్ కావాలని పిలుపు

ప్రతి ఓటీపీనీ బ్యాంకు ధ్రువీకరించాల్సిందే

ఆ తర్వాతే వినియోగదారుడికి సందేశం

నేటి నుంచి ట్రేసబిలిటీ మార్గదర్శకాలు

9

ట్రాయ్ ఆదేశాల అమలుకు టెలికం సంస్థలు సిద్ధం.. మోసపూరిత సందేశాలకు తెర!

ప్రభుత్వాన్ని రోడ్డున పడేస్తే సహించను

ఆది, జేసీపై చంద్రబాబు ఆగ్రహం

అమరావతికి చేరిన 'బూడిద' పంచాయితీ

బీజేపీ ఎమ్మెల్యే ఆది, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రాక

జ్వరం వచ్చిందని జేసీ, ఆయన కొడుకు గైర్హాజరు

ప్రజల్లో పలుచనయ్యే పనులెందుకు?

ఇంకోసారి రోడ్డెక్కితే తీవ్ర పరిణామాలు

2

నేను చర్యలు తీసుకునేదాకా తెచ్చుకోవద్దు

ఉభయులకూ ముఖ్యమంత్రి హెచ్చరిక

నేడు అనంత పర్యటనలో ఆయనతో జేసీ భేటీ?

గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం

- గంజాయి కేపిటల్‌గా ఏపీకి చెడ్డపేరు వచ్చింది
- మన్యంలో ప్రతి గిరిజన బిడ్డను ఈగల్ కలుస్తుంది
- గంజాయితో సమాజానికి నష్టమేంటో వివరిస్తాం
- వారిని ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లిస్తాం
- రైతు - వినియోగదారుడి చైన్‌లింక్‌ను తెగ్గొడతాం
- ప్రతి ఒక్కరూ సహకరించాలి: ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ
- మత్తు బారిన పడిన కొడుకును చూసి ఆవేదన వద్దు
- ప్రతి తల్లీ 'ఈగల్'కు బ్రాండ్ అంబాసిడర్ కావాలి



మత్తు వదిలిస్తాం

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) చీఫ్ ఆకే రవికృష్ణ అన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడారు. గంజాయి బారిన పడిన కొడుకు పరిస్థితి చూసి రాష్ట్రంలో ఏ తల్లీ ఆవేదన చెంద కూడదని, మత్తు మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రతి తల్లీ 'ఈగల్'కు బ్రాండ్ అంబాసిడర్ కావాలని ఆయన పిలుపునిచ్చారు. 'రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా డ్రగ్స్ బారిన పడటానికి వీల్లేదు. భవిష్యత్తు నాశనం చేసుకో కూడదు. మన్యంలో ప్రతి గిరిజన బిడ్డను ఈగల్ బృందం కలుస్తుంది. గంజాయి సాగు వల్ల సమాజానికి జరిగే నష్టమేంటో వివరిస్తుంది. గంజాయిని సాగు చేస్తే ప్రభుత్వం సంక్షేమ పథకాలు దక్కవనే విష యాన్ని తెలియజేస్తాం. జైలుకు వెళితే జీవితాలు నాశనమవుతాయని నచ్చజెప్పి వారిని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిస్తాం. ఈగల్‌కు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలి. ఐదు కోట్ల మంది ఆంధ్రులు ఇందులో సభ్యులే.. మత్తు సమాచారాన్ని టోల్ ఫ్రీ నం. 1972కు అందించాలి' అని ఆయన కోరారు. పిల్లల్లో మార్పు కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని, మత్తుకు బానిసలైతే డీఅడిక్షన్ సెంటర్లకు తర లించి చికిత్స చేయిస్తామని, అంతకుమించి తప్పుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్రం తెచ్చిన నార్కోటిక్ చట్టం ప్రకారం గంజాయి సాగు, రవాణా, విక్రయంతో పాటు వినియోగం కూడా నేరమే నని రవికృష్ణ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమ స్యపై సీరియస్‌గా ఉందని.. ఎస్‌టీడీడీ (సోర్స్, ట్రాన్స్‌పోర్ట్, డెస్టినేషన్, డిమాండ్)పై దృష్టి సారించి మన్యంలో సాగు చేసే రైతు నుంచి వినియోగదారుడి వరకూ మొత్తం చైన్ లింక్‌ను ఎక్కడికక్కడ తెగ్గొట్టడమే ఈగల్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారిపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపనుందని, అందుకు అనుగుణంగా ప్రివెన్షన్, డిటెక్షన్‌తో పాటు కన్విక్షన్‌పైనా ప్రత్యేక శ్రద్ధ పెడతామ న్నారు. రాష్ట్రంలో 70 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, వారందరి భవిష్యత్తు బాగుండాలంటే గంజాయి మొక్క పెరగడానికి, మత్తు పదార్థాలు ఏపీలోకి రావడానికి వీల్లే దని రవికృష్ణ పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం ఢిల్లీలో కొందరు అధికారులు మాట్లాడుతూ ఏపీ గంజాయి కేపి టల్ ఆఫ్ ఇండియాగా మారుతోంది అనడంతో ఈ రాష్ట్రా నికి చెందిన వ్యక్తిగా అవేదన చెందానని తెలిపారు. ఇటీ వల దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశంలో.. దేశంలో ఎక్కువ గంజాయి లభించే రాష్ట్రాల జాబితాలో ఏపీ అగ్ర స్థానంలో ఉన్న స్లైడ్ చూపించడం అవమానంగా అనిపిం చిందన్నారు. అల్లూరి జిల్లాలో 9 మండలాల పరిధిలో సాగయ్యే మత్తు మహమ్మారి వల్ల రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఇలా చెడ్డ పేరు రావడం బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

> మూడేళ్ల క్రితం ఢిల్లీలో కొందరు అధికారులు మాట్లాడుతూ ఏపీ గంజాయి కేపిటల్ ఆఫ్ ఇండియాగా మారుతోంది అనడంతో ఈ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా అవేదన చెందా. ఇటీవల దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం చెన్నైలో జరిగినప్పుడు దేశంలో ఎక్కువ గంజాయి లభించే రాష్ట్రాల జాబితాలో ఏపీ అగ్రస్థానంలో ఉన్న స్లైడ్ చూపించడం అవమానంగా అనిపించింది.

ప్రతి జిల్లాలో ఈగల్ సెల్

ఐబీలో సమర్థంగా పనిచేసిన ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణను యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ అధిపతిగా ప్రభుత్వం నియమించింది. అమరావతిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసి ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఒక సెల్ ఏర్పాటు చేయనుంది. ఇద్దరు ఎస్పీలు, నలుగురు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు కీలకంగా వ్యవహరిస్తారు. ప్రతి జిల్లాలోనూ ఏఎన్‌టీఎఫ్ సెల్ ఏర్పాటు చేసి 26మంది ఎస్ఐల నేతృత్వంలో సిబ్బంది గంజాయి, డ్రగ్స్ కట్టడికి కృషి చేస్తారు. అయితే గంజాయి సాగు, సరఫరా మొదలు విక్రయాల వరకూ ఎవరు పట్టుబడినా వారిపై అమరావతిలోని ఏఎన్‌టీఎఫ్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేస్తారు. ఒడిశా నుంచి అక్రమ మార్గంలో ఏపీలోకి వస్తున్న గంజాయిని కట్టడి చేసేందుకు సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఫేషి యల్ రికగ్నైజేషన్, ఆటోమెటిక్ నంబర్ డిటెక్షన్ వ్యవస్థ లతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు.

అమ్మా.. ఆకలి వేట

ఆకలి తీర్చుకోవడానికి చేపల కోసం గాలం వేసి నిరీక్షిస్తున్న ఓ అమ్మ. ఆ అమ్మ ఒడిలో ఆమె బిడ్డ. పల్నాడు జిల్లా వి నుకొండ మండలంలోని కోటప్పనగర్ నుంచి కంచర్ల వెళ్లే రోడ్డుపై కనిపించిందీ దృశ్యం. ఆ సమీపంలో సుబాబుల్ చెట్టు కొట్టే పనికి వచ్చిన ఓ నిరుపేద కూలి ఈ మహిళ. శుక్రవారం పని విరామ సమయంలో తన బిడ్డను ఒడిలో పెట్టుకుని చెరువులో చేపలకు గాలం వేసి నిరీక్షిస్తూ కనిపించింది.

\- వినుకొండటౌన్





మేనమామే.. కాలయముడు

గొంతు కోసి బాలుడి దారుణ హత్య

- బడి నుంచి కిడ్నాప్ చేసి ఘోరం
- ఆస్తి తగాదాలు, కుటుంబ విభేదాలే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు
- శ్రీసత్యసాయి జిల్లాలో అమానవీయ ఘటన

మడకశిర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపై ఆశ ఆ మనిషిని కిరాతకంగా మార్చేసింది. 13 ఏళ్ల బాలుడి ప్రాణాలు తీసేలా చేసింది. కుటుంబ తగాదాల కార ణంగా వరుసకు మేనమామ.. ఆ పసివాడిని పొట్టన పెట్టుకున్నాడు. బడి నుంచి కిడ్నాప్ చేసి ఆపై గొంతు కోసి హత్య చేశాడు. శ్రీస త్యసాయి జిల్లాలో ఈ దారుణం చోటు చేసుకుంది. మడకశిర మండల పరిధిలోని ఆమిదాల గొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చేతన్ (13) హత్య జిల్లాలో కలకలం రేపింది. పాఠశాల నుంచి గురువారం మధ్యాహ్నం కిడ్నాప్ అయిన చేతన్.. పావగడ తాలూకా రాజ వంతి సమీపంలోని అటవీ ప్రాంతంలో విగతజీవిగా కనిపిం చాడు. ఈ కేసులో అనుమానితుడు అశోక్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్పీ బి.రత్న తెలిపారు.



మడకశిర ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలపిస్తున్న చేతన్ తల్లి పుష్పలత

అమ్మతో కలిసి అమ్మమ్మ ఇంట్లో ఉంటూ..

మడకశిర మండలం మరువపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, పుష్పలత దంపతులు విభేదాల కారణంగా పన్నెండేళ్ల క్రితం విడిపోయారు. విడాకుల అనంతరం కుమారుడు చేతన్‌తో కలిసి పుష్పలత అదే గ్రామంలోని పుట్టింట్లో ఉంటోంది. చేతన్ మూడు కిలోమీటర్ల దూరంలోని ఆమిదాలగొంది జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వెంకటేశ్వర్లు రెండో వివాహం చేసుకోగా.. పుష్పలత కియ పరి శ్రమలో ఉద్యోగం చేస్తూ కుమారుడిని పోషిస్తోంది. ఈ క్రమంలో చేతన్ తాత శ్రీరామప్పకు గురువారం మధ్యాహ్నం ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'నీ మనవడిని కిడ్నాప్ చేశాం.. బడిలో ఉన్నాడో లేదో చూసుకుని.. ఫోన్ చెయ్..' అని చెప్పి ఫోన్ కట్ చేశారు. కంగారుపడిన శ్రీరామప్ప పాఠశాలకు వెళ్లి ఆరా తీయగా.. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై తీసుకువెళ్లారని తెలియడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్‌కాల్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభిం చిన పోలీసులు.. ఆ నంబర్ ఓ మహిళ దని గుర్తించి ఆమెను స్టేషన్‌కు రప్పిం చారు. మరోవైపు చేతన్‌ను వాళ్ల మేన మామ తీసుకెళ్లాడని విద్యార్థులు చెప్ప డంతో అశోక్‌ను అనుమానించి, అదుపు లోకి తీసుకున్నారు. తన ఫోన్ తీసుకుని ఎవరికో కాల్ చేసిన అశోక్‌ని ఆ మహిళ గుర్తించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో చేతన్‌ను హత్య చేసింది తానేనని అశోక్ అంగీకరించినట్లు సమాచారం.

ఎవరీ అశోక్...?

పుష్పలత తల్లి గంగమ్మకు ఓ సోదరి ఉంది. ఆమె కొడుకే అశోక్. పుష్పలతకు తమ్ముడు.. చేతన్‌కు మేనమామ వరుస అవుతాడు. పుట్టింట్లో ఉంటున్న పుష్పలతకు భర్త నుంచి భరణం రూపంలో మూడు ఎకరాల పొలం వచ్చినట్లు సమా చారం. దీంతోపాటు నెలకు రూ.3 వేలు ఇస్తున్నట్లు తెలి సింది. దీంతోపాటు పుష్పలతకు మరికొన్ని ఆస్తులున్నాయని, వాటి విషయంలో కుటుంబంలో విభేదాలున్నాయని తెలి సింది. భర్తకు దూరమైన పుష్పలతకు చేతన్ ఒక్కడే వార సుడు. చేతన్‌ను తప్పిస్తే.. ఆస్తి మొత్తం దక్కుతుందని భావి ంచి.. అశోక్ ఈ దారుణానికి పాల్పడి ఉంటాడన్న అనుమా నాలు తలెత్తుతున్నాయి.

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందన్న కోర్టు

- 9 ఏళ్లపాటు సాగిన కేసులో గుంటూరు కోర్టు తీర్పు

గుంటూరు (లీగల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన నాగా ర్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విద్యార్థిని మొండి రిషితేశ్వరి కేసులో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ గుంటూరు పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి నీలిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. నిందితులపై పూర్తి సాక్ష్యాధారాలతో కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని, సంశయ లాభం కింద ముద్దాయిలను నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2015 జూలై 14న నాగార్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ మొదటి సంవత్సరం చదువుతున్న వరంగల్ జిల్లా సుబే దారికి చెందిన రిషితేశ్వరి ఇందిరా ప్రియదర్శిని లేడీస్ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందింది. సీని యర్ విద్యార్థుల ఈవ్‌టీజింగ్‌తో పాటు ప్రేమ పేరుతో వేధించడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరో పిస్తూ, ప్రజా సంఘాలతోపాటు అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు ఆందోళన చేశారు. రిషితేశ్వరి తండ్రి ఫిర్యాదు మేరకు పెదకాకాని పోలీసులు ఆర్కిటె క్చర్ రెండో సంవత్సరం చదువుతున్న దుంప హనీషా నాగ సాయిలక్ష్మి, నాలుగో సంవత్సరం చదువుతున్న ధారావత్ జై చరణ్ నాయక్, నరాల శ్రీనివాస్‌తో పాటు ప్రిన్సిపాల్ గూడవల్లి బాబురావును నిందితులుగా చేరుస్తూ కేసు నమోదు చేశారు. పై ముగ్గురు విద్యా ర్థుల వేధింపుల వల్లే రిషితేశ్వరి ఆత్మహత్య చేసుకుం దని, ఫిర్యాదు చేసినా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. కేసు దర్యాప్తు అనంతరం నార్త్ సబ్ డివి జన్ డీఎస్పీ రామాంజనేయులు తనతోపాటు మరో 50 మందిని సాక్షులుగా చూపుతూ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దాదాపు తొమ్మిదేళ్లపాటు కోర్టులో విచా రణ జరిగింది. 37 మందిని సాక్షులుగా విచారించారు. తొలుత ఈ కేసులో పోక్సో కోర్టు ఏపీపీ శ్యామల ప్రాసి క్యూషన్ నిర్వహించగా సీనియర్ న్యాయవాదులు గరిక పాటి కృష్ణారావు, ఉమ్మడిశెట్టి మహతి శంకర్, బీరం సాయిబాబు, సాయి మనోహర్రావు, జోసెఫ్ రవికు మార్.. నిందితుల తరఫున డిఫెన్స్ నిర్వహించారు. కేసు చివరి దశలో గత ప్రభుత్వం సీనియర్ న్యాయవాది వైకేను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. అనంతరం దాదాపు నెల రోజులపాటు సుదీర్ఘ వాదోప వాదాలు జరిగాయి. శుక్రవారం తీర్పు రానుందని తెలి యడంతో కోర్టు ఆవరణలో ఉత్కంఠ నెలకొంది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కోర్టు నిందితుల్ని నిర్దోషులుగా ప్రకటించగానే.. రిషితేశ్వరి తల్లిదండ్రులు అక్కడే బోరున విలపించారు. మరోపక్క నిందితుల తరఫు తల్లిదండ్రులు, బంధువులు ఇప్పటికైనా న్యాయం గెలిచిందని, కొందరు రాజకీయ, ప్రజా సంఘాల ముసు గులో స్వలాభం కోసమే తమ పిల్లల్ని బలి పశువుల్ని చేశారని అన్నారు. కాగా, రిషితేశ్వరి కేసులో కోర్టు తీర్పు తమకు సమ్మతం కాదని దీనిపై హైకోర్టులో అప్పీలు చేస్తామని సీనియర్ న్యాయవాది వైకేతో పాటు రిషితే శ్వరి తల్లిదండ్రులు మురళీకృష్ణ, దుర్గాబాయి తెలిపారు.



మహిళ నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

102 కిలోల గంజాయి స్వాధీనం

తమిళనాడు మహిళ అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి గంజాయిని రైలులో తమిళనాడుకు తరలిస్తున్న మహిళను దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద 102 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ-2 మేరీప్రశాంతి కేసు వివరాలు వెల్లడించారు. తమిళనాడులోని మదురై ప్రాంతానికి చెందిన మహిళ 4 బ్యాగుల్లో గంజాయిని దువ్వాడ రైల్వేస్టేషన్‌కు తీసుకువస్తున్నట్టు గురువారం సమాచారం అందడంతో పోలీసులు కాపుకాశారు. స్కూటీపై వచ్చిన మహిళను తనిఖీ చేశారు. ఆమె వద్ద రెండేసి కిలోలు చొప్పున 51 ప్యాకెట్ల గంజాయి లభ్య మైంది. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా మదురైలోనే ఉంటున్న తన మేనమామ లక్ష్మణశేఖర్ ఏజెన్సీ నుంచి గంజాయిని దువ్వాడ తెచ్చి తమిళనాడు వెళ్లిపోగా, తాను రైలులో అక్కడకు తీసుకువెళుతున్నట్టు తెలిపింది. గత మూడు నెలల్లో పలుమార్లు గంజాయి ఎగుమతి చేసినట్టు అంగీకరించింది. పట్టుబడిన గంజాయి విలువ రూ.13 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. లక్ష్మణశేఖర్ కోసం గాలిస్తున్నామన్నారు.

నకిలీ ఔషధ విక్రయాలపై చర్యలు

- 2,599 రకాల మందులు సీజ్: విజిలెన్స్ డీజీ

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనుమతి లేని, గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా తెలి పారు. ఈ నెల 23 నుంచి 27 వరకూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో విజిలెన్స్ బృందాలు ఆయుష్ అధికారులతో కలిసి సోదాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎక్కువగా గడువు తీరిన మందులు, విక్రయానికి అనుమతి లేని ఔషధాలు లభ్య మైనట్లు చెప్పారు. మొత్తం 50 ప్రాంగణాల్లో రూ.61 లక్షలకు పైగా విలువైన 2,599 రకాల మందులు స్వాధీనం చేసుకుని వాటిని విక్రయిస్తున్న మెడికల్ షాపులను సీజ్ చేసినట్లు గుప్తా వివరించారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి నంద్యాల, తిరుపతి కోర్టుల్లో అభియోగాలు దాఖలు చేశామని తెలిపారు. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీజీ హెచ్చరించారు.

తాడేపల్లికి ఏసీబీ సీఐయూ విభాగం తరలింపు

- కీలకమైన కేసుల దర్యాప్తుకు ఆటంకాలు కూడదనే..!

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం-ఎన్టీఆర్ పరిపాలన భవనంలో ఉన్న అవినీతి నిరోధక శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని కీలకమైన సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్(సీఐయూ) విభాగాన్ని తాడేపల్లికి తరలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన కేసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలూ కలగకుండా ఈ విభాగాన్ని వేరేచోటుకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఏపీకి వచ్చిన ప్రభుత్వ కార్యాలయాలకు ఆర్టీసీ యాజమాన్యం భవనాలను అద్దెకు ఇచ్చింది. ఏసీబీ(డీజీ) హెడ్ ఆఫీస్ బెజవాడ బస్టాండ్‌లోని రెండో అంతస్తు, మూడో అంతస్తుల్లో సుమారు 12వేల చదరపు అడుగుల్లో కొలు వైంది. అయితే అదే భవనంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ఏసీబీ వ్యవహారాలు, వ్యూహాలు, సోదాల విషయం బయటికి తెలుస్తోందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏసీబీలోని కీలకమైన సీఐయూ విభాగాన్ని తాడేపల్లిలోని పూజిత అపార్ట్‌మెంట్‌లోగల నిర్మల భవన్‌లోకి మార్చేందుకు ప్రభు త్వం అనుమతిచ్చింది. సుమారు ఏడువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనానికి అడుగుకు రూ.29.50ల చొప్పున అద్దె చెల్లించేందుకు సమ్మతిస్తూ శుక్రవారం సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

మినహాయింపు ఏదీ.. ఎక్కడ?

- 7000 మెగావాట్ల సౌర విద్యుత్తుపై ఐఎస్‌టీసీ చార్జీలు
- మినహాయింపు ఇవ్వాలని సీఈఆర్‌సీని కోరిన ఈఆర్‌సీ
- జీఏపీ అమల్లోకి వస్తే ఐఎస్‌టీసీ వర్తించదని ఆందోళన
- ఈఆర్‌సీ లేఖపై జగన్ ఏం చెబుతారని నిపుణుల ప్రశ్న

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి కొనుగోలు చేస్తున్న 7,000 మెగావాట్ల సౌర వి ద్యుత్తుకు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీ(ఐఎస్‌టీ సీ)ల మినహాయింపు ఉందని మాజీ సీఎం జగన్ చేసిన ప్రకటన శుద్ధ అబద్ధమని తేలిపోయింది. దేశం లోనే అతి తక్కువగా సౌర విద్యుత్తు యూనిట్ రూ.2.49కే రాష్ట్రానికి వస్తుందంటూ జగన్ గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో 'సొంత మీడియా' సమావేశంలో ప్రకటించారు. ఐఎస్‌టీసీ చార్జీలపై వక్రీకరిస్తున్నాయని 'ఆంధ్రజ్యోతి', 'ఈనా డు'పై అసహనం వ్యక్తం చేశారు. అయితే.. జగన్ చెప్పిన మాటలన్నీ అబద్ధాలేనని రుజువైంది. సెకీ వి ద్యుత్తుకు ఐఎస్‌టీసీ చార్జీలు మినహాయించాలని కోరుతూ కేంద్ర ఇంధన నియంత్రణ మండలి(సీఈఆ ర్‌సీ)కి ఏపీఈఆర్‌సీ ఈ ఏడాది ఆగస్టు 13న లేఖ రాసింది. జనరల్ పవర్ యాక్సెస్ (జీఏపీ) అమలు లోకి వచ్చాక ఐఎస్‌టీసీ అంశం మరుగున పడుతుం దని అంటున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాలంటూ ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ కోరారు. జీఏపీ విధానాన్ని 2023లో కేంద్ర ఇంధనశాఖ, సీఈఆర్‌సీ తీసుకొచ్చాయి. అప్పట్లో దీనిపై జగన్ దృష్టి సారించలేదు. దీనివల్ల సెకీ నుంచి కొనుగోలు చేస్తున్న విద్యుత్తుపై జీఏపీ భారం పడు తుందని సీపీఎం, సీపీఐ, టీడీపీ, జనసేన పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 9న ఢిల్లీలో సీఈఆర్‌సీ చీఫ్ రెగ్యులేటరీ ఫోరం సెక్రటరీ ఎస్‌కె. చటర్జీ బృందంతో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి వర్కింగ్ భేటీ నిర్వహించారు. సెకీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల సమయంలో భవిష్య త్తులో వచ్చే కొత్త చట్టాలను అమలు చేస్తామంటూ రాష్ట్ర ఇంధనశాఖ, డిస్కమ్‌లు అంగీకరించాయి. ఈ నేపథ్యంలో సెకీ విద్యుత్తుపైనా జీఏపీ పడుతుందన్న ఆందోళనను ఏపీఈఆర్‌సీ వ్యక్తం చేసింది. దీంతో సెకీ విద్యుత్తుకు ఐఎస్‌టీసీ మినహాయింపు ఇవ్వాలని కోరింది. కాగా, సెకీతో డిస్కమ్‌లు, ఇంధనశాఖ ఒప్పందం చేసుకున్నాయి. ఏపీ గ్రీన్‌ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏపీ రూరల్ అగ్రికల్చరల్ పవర్ సప్లయి కంపెనీగా మార్చారు. ఈ కంపెనీ ద్వారా వ్యవసాయా నికి విద్యుత్తును సరఫరా చేస్తామని సీఈఆర్‌సీకి ఈఆర్‌సీ తెలిపింది. అయితే ఒప్పందంపై ఏపీఆర్‌ఏపీ ఎస్‌కామ్ సంతకాలు చేయలేదు. దీంతో ఐఎస్‌టీసీ మి నహాయింపు వచ్చే అవకాశం లేదని ఇంధనశాఖ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే.. సెకీ విద్యుత్తుకు ఐఎస్‌టీసీ మినహాయింపు ఉందంటూ జగన్ దబాయింపునకు దిగారు. సెకీతో చేసుకున్న ఒప్పందం వల్ల యూనిట్ రూ.2.49కే రాష్ట్రానికి రాజస్థాన్ నుంచి వచ్చేస్తుందని బుకాయిం చారు. ఒకవేళ జీఏపీ చార్జీలు కట్టాల్సి వస్తే జగన్ సొంత డబ్బు నుంచి భరిస్తారా అనే ప్రశ్నకు ఏం సమాధానం చెబుతారని రాజకీయపక్షాలు, విద్యుత్తు రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

1) Approved para 3; the attached Power Sale Agreement (PSA) according to provisions of Electricity Act 2003; and the attached report of Andhra Pradesh Power Coordination Committee (APPCC) including its recommendations and the course of action in annexure 3 of the report of APPCC; duly overruling the finance remarks at para 9.1;





1) Approved para 3; the attached Power Sale Agreement (PSA) according to provisions of Electricity Act 2003; and the attached report of Andhra Pradesh Power Coordination Committee (APPCC) including its recommendations and the course of action in annexure 3 of the report of APPCC; duly overruling the finance remarks at para 9.1;
2) Authorized Deputy Secretary/Energy to sign on the PSA on behalf of Government of Andhra Pradesh;
3) Authorized Principal Finance Secretary to issue payment security mechanism including irrevocable letter of credit for 12 months' tariff as per the PSA on behalf of Government of Andhra Pradesh;
4) Authorized Energy Department to notify the rural areas under Andhra Pradesh Rural Agriculture Supply Company;
5) Authorized Energy Department to issue required notifications for revision of Electricity

ఆర్థిక శాఖ సూచనలన్నీ 'బుట్టదాఖలు' (ఓవర్‌రూల్) చేస్తూ సెకీతో ఒప్పందాన్ని జగన్ మంత్రివర్గం ఆమోదించింది.

వద్దంటే విన్నారా!?

(మొదటి పేజీ తరువాయి)

అన్ని రకాల పన్నులు, చార్జీలు, సుంకాలు కలిపి యూనిట్ సోలార్ విద్యుత్తు రూ.2.49 దాటొద్దని స్పష్టంగా చెప్పింది. కానీ... నాటి సీఎం జగన్ వి ంటేనా! 'అదానీయే నాకు ముఖ్యం' అంటూ తన సొంత ఆర్థిక శాఖ సూచనలను సైతం బేఖాతరు చేశారు.

ఇదీ చెప్పింది...

సెకీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి ముందు నిబంధనల ప్రకారం ఆర్థిక శాఖతో కూడా ఇంధన శాఖ సంప్రదింపులు జరి పింది. దీనిపై నాటి ఆర్థిక శాఖ అనేక సూచనలు చేసింది. అన్నిం టికంటే ముఖ్యంగా "అన్ని పన్నులు, సుంకాలు కలిపి యూనిట్ విద్యుత్తు ధర రూ.2.49 ఉండాలి" అని ఇంధన శాఖకు సూచించింది. 2021 అక్టోబరు 28వ తేదీన 'సెకీ'తో ఒప్పందాన్ని జగన్ మంత్రివర్గం ఆమో దించింది. ఆ రోజు 'ఐటమ్ నంబర్ 15'గా ఈ ఒప్పం దాన్ని ఆమోదించారు. 'ఆర్థిక శాఖ సూచనలను తిర స్కరిస్తున్నాం' అని అందులో స్పష్టం చేశారు.

ఇదీ అసలు ధర...

ఒక యూనిట్	రూ.2.42
సెకీ కమిషన్	7 పైసలు
జీపీఏ	రూ.2.21
జీఎస్‌టీ	30 పైసలు
ట్రాన్స్‌మిషన్ నష్టాలు	13 పైసలు
ఒక యూనిట్‌కు పడే ధర	రూ.5.13

అయినా... అబద్ధాలే!

అదానీ కోసం సెకీతో చేసుకున్న ఒప్పందంలో అంతర్‌రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు లేనే లేవని జగన్ గురువారం అలవోకగా అబద్ధాలు చెప్పారు. పదేపదే అదే మాట నొక్కి వక్కాణించారు. నిజానికి... ఈ వి ద్యుత్తుకు నెట్‌వర్క్ చార్జీలు వర్తిస్తాయని అప్ప ట్లోనే ఇంధన శాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్ స్పష్టం చేశారు. యూనిట్ విద్యుత్తు ధర రూ.2.49 దాటొద్దని ఆర్థిక శాఖ సూచించగా... 'నెట్‌వర్క్ చార్జీలు అదనం' అని ఆయన తేల్చేశారు. ఎక్కడో రాజస్థాన్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్తును ఏపీకి గ్రిడ్ ద్వారా సరఫరా చేసేందుకు చార్జీలు చెల్లించాల్సిందే! ఇలా అన్ని రుసుములు, చార్జీలు కలి పితే.. 'సెకీ' నుంచి కొనుగోలు చేసే సౌర విద్యుత్తు యూనిట్‌కు ఐదు రూపాయలు దాటుతుందని అంచనా! అంతర్‌రాష్ట్ర రవాణా చార్జీల(ఐఎస్‌టీసీ) స్థానంలో కేంద్రం 'జనరల్ యాక్సెస్' చార్జీలను తీసు కొచ్చింది. పేరు ఏదైనప్పటికీ.. షాక్ మాత్రం షరా మామూలే!

ఒక్కమాటైనా విన్నారా?

'సెకీ'తో ఒప్పందానికి సంబంధించి ఆర్థిక శాఖ చేసిన కీలకమైన సూచనలేవీ జగన్ సర్కారు పట్టించుకోలేదని స్పష్టమవుతోంది. 2024 సెప్టెం బరు నుంచి సరఫరా చేసే విద్యుత్తుకు 2021లోనే ఒప్పందం చేసుకోవడాన్ని నిపుణులు అప్పట్లోనే తప్పుపట్టారు. ఇప్పుడు... 2024 సెప్టెంబరు దాటి డిసెంబరు వస్తున్నా 'అదానీ' నుంచి విద్యుత్తు సరఫరా మొదలు కాలేదు. ఈ పరిణామాన్ని ఆర్థిక శాఖ అప్పట్లోనే ఊహించింది. "ఈ ప్రాజె క్టులు ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. అదే జరిగితే... సెకీ తనతో ఒప్పందం కుదుర్చుకున్న ఇతర సంస్థల నుంచి రాష్ట్రానికి విద్యుత్తు సర ఫరా చేయాలి. ఒకవేళ వేరే సంస్థ విద్యుత్తు ధర తక్కువయితే... దానినే చెల్లించాలి" అని ఆర్థిక శాఖ సూచించింది. దీనిని కూడా జగన్ సర్కారు పట్టించుకోలేదు. అన్నింటికంటే ముఖ్యంగా... యూనిట్ సౌర విద్యుత్తు ధర రూ.2.49ను ప్రామాణికంగా తీసుకోవద్దని కూడా ఆర్థిక శాఖ పేర్కొంది. "సెకీతో అప్పటికే కుదిరిన ఇతర ఒప్పందాలను చూడండి. ఇంతకంటే తక్కువ ధరకు ఒప్పందాలు ఉంటే... అదే టారిఫ్‌తో మనమూ కొనుగోలు చేయాలి" అని పేర్కొంది. ఈ సూచనను కూడా జగన్ సర్కారు బుట్టదా ఖలు చేసింది. 'సెకీ' 2021 మే నెలలో రూ.2.14కే సౌర విద్యుత్తును సరఫరా చేసింది. ఆర్థిక శాఖ సూచన ప్రకారం ఈ ధరనే ప్రామాణికంగా తీసు కుని 'సెకీ'తో ఒప్పందం చేసుకోవాలి. దీనిని కూడా జగన్ సర్కారు పట్టించుకోలేదు.

ప్రభుత్వాన్ని రోడ్డున పడేస్తే సహించను

ఆది, జేసీపై చంద్రబాబు ఆగ్రహం

అమరావతికి చేరిన 'బూడిద' పంచాయితీ

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి వైఖరిపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత వ్యవహారాలతో కూటమి ప్రభుత్వా న్ని రోడ్డున పడవేస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. జమ్మలమడుగు పరిధిలోని ఎర్రగుంట్లలో ఉన్న రా యలసీమ థర్మల్ విద్యుత్కేంద్రం(ఆర్‌టీపీపీ) నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ రవాణాపై వీరి మధ్య వివా దం తలెత్తింది. ప్రభుత్వం మారిన తర్వాత జేసీకి చెందిన వాహనాలు ఈ బూడిదను తాడిపత్రి నియో జకవర్గంలోని ఎల్అండ్‌టీ సిమెంట్ కర్మాగారానికి రవాణా చేస్తున్నాయి. ఇటీవల ఆదినారాయణరెడ్డి వర్గీ యులు జేసీ వాహనాలను అడ్డగించారు. తమ నియో జకవర్గంలోని ఫ్యాక్టరీ నుంచి వచ్చే బూడిదను తామే రవాణా చేసుకుంటామని, జేసీ వాహనాలను రాని చ్చేది లేదని ప్రకటించారు. దీంతో జేసీ కడప ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అధికారులు జోక్యం చేసుకున్నా సమస్య పరిష్కారం కాలేదు. కొన్ని రోజులుగా జేసీ వాహనాలను అడ్డగిస్తూనే ఉన్నారు. వీరిద్దరి వి వాదంపై సీఎం సీరియస్ అయ్యారు. ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలను, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కొడుకు, తాడిపత్రి ఎమ్మె ల్యే అస్మిత్‌రెడ్డిని పిలిపించాలని ఆయన ఆదేశించారు. దీంతో ఆది, భూపేశ్‌రెడ్డి శుక్రవారం అమరావతి సచి వాలయంలో సీఎంను కలిశారు. జ్వరం వచ్చిందంటూ జేసీ తండ్రీ తనయులు రాలేదు. ఈ సందర్భంగా ఆది, జేసీలపై చంద్రబాబు మండిపడినట్లు సమాచారం. 'మీమీ వ్యక్తిగత వ్యవహారాల కోసం ప్రభుత్వా న్ని రోడ్డున పడవేస్తారా? ఒక స్థాయికి వచ్చిన తర్వా త బాధ్యతతో పనిచేయాలని తెలియదా? మీ ఇద్దరికీ సీని యారిటీ ఉంది. ప్రజల్లో పలుచనయ్యే పనులు ఎందుకు చేస్తున్నారు? ఇంకోసారి రోడ్డెక్కితే పరిణా మాలు తీవ్రంగా ఉంటాయి. నా నిర్ణయం నేను తీసు కుంటాను. తర్వాత బాధపడి ప్రయోజనం లేదు. మీ వల్ల ప్రభుత్వ/పార్టీ ప్రతిష్ఠ దెబ్బ తింటూ ఉంటే చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేను' అని అన్నారు.

స్థానికులకు ఇవ్వాలన్నదే: ఆదినారాయణరెడ్డి

ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. 'ఇది సాధారణ మైన చిన్న సమస్య. మా ఇద్దరి మధ్య వివాదం రావా ల్సినంతది కాదు. 'థర్మల్ కేంద్రం నుంచి తడి ఫ్లైయాష్ వస్తుంది. అది ఉచితం. దాని గురించే ఈ గొడవ. మేం సీఎంకు సవివరంగా చెప్పాం. నిర్ణ యాన్ని ఆయనకు వదిలిపెట్టాం. దీనిపై జిల్లా అధికా రులను ఆరా తీయొచ్చు' అని ఆయన అన్నారు.

తగాదా తెచ్చింది ఆయనే.. జేసీ వివరణ

సీఎం సమక్షానికి రాకపోయినా టీడీపీ ముఖ్య నేత లకు జేసీ ఫోన్ చేసి వివరణ ఇచ్చినట్లు సమాచారం. 'మేం ఎంతో కాలం నుంచి బూడిద రవాణా చేస్తు న్నాం. గతంలో ఎవరూ ఆపలేదు. వైసీపీ హయాంలో ఆపారు. టీడీపీ వచ్చాక మళ్లీ రవాణా చేస్తున్నాం. గతంలో ఆదినారాయణరెడ్డి కూడా దీనిని అడ్డుకో లేదు. ఇప్పుడు అడ్డుకుంటున్నారు. కొత్త తగాదా తెచ్చింది ఆయన తప్ప నేను కాదు' అన్నారు.

దూసుకొస్తున్న 'ఫెంగల్'

మళ్లీ బలపడిన తీవ్ర వాయుగుండం

- నేడు పుదుచ్చేరి సమీపంలో తీరం దాటనున్న తుఫాన్
- దక్షిణ కోస్తా, సీమ జిల్లాలకు రెడ్ ఎలెర్ట్
- నేడు, రేపు భారీ వర్ష సూచన

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో గురువారం వరకు స్థిరంగా కొనసాగిన తీవ్ర వాయుగుండం శుక్రవారం నాటికి పెను తుఫాన్‌గా మారింది. పది కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్యంగా పయనిస్తోంది. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న భారత వాతావరణ శాఖ తుఫాన్‌గా బలపడిందని ప్రకటించింది. ఇది మధ్యాహ్నానికి నాగపట్నానికి తూర్పుగా 260 కి.మీ., చెన్నైకు 300 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. తుఫాన్ స్వల్పంగా దిశ మార్చుకుని పశ్చిమ వాయవ్యంగా పయనించి శనివారం మధ్యాహ్నం మహాబలిపురం, క్రైకల్ మధ్య పుదుచ్చేరి సమీపంలో తీరం దాటుతుంది. ఆ సమయంలో గంటకు 70 నుంచి 80, అప్పుడప్పుడు 90 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

తుఫాన్ ఉత్తర తమిళనాడు వైపు దూసుకువస్తున్న నేపథ్యంలో ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు ప్రాంతాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో, శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఇంకా అన్నమయ్య జిల్లాలో భారీ నుంచి అతిభారీ, ప్రకాశం, కడప జిల్లాల్లో భారీవర్షాలు, శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రకాశం, కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపారు. కాగా, తుఫాన్ ఉత్తర తమిళనాడు తీరం దిశగా వస్తున్నందున కోస్తాలో తీరం వెంబడి గాలుల ఉధృతి పెరిగింది. శనివారం దక్షిణ కోస్తాలో గంటకు 70 నుంచి 80, అప్పుడప్పుడు 90 కి.మీ., ఉత్తర కోస్తాలో 45 నుంచి 55, అప్పుడప్పుడు 65 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. ఇంకా.. డిసెంబరు ఒకటి, రెండో తేదీల్లో తీరం వెంబడి గాలులు వీస్తాయని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా తీరంలో అలల ఉధృతి పెరిగింది. తుఫాన్ నేపథ్యంలో ఉత్తర తమిళనాడు సమీపంలో ఉన్న కృష్ణపట్నం ఓడరేవులో ఆరో నంబరు ప్రమాద హెచ్చరిక, ఇతర ప్రధాన ఓడరేవుల్లో రెండో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.



తుఫాన్ పయనించే దిశ

లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో శుక్రవారం అన్నమయ్య, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. రాజంపేటలో 21, రణస్థలంలో 18.75, లావేరులో 17, చీపురుపల్లిలో 14.5 మిల్లీమీటర్ల గరిష్ట వర్షపాతం నమోదైనట్లు అమరావతిలోని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆకస్మిక వరదల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

చినుకులతో రైతుల్లో ఆందోళన

- ధాన్యం కాపాడుకునేందుకు అగచాట్లు

భీమవరం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం 'పశ్చిమ'పై కనిపిస్తోంది. శుక్రవారం ఉదయం వరకు వాతావరణం మబ్బుగా ఉన్నా మధ్యాహ్నం 3 గంటల నుంచి చినుకులు పడటం ప్రారంభించాయి. సాయంత్రానికి ఒక మాదిరి వర్షం కురవటంతో సార్వా ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడిప్పుడే సార్వా కోతలు ఊపందుకుంటున్నాయి. కోత కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం మారటంతో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. కొంత మంది రైతులు రైస్ మిల్లులకు తరలించే చర్యలు చేపట్టారు. వాతావరణం మారటంతో జిల్లా అధికారులు వ్యవసాయాధికారులను అప్రమత్తం చేశారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడు చేసుకోవాలని మిల్లర్లకు సూచిస్తున్నారు. శనివారం వాతావరణం మారి ఏమైనా వర్షాలు పడితే మాత్రం తమకు ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీవారి ఆలయం ముందు ఫొటోషూట్‌పై చర్యలు: టీటీడీ

తిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఫొటోగ్రాఫర్లతో ఫొటోషూట్ నిర్వహించిన వంశీనాథ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. కడప వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వల్లూరి వంశీనాథ రెడ్డి గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు వచ్చాక నలుగురు ఫొటోగ్రాఫర్లతో ఫొటోషూట్ నిర్వహించి ఫొటోలు, వీడియోలు తీయించుకున్నారు. ఈ ఘటన తీవ్రస్థాయిలో విమర్శలకు దారి తీసింది.



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సంభాషిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రామ్‌నాథ్ కోవింద్‌కు గవర్నర్ విందు

- హాజరైన చంద్రబాబు దంపతులు

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం రాత్రి విజయవాడలోని రాజ్‌భవన్‌లో విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి హాజరయ్యారు. గుంటూరు సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన మాజీ రాష్ట్రపతి గౌరవార్థం గవర్నర్ ఈ విందు ఏర్పాటు చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న రామ్‌నాథ్ కోవింద్



రామ్‌నాథ్ కోవింద్‌కు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఈవో రామారావు, అధికారులు, అర్చకులు

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈవో కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. పల్నాడు జిల్లా అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీబాలాచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని కూడా రామ్‌నాథ్ కోవింద్ దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో డిప్యూటీ స్పీకర్



తిరుమల ఆలయం ముందు రఘురామకృష్ణరాజు

తిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేక సేవలో పాల్గొన్న ఆయన రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

త్రిపురాంతకేశ్వరుని సేవలో జస్టిస్ మల్లికార్జునరావు



త్రిపురాంతకం ఆలయంలో జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

త్రిపురాంతకం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకం ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. త్రిపురాంతకేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వయోవృద్ధుల దర్శనాలపై 'సోషల్' అబద్ధాలు!

తిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధుల తిరుమల దర్శనాలకు సంబంధించి అవాస్తవ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'తిరుపతిలో చంద్రబాబు గారి మొదటి సంస్కరణ' పేరుతో ప్రచారం చేయడం విశేషం.

ప్రచారం: 65 ఏళ్లు దాటిన వారు రోజూ తిరుమలలో నేరుగా దర్శనాలకు వెళ్లవచ్చు. ఉదయం 10, మధ్యాహ్నం 3 గంటలకు ఎస్1 కౌంటర్ వద్ద ఫొటో ఐడీ, వయసు ధ్రువీకరణ ఐడీ చూపించి దర్శనాలకు వెళ్లవచ్చు. 30 నిముషాల్లోపు దర్శనం అయిపోతుంది.

వాస్తవం: సీనియర్ సిటిజన్ల దర్శనం రోజూ మధ్యాహ్నం 3 గంటలకు మాత్రమే ఉంటుంది. అది కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి మాత్రమే. నేరుగా వస్తే దర్శనానికి అనుమతించరు. రోజుకు వెయ్యి మందికి మాత్రమే ఈ కోటాలో దర్శనాలు కేటాయిస్తున్నారు.

రాగూర్ ఫార్మాలో ఫాస్జీన్ వాయువు వల్లే ప్రమాదం

- అది పీల్చితే 48 గంటల తరువాత కూడా ప్రభావం
- శాస్త్రవేత్తల బృందం, మానవ హక్కుల వేదిక ఆరోపణ

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో రెండు రోజుల క్రితం రాగూర్ లేబొరేటరీస్‌లో సంభవించిన ప్రమాదంలో అధికారులు, యాజమాన్యం వాస్తవాలను దాస్తున్నారని ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం, మానవ హక్కుల వేదిక శుక్రవారం ఆరోపించాయి. హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ కలుపుతుండగా పొగలు వచ్చాయని, వాటిని పీల్చి కార్మికులు అస్వస్థతకు గురయ్యారని యాజమాన్యం చెబుతోందన్నారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, 27 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. దీనిపై విచారణకు వెళ్లిన ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా ఏమి జరిగిందో స్పష్టంగా చెప్పడం లేదని ఆరోపించారు. వాస్తవానికి యాజమాన్యం చెబుతున్నట్టు హెచ్‌సీఎల్ యాసిడ్, క్లోరోఫామ్ రెండూ కలవవని శాస్త్రవేత్త కె.బాబూరావు, కె.అనురాధ వెల్లడించారు. అక్కడ ట్రై ఫాస్జీన్ పౌడిని వినియోగించి ఉంటారని, దానిని కలిపినప్పుడు క్లోరోఫామ్‌లో మలినాలు ఉన్నా, నీరు ఉన్నా రియాక్షన్ వచ్చి అది విష వాయువుగా మారిపోతుందని, దానిని పీలిస్తే మరణం కూడా సంభవిస్తుందని, 48 గంటల తరువాత కూడా దాని ప్రభావం కనిపిస్తుందని వివరించారు. ఈ ప్రక్రియ అంతా మ్యాన్‌హోల్ మూత తెరిచి చేస్తారని, ఈ పనులకు చదువురాని వారిని ఉపయోగిస్తారని, వారికి ఎటువంటి రక్షణ పరికరాలు ఇచ్చారో తెలియదని అనుమానం వ్యక్తంచేశారు. తనిఖీలకు వెళ్లిన అధికారులు వాస్తవాలు దాయడం తగదని, వారు ఏమి గుర్తించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వ తప్పిదాలతోనే పరిశ్రమల్లో ప్రమాదాలు

- మృతుల కుటుంబాలకు రూ. 40 లక్షల పరిహారం
- మంత్రి వాసంశెట్టి సుభాష్



కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో రాగూర్ ఫార్మా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

అక్కిరెడ్డిపాలెం (విశాఖపట్నం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగానే నేడు పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని రాగూర్ లేబొరేటరీస్‌లో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురై షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను శుక్రవారం మంత్రి పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతపై సేఫ్టీ ఆడిట్‌లను గత ప్రభుత్వం అవగాహన లేని సంస్థలతో తూతూమంత్రంగా నిర్వహించడం వల్లనే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రాగూర్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇరువురు కార్మికులు మృతిచెందడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు 40 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్టు తెలిపారు.



నూతన క్రీడా విధానం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్న క్రీడాకారులకు సీఎం చంద్రబాబు అభివాదం

ముగిసిన సీఎం చంద్రబాబు పర్యటన

- తిరుపతిలో క్రీడాకారుల ఘనస్వాగతం

తిరుపతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియల కోసం స్వగ్రామం వచ్చిన సీఎం చంద్రబాబు ఆ కార్యక్రమాలు పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం విజయవాడ తిరుగు ప్రయాణమయ్యారు. చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.05 గంటలకు ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యంలో శ్రీనివాసమంగాపురం నుంచి తిరుపతి రూరల్ మండలం కాలూరు వరకు రెండు కిలోమీటర్ల మేర.. శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో వందలాదిమంది క్రీడాకారులు రోడ్డుకు ఇరువైపులా నిలుచుని సీఎంకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి ఆయన ప్రత్యేక విమానంలో విజయవాడ బయల్దేరి వెళ్లారు. కాగా, మంత్రి లోకేశ్ నారావారిపల్లి నుంచి ఉదయం 8.30 గంటలకే బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం నుంచి చెన్నై వెళ్లారు.

నేడు 'అనంతపురం'లో సీఎం పర్యటన

అనంతపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారు. బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారు. ఆ తరువాత నేమకల్లు గ్రామస్థులతో చంద్రబాబు సమావేశమవుతారు. ఉండవల్లిలోని నివాసం నుంచి శనివారం ఉదయం 11 గంటలకు రోడ్డుమార్గాన విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బెంగళూరు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో 12.45 గంటలకు నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఎంపిక చేసిన లబ్ధిదారుడి నివాసానికి వెళ్లి పింఛన్ అందజేస్తారు. నేమకల్లు ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు.



ఏపీఎస్‌టీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మోహన్‌కృష్ణ

ఏపీఎస్‌టీఎస్ చైర్మన్‌గా మన్నవ మోహన్‌కృష్ణ ప్రమాణ స్వీకారం

గుంటూరు(తూర్పు), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్‌గా మన్నవ మోహనకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహనకృష్ణను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, గల్లా మాధవి, చదలవాడ అరవిందబాబు, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు!

- డిసెంబరు 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- కార్డుల్లో మార్పులు, చేర్పులకూ అవకాశం

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలకు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం డిసెంబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఇతర సర్వీసులకు కూడా అవకాశం కల్పించనుంది. వైసీపీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు చేయక పోవడంతో రాష్ట్రంలో కొత్తగా పెళ్లిళ్లు అయినవాళ్లు, రాజకీయ కారణాలతో రేషన్ కార్డులు మంజూరు కానివారు వేల సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. కొత్త కార్డు కోసం వచ్చిన దరఖాస్తులు 30,611, స్ప్లిట్ కార్డుల కోసం 46,918, ఉన్న కార్డులో సభ్యుల చేర్పుల కోసం 2,13,007, తొలగింపు కోసం 36,588, చిరునామాల మార్పు కోసం 8,263, కార్డుల సరెండర్ కోసం 685.. మొత్తం 3,36,072 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వారితోపాటు రాష్ట్రంలో కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారందరూ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. డిసెంబరు నెలాఖరులోపు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసి అర్హులకు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్‌కార్డులను ప్రభుత్వం అందజేయనుంది.

భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

- రాష్ట్రంలోని మూడు ప్రధాన ఆలయాలకు కొత్త ఈఓలు

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. మూడు ప్రధాన ఆలయాలకు కార్యనిర్వహణాధికారులుగా డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ ఇచ్చారు. శ్రీశైలం ఆలయ ఈఓగా ఎం.శ్రీనివాసరావు, అన్నవరం ఆలయ ఈఓగా వి.సుబ్బారావు, కాణిపాకం ఆలయ ఈఓగా పెంచల కిశోర్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు (జీఓ-2033) జారీ చేశారు. గత కొంత కాలంగా వెయిటింగ్‌లో ఉన్నవారు, ఇప్పటికే వివిధ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న 62 మందిని బదిలీ చేసి పోస్టింగులు ఇచ్చారు. పార్వతీపురం మన్యం డీఆర్‌ఓగా కె.హేమలత బదిలీ అయ్యారు. తిప్పేనాయక్ తిరిగి అనంతపురంలోనే పోస్టింగ్ సాధించారు. ఆయన్ను కేఆర్ఆర్‌సీకి బదిలీ చేశారు. మన్యం జిల్లా కేఆర్ఆర్‌సీకి ధర్మచంద్రారెడ్డిని పంపించారు. వెలిగొండ స్పెషల్ కలెక్టర్‌గా ఉన్న సువర్ణమ్మను టీటీడీ ఎల్‌ఏ విభాగానికి మార్చారు.

'రేవా'లో 4,537 మందికి పట్టాల ప్రదానం

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ప్రతిష్ఠాత్మక రేవా యూనివర్సిటీ తొమ్మిదో స్నాతకోత్సవంలో 4,537 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాళ జగదీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉద్యోగాలకంటే పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలని ప్రజాప్రభుత్వ సాధనలు, హక్కుల విషయంలో గర్వపడాలన్నారు. చాన్స్‌లర్ పి.శ్యామరాజు మాట్లాడుతూ అకడమిక్ ద్వారా పట్టాలు సాధ్యమని అంతకు మించి నైపుణ్యత పొందేలా యూనివర్సిటీలో సౌలభ్యాలు కల్పించామన్నారు. ప్రొ-చాన్స్‌లర్ ఉమేశ్ ఎస్ రాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.



పట్టాలు పొందిన విద్యార్థులతో రేవా చాన్స్‌లర్ శ్యామరాజు తదితరులు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉపశమనం!

అమెరికా, ఫ్రాన్స్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇది ఓ అరవైరోజులే అమల్లో ఉంటున్నందున, ఆ తరువాత ఏమిటన్న ప్రశ్న ఎలాగూ ఉంది. గద్దెదిగిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఒప్పందాన్ని సగర్వంగా ప్రకటించారు కానీ, ఇజ్రాయెల్ ఇప్పటికే ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోందని వార్తలు వస్తున్నాయి. ఏడాదిగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న బాంబులు ఆగిపోతాయన్న సంతోషం వల్ల కాబోలు, ఒప్పందం అమలులోకి వచ్చిననాడే లెబనాన్ పౌరులు తిరిగి స్వగ్రామాలకు రావడం, ఇజ్రాయెల్ సైన్యాలు ఇంకా అక్కడే ఉండటంతో కొన్ని ఘర్షణలు జరిగాయన్న వార్తలు వింటున్నాం. హిజ్బొల్లా మిలిటెంట్లు నక్కివున్నారన్న ఆరోపణమీద ఒప్పందం కుదిరిన 24గంటల్లోనే ఇజ్రాయెల్ వైమానికదాడులు చేయడమూ చూశాం. త్వరలోనే ఈ పరిస్థితులన్నీ మారి, కాల్పులు నిలిచిపోతాయని నమ్మినప్పటికీ, ఆ శాంతి ఎంతకాలమన్న ప్రశ్న మిగిలేవుంటుంది. లెబనాన్ ప్రవర్తనమీద ఈ ఒప్పందం అమలు ఆధారపడివుంటుందని ఇజ్రాయెల్ ప్రధాని ఓ మాట అని ఉంచారు కూడా.

ఈ కాల్పుల విరమణకీ, ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులో ఇజ్రాయెల్ చేసుకున్న అభ్యర్థనకు సంబంధం ఉన్నదో లేదో తెలియదుగానీ, ఇజ్రాయెల్ మంచిమనసు చేసుకోవడం వెనుక ఏదో మర్మం ఉంది. ఒకపక్క హిజ్బొల్లాతో సంధి కుదర్చుకొని, మరోపక్క గాజాలో పదిమంది పిల్లలతో సహా మరింత మందిని సరికొత్తగా ఊచకోతకోసిన ఇజ్రాయెల్ ప్రధాని, తనమీద జారీ చేసిన అరెస్టువారెంట్లను ఎత్తివేయాలని ఐసీసీకి విజ్ఞప్తిచేసుకున్నారు. తమ పిటిషన్ తిరస్కరించినపక్షంలో ఐసీసీ ఎంత చెడ్డదో మిగతా ప్రపంచానికి తెలుస్తుందనీ, అందుకే పిటిషన్ వేశామని ఇజ్రాయెల్ ఓ బెదిరింపు వ్యాఖ్య కూడా చేసింది. హమాస్‌మీద యుద్ధం పేరిట గాజాను సర్వనాశనం చేసినట్టుగానే, హిజ్బొల్లాను అంతం చేస్తున్నానంటూ లెబనాన్‌లో ఇజ్రాయెల్ తీవ్ర విధ్వంసం సాగించింది. ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య 14నెలలుగా సాగుతున్న యుద్ధంలో లెబనాన్‌లో మరణించినవారి సంఖ్య ఐదువేలలోపు ఉండవచ్చుగానీ, లక్ష ఇళ్ళు నాశనమై, 12లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలిపోవలసివచ్చింది. ఆస్తినష్టం 850 కోట్ల వరకూ ఉండవచ్చునని అంచనా. ఇజ్రాయెల్ మీద హిజ్బొల్లా దాడులకు ప్రతీకారంగా, లెబనాన్‌మీద ఇజ్రాయెల్ అంతకు పదిరెట్లు విరుచుకుపడింది.

ఇజ్రాయెల్–హిజ్బొల్లా ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు అడుగుముందుకు పడిందని కొన్ని పశ్చిమదేశాలు, వాటి మిత్రదేశాలు ముచ్చటపడిపోతున్నాయి. గత సంవత్సరకాలంలో ఇజ్రాయెల్ దాడులకు హిజ్బొల్లా దెబ్బతిన్నది తప్ప, నాశనం కాలేదని, ఇరాన్ సహకారం కొద్దోగొప్పో కొనసాగుతున్నందున అది ఇంకా నిలవగలుగుతోందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. హిజ్బొల్లా దాడులతో దక్షిణ లెబనాన్‌ను అనుకొని ఉన్న ఉత్తర ఇజ్రాయెల్ నిత్యం వొణుకుతున్నది. ప్రాణనష్టం తక్కువగానే ఉన్నప్పటికీ, ఆస్తినష్టం, పంట నష్టం అధికం. హిజ్బొల్లా దెబ్బలకు ఓ యాభైవేలమంది ఇజ్రాయెలీలు ఇల్లూవాకిలీ వదిలిపెట్టి పోవలసి వచ్చింది. వారిని వెనక్కుతేవాలని నెతన్యాహూమీద ఒత్తిడి పెరిగిపోతోంది. అమెరికా, ఫ్రాన్స్ అధినేతలకు లెబనాన్ జనం కంటే, ఇజ్రాయెలీలమీద ప్రేమ ఎక్కువ ఉండటం సహజం. హమాస్, హౌతీ, హిజ్బొల్లా, ఇరాన్.. ఇలా ఓ పరిమితయుద్ధాన్ని అపరిమితం చేసి, ఆర్థికంగానూ, ఆయుధాలపరంగానూ నిండా మునిగిన నెతన్యాహూను బయటపడవేయడానికే ఈ ఒప్పందం కుదిరిందని కొందరి నమ్మకం. ఈ ఒప్పందం అమల్లో ఉన్నకాలంలో మిగతాశత్రువులను తుదముట్టించేందుకు ఇజ్రాయెల్‌కు వీలుకలుగుతుంది. ఆ తరువాత పాలస్తీనా భవిష్యత్తును నిర్ణయించడంలో అమెరికా, ఇజ్రాయెల్ మాట మరింత బలంగా చెల్లుబాటు అవుతుంది కనుక, పశ్చిమాసియా కొత్త చిత్రాన్ని వాటిపక్షాన గీసుకోవచ్చు. అమెరికా, ఇజ్రాయెల్‌కు నచ్చని, గిట్టుబాటుకాని రీతిలో ఏ నిర్ణయమూ జరగదన్న విషయాన్ని గుర్తిస్తే, హిజ్బొల్లాతో ఒప్పందంలోనూ ఈ రెండుదేశాల ప్రయోజనం అర్థమవుతుంది. ప్రస్తుతం దెబ్బతిని ఉన్నందున హిజ్బొల్లా కూడా ఈ కొద్ది విరామానికి అంగీకరించివుండచ్చు. చర్చల్లో అది ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం, ఒప్పందంలో భాగంగా అది ఖాళీచేసిన ప్రాంతాల్లోకి లెబనీస్ సైన్యం రావడం, వారికి అమెరికా, ఫ్రాన్స్ సహాయపడటం వంటి అంశాలు ఒక విధంగా ఆశ్చర్యకరంగా ఉన్నాయి. యుద్ధంలో అలిసిపోయిన ఇజ్రాయెల్, హిజ్బొల్లాలకు కాస్తంత ఉపశమనం ఇవ్వడానికి ఈ ఒప్పందం ఉపకరించవచ్చు.

‘మహా’ విజయం ఎలా సాధ్యమైంది?

ఈ నెల 15న ప్రచురితమైన నా కాలమ్ శీర్షిక ‘వెలలేని మాగాణి మహారాష్ట్ర’. బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి నవంబర్ 20 ఎన్నికలలో ఆ ‘మాగాణి’ని గెలుచుకున్నది. ఆ విజయం తిరుగులేనిది అనడానికి నేనేమీ సంకోచించను. మహారాష్ట్ర శాసనసభలోని 288 సీట్లకు గాను 230 స్థానాలను మహాయుతి స్వాయత్తం చేసుకున్నది.

మహాయుతి మహా విజయానికి ప్రధాన కారణమేమిటి? ఈ విషయమై పెద్ద చర్చ ప్రారంభమయింది. లడ్కీ బెహన యోజన (ఎల్‌బివై) కారణమని అత్యధికులు అంగీకరిస్తున్నారు. ప్రతి గృహిణికి (కుటుంబ వార్షిక ఆదాయం రెండున్నర లక్షల రూపాయల కంటే తక్కువగా ఉన్న పక్షంలో) నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని మహాయుతి వాగ్దానం చేసింది. ముఖ్యమంత్రి శిందే ప్రభుత్వం గత జూలై 1 నుంచి ఆ పథకాన్ని అమలుపరుస్తోంది. 2.5 కోట్ల మంది గృహిణులు ఎల్‌బివై లబ్ధిదారులుగా ఉన్నారు. తమను మళ్లీ ఎన్నుకున్న పక్షంలో ఆ ఆర్థిక సహాయాన్ని రూ.2100కు పెంచుతామని కూడా మహాయుతి హామీ ఇచ్చింది. లడ్కీ బెహన యోజన సంపూర్ణంగా విజయవంతమయింది. వ్యవసాయరంగంలో దురవస్థలు, పెచ్చరిల్లిపోతున్న నిరుద్యోగిత, గ్రామీణ మహిళలకు కొరవడిన ఉపాధి అవకాశాలు, గ్రామీణ వేతనాలు గొర్రె తోకలా ఉండిపోవడం, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలు ఆ ఆర్థిక సహాయ పథకం ప్రజలను విశేషంగా ఆకట్టుకునేలా చేశాయి. అయితే అదేమీ వినూత్న పథకమేమీ కాదు. అదొక అనుకరణ పథకం. మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇప్పటికే అమలవుతున్న పథకాలను అనుసరించి ఎల్‌బివైను రూపొందించారు. సరే, మహాయుతి ప్రధాన ప్రత్యర్థి ఎమ్‌వీఏ సైతం తాము అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సహాయమందిస్తామని హామీ ఇచ్చింది. పాలక, ప్రతిపక్ష కూటముల వాదనలను తుల్యంగా చూస్తే లడ్కీ బెహన యోజన ఎన్నికలలో మహాయుతి విజయానికి దోహదం చేసిన నిర్ణయాత్మకమైన కారణమని నేను భావించడం లేదు.



▪ పి. చిదంబరం

‘పళని’ పలుకు

ఒక ప్రచ్ఛన్న సందేశం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసిందని నేను భావిస్తున్నాను. బీజేపీ నాయకత్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు ఆ సందేశాన్ని మహారాష్ట్ర ఓటర్లకు చేరవేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శ్రేణులు ఆ సందేశాన్ని మరింత విపులంగా ప్రజల మనసుల్లో నాటాయి. బీజేపీ నాయకత్రయం రెండు నినాదాలనిచ్చారు. ఒకటి– ‘ఏక్ హై తో సేఫ్ హై’ (మనం ఒకటిగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం); రెండోది ‘బాతేంగే తో కటేంగే’ (విభజనలతో వినాశనమవుతాం). ఈ నినాదాలు తటస్థ స్వభావంతో ఉన్నట్టు అనిపిస్తుంది కదూ. అయితే అదొక వంచనాత్మక తటస్థత. నిజానికి ఒక నిర్దిష్ట సామాజిక సమూహాన్ని ఉద్దేశించే ఆ నినాదాలనిచ్చారు. ‘లవ్ జిహాద్’, ‘ఓట్ జిహాద్’పై భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు అడ్డు అపూ లేకుండా జరిగాయి. పాత నినాదాలు అయిన ‘తుక్డే తుక్డే గ్యాంగ్’, ‘అర్బన్ నక్సల్స్’ను పునరుద్ధరించి విరివిగా ఉపయోగించుకున్నారు. ఈ సందేశాలను చాల చాకచక్యంగా వెలువరించారు. లక్ష్యంగా పెట్టుకున్న సామాజిక వర్గాలకు చేరేలా చేయడంలో సఫలమయ్యారు. ఇది గమనించిన తరువాత గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ నాయకుల ప్రచారం గుర్తుకు వచ్చింది. ‘మీకు రెండు గేదెలు ఉంటే ఒకదాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకెళుతుంది. మీ మంగళసూత్రాలను సైతం తీసుకువెళతారు. అలా తీసుకువెళ్లిన వాటినన్నిటినీ అధిక సంతానం ఉన్న వారికి ఇచ్చి వేస్తారు’ అని మోదీ ప్రభృతులు ప్రచారం చేయలేదూ?!



‘విభజించి గెలిచే’ రాజకీయ క్రీడను ఎన్డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల ‘విభజించి పాలించు’ వ్యూహానికి భిన్న మైనది కాదు.

బీజేపీ నాయకులు ఏ సామాజిక సమూహానికి ఆ సందేశాలను ఉద్దేశించారన్నది స్పష్టమే. ఆ లక్షిత సామాజిక సమూహానికి ఏ సామాజిక సమూహం నుంచి ప్రమాదం వాటిల్లనున్నదని నర్మగర్భితంగా చెప్పారన్నది కూడా తేటతెల్లంగా తెలుస్తూనే ఉన్నది. కాలమిస్ట్ ఆర్. జగన్నాథన్ (బీజేపీ సానుభూతిపరుడు) ఆ ప్రభావశీల నినాదాలను హిందూ ఓటర్లను సంఘటితం చేసేందుకు ఇచ్చారని అంగీకరించారు. ఈ ఏడాది విజయదశమి రోజున ఆరెస్సెస్ సర్ సంఘ్ ప్రచారక్ మోహన్ భాగవత్ వెలువరించిన ప్రసంగ సారాంశాన్ని ఆ కొత్త నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. మోహన్ భాగవత్ ఆ ప్రసంగంలో ఇలా అన్నారు: ‘అసంఘటితంగా, బలహీనంగా ఉండిపోతే దుర్మార్గుల దురాగతాలను కొని తెచ్చుకోవడమే అవుతుందన్న సత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ తెలుసుకోవాలి’. ఈ నినాదాలు, ప్రసంగాలు అన్నీ విద్వేషపూరిత ప్రచారంలోను, ‘విభజించి గెలవడం’ అనే ఎన్నికల వ్యూహంలో భాగమే.

ప్రతి దేశంలోను మైనారిటీ వర్గాలు ఉంటాయి. అవి మతపరమైనవి లేదా భాషా పరమైనవి లేదా జాతి పరమైనవి కావచ్చు. అమెరికాకు నల్ల జాతి ప్రజలు, లాటినోలు; చైనాకు ఉయిఘర్ ముస్లింలు; పాకిస్థాన్‌కు షియాలు; బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లకు హిందువులు; శ్రీలంకకు తమిళులు, ముస్లింలు; ఆస్ట్రేలియాకు మూలవాసులు; ఇజ్రాయెల్‌కు అరబ్‌లు, యూరోపియన్ దేశాలకు యూదులు, రోమాలు మైనారిటీ వర్గాలు. తమ మైనారిటీ వర్గాల భద్రతకు కౌన్సిల్ ఆఫ్ యూరోప్ 1998లో ‘ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ నేషనల్ మైనారిటీస్’ను ఆమోదించింది తమ తమ సమాజాలలోని అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని పెంపొందించేందుకు, జాతీయ మైనారిటీల సంస్కృతి, అస్తిత్వాన్ని పరిరక్షించేందుకు ఈ ఒడంబడికను ఉద్దేశించారు. రాజనీతిజ్ఞుడు, సామాజిక తాత్వికుడు అయిన డాక్టర్ అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో మైనారిటీల హక్కులను భారత రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులుగా పొందుపరిచారు.

బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువుల హక్కుల పరిరక్షణ విషయమై భారత ప్రభుత్వమూ, భారతీయులూ తరచు భావోద్వేగాలకు లోనవుతుంటారు. పొరుగు దేశాలలోని హిందువుల హక్కుల గురించి ప్రభుత్వ నాయకులు గట్టిగా మాట్లాడుతుంటారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో భారత సంతతికి చెందిన విద్యార్థులకు ఎదురవుతున్న వేధింపుల గురించి కూడా మనం ఆందోళన చెందుతుంటాం. విదేశాలలోని హిందూ ఆలయాలు, సిక్కు గురుద్వారాలపై దాడులు జరిగినప్పుడు మనం బిగ్గరగా మండిపడుతుంటాం. అయితే విదేశాలు, మానవ హక్కుల సంఘాలు మన దేశంలోని మైనారిటీ వర్గాలకు ఎదురవుతున్న వేధింపుల గురించి ప్రస్తావించినప్పుడు, ప్రశ్నించినప్పుడు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి ‘మా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని’ హెచ్చరిస్తుంది. ఇదొక నయవంచన ధోరణి, సందేహం లేదు. బంగ్లాదేశ్‌లో ఒక హిందూ సాధువును అరెస్ట్ చేశారు; ఇస్కాన్‌ను నిషేధించాలన్న డిమాండ్ పెరుగుతోంది. బంగ్లాదేశ్‌లో పరిణామాలకు ప్రతిస్పందనగా మన దేశంలోని ఒక మఠం అధిపతి ‘ముస్లింలకు ఓటింగ్ హక్కులు నిరాకరించాలని’ అన్నట్టు వార్తలు వచ్చాయి. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ రెండు సంకుచిత వైఖరులు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కావు. ‘విభజించి గెలిచే’ రాజకీయ క్రీడను ఎన్డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల ‘విభజించి పాలించు’ వ్యూహానికి భిన్నమైనది కాదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

బౌలర్లు మంచి కెప్టెన్లు కాలేరా?

జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో టీమ్ ఇండియా పెర్త్ నగరంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. బౌలర్‌గా, కెప్టెన్‌గా బుమ్రా అపూర్వ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. చాలా సంవత్సరాల క్రితం అనిల్ కుంబ్లేకు టీమ్ ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని సూచిస్తూ నేను ఒక వ్యాసాన్ని రాశాను. ‘ది హిందూ’లో 26 జూలై 1998న ‘డు బౌలర్స్ మేక్ గుడ్ కెప్టెన్స్?’ అనే శీర్షికతో అది ప్రచురితమయింది. పెర్త్‌లో బుమ్రా బౌలింగ్ నైపుణ్యం, కెప్టెన్సీ సామర్థ్యం చూసిన తరువాత నాకు ఆ వ్యాసం గుర్తుకు వచ్చింది.

ఒక క్రీడాకారుడి –అతడెంత ఆరితేరిన ఆటగాడు అయినప్పటికీ– పక్షాన అలా వాదించడమనేది నా స్వభావానికి విరుద్ధం. అయితే బ్యాటర్లు మాత్రమే ఉత్తమోత్తమ కెప్టెన్లు కాగలరని క్రికెట్ జగత్తులో విస్తృతంగా ఉన్న ఒక విశ్వాసాన్ని త్రోసిపుచ్చేందుకే నేను ఆ వ్యాసాన్ని రాశాను. కెప్టెన్ సొంత జట్టు ఫీల్డ్‌లో ఉన్నప్పుడు కెప్టెన్సీకి మరింత ప్రాధాన్యముంటుంది. బౌలర్లు, ఫీల్డర్లను మార్చడంలో బ్యాటర్లు దృష్టిని కేంద్రీకరించి నిష్పాక్షిక నిర్ణయాలు తీసుకోగలరనే అభిప్రాయం సర్వత్రా ఉంది. బౌలర్లు తమ టీమ్‌కు నేతృత్వం వహిస్తున్నప్పుడు వారు అండర్ బౌలింగ్ లేదా ఓవర్ బౌలింగ్ (సాధారణంగా ఓవర్ బౌలింగ్) చేస్తారని భావించడం కద్దు.

బ్యాటర్-కెప్టెన్ల అనుకూల వాదనలకు చారిత్రక ఆధారాలు సైతం దృఢంగా ఉన్నాయి. టెస్ట్ క్రికెట్ చరిత్రలో అసాధారణ విజయాలు సాధించిన ప్రశస్త కెప్టెన్లు అందరూ బ్యాటర్లే అన్న వాస్తవాన్ని 1998 నాటి నా వ్యాసంలో నేను అంగీకరించాను. డొనాల్డ్ బ్రాడ్‌మన్, క్లైవ్ లాయిడ్ లే కాకుండా లెన్ హట్టన్, ఫ్రాంక్ వర్రెల్, అలెన్ బోర్డర్ (ఆసీస్ స్కిప్పర్‌గా స్టీవ్ వా అనితర సాధ్యంగా ఆడి తన జట్టుకు ఘన విజయాల చరిత్రను సృష్టించక ముందు)లు ఉత్కృష్ట టీమ్ లీడర్స్‌గా జగద్విఖ్యాతులయ్యారు. అయితే బౌలర్లు సైతం టీమ్ లీడర్స్‌గా ఘన చరిత్ర సృష్టించారని నేను వాదించాను. ఆస్ట్రేలియాకు చెందిన రిచీయె బెనౌడ్, ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్‌వర్త్‌లు తమ తమ టీమ్‌లను చరిత్రాత్మక గెలుపు బాటలలో నడిపించడమే అందుకు ఉదాహరణలు.

సరే, నేను ఆ వ్యాసాన్ని రాసిన కాలంలో టీమ్ ఇండియా కెప్టెన్‌గా అజరుద్దీన్ తన క్రికెట్ జీవితం చివరి దశలో ఉన్నారు. అజరుద్దీన్ నిష్క్రమించిన అనంతరం అనిల్ కుంబ్లే ఆయనకు యోగ్యమైన వారసుడు అవుతారని నేను ఆ వ్యాసంలో వాదించాను. కేవలం క్రికెటింగ్ ప్రతిభ ఉన్నవాడే కాకుండా నిశిత మేధ ఉన్న ఆటగాడు అనిల్ కుంబ్లే అని నేను అభిప్రాయపడ్డాను. రంజీ ట్రోఫీలో కర్ణాటక టీమ్ ప్రశస్త విజయానికి కుంబ్లే కెప్టెన్సీ విశేషంగా దోహదం చేసిందని నేను పేర్కొన్నాను. వికెట్లను పడగొట్టడంలో బెనౌడ్‌కు అలన్ డేవిడ్‌సన్ మరో బౌలర్ సహకారం ఉండేది. ఇల్లింగ్‌వర్త్‌కు జాన్ స్నో, డెరెక్ అండర్ వుడ్ లాంటి బౌలర్లు తోడ్పడేవారు. అనిల్ కుంబ్లే అలాగే జవగల్ శ్రీనాథ్‌పై ఆధారపడవచ్చు. భారత్‌కు ప్రపంచ కప్‌ను సాధించిన టీమ్ ఇండియాకు సారథ్యం వహించింది బౌలర్ కపిల్‌దేవ్ అన్న వాస్తవం అవిస్మరణీయమైనది కాదూ?

పావు శతాబ్దికి పూర్వం ప్రచురితమైన ఆ వ్యాసంలో నేను ఇంకా ఇలా పేర్కొన్నాను: ‘బౌలర్లు మంచి కెప్టెన్లు కాలేరన్న అపోహకు కారణమేమిటి? క్రికెట్ క్రీడలో బౌలర్ల హోదాలో క్రింది స్థాయికి చెందినదనే భావనలో భాగమే ఆ అపోహ. క్రికెట్ క్రీడాకారులలో ప్రజాదరణ అధికంగా పొందుతున్నది బ్యాటర్లే. క్రికెట్ అభిమానులకు, క్రికెట్ టోర్నమెంట్స్ వ్యవహారాలకు బాధ్యత వహించే వారికి ఆ వాస్తవం బాగా తెలుసు’. ఇంకా ఇలా రాశాను: ‘క్రికెటింగ్‌కు సంబంధించిన ఇతర విషయాలు అన్నీ సమరీతిలో ఉంటే బౌలర్లు సైతం ప్రశస్త కెప్టెన్‌లుగా రాణించగలరు. శ్రీనాథ్ రంగంలో ఉండి, తన బౌలింగ్ ప్రతిభను ఉత్కృష్టంగా కొనసాగిస్తున్నంత వరకు ప్రత్యర్థి పక్షాన్ని పూర్తిగా చిత్తు చేయడం కుంబ్లేకు పెద్ద కష్టసాధ్యమైన పని కాబోదు. సమయం వచ్చినప్పుడు కుంబ్లేకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే విషయాన్ని తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. బౌలర్లు ప్రభావశీల కెప్టెన్లు కాలేరన్న నిరాధార నమ్మకంతో కుంబ్లేకు కెప్టెన్సీని నిరాకరించకూడదు’.



బ్యాటర్లు మాత్రమే ఉత్తమోత్తమ కెప్టెన్‌లు కాగలరనేది ఒక పాక్షిక సత్యం మాత్రమే. బౌలింగ్‌లో ఉద్దండులు అయిన ఆస్ట్రేలియన్ బెనౌడ్, బ్రిటిష్ ఇల్లింగ్‌వర్త్, మన కపిల్‌దేవ్ తమ టీమ్‌లను గెలుపు బాటలో నడిపించలేదూ? 2008లో పెర్త్‌లో ఓటమి అంచుకు చేరిన భారత జట్టు అసాధారణ విజయం సాధించడానికి బౌలర్ కెప్టెన్ అనిల్ కుంబ్లే, 2024లో పెర్త్‌లోనే ఆస్ట్రేలియాపై టీమ్ ఇండియా జయకేతనం ఎగురవేయడానికి జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ నైపుణ్యం, కెప్టెన్సీ పటిమ కారణం కాదూ?



▪ రామచంద్ర గుహ

గతానుగతం

నేను క్రికెట్ అభిమానినే కానీ క్రికెట్ వ్యవహారాల నిర్వాహకులను ప్రభావితం చేయగలిగేవాడిని కాను కదా. ఈ కారణం గానే నా ప్రతిపాదన పరిశీలనకు నోచుకోలేకపోయింది. నేను ఆ వ్యాసం రాసి ఏడాది గడవక ముందే అజరుద్దీన్ కెప్టెన్సీ నుంచి నిష్క్రమించారు. ఆయన స్థానంలో సచిన్ టెండూల్కర్ వచ్చారు. సచిన్ గతంలో కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించారు. అయితే ఆ కెప్టెన్సీలో ఎలాంటి ప్రత్యేకత లేకపోయింది. ఎనిమిది టెస్ట్ మ్యాచ్‌ల అనంతరం సచిన్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో గంగూలీ వచ్చారు. వివిధ భారతీయ నగరాలలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లలో టీమ్ ఇండియాకు ప్రశస్త విజయాలు సాధించిపెట్టిన చరిత్ర గంగూలీకి ఉన్నది. అయితే ఆయన బ్యాటింగ్ సామర్థ్యం క్షీణముఖం పట్టడంతో కెప్టెన్సీ బాధ్యతను రాహుల్ ద్రావిడ్‌కు అప్పగించారు.

అజరుద్దీన్ అన్నిటి కంటే ముందుగా బ్యాటర్. అనితర సాధ్యమైన బ్యాటింగ్ ప్రతిభ ఆయన సొంతం. టీమ్ ఇండియా కెప్టెన్‌గా ఆయన వారసులు ముగ్గురూ–సచిన్, గంగూలీ, ద్రావిడ్– స్కిప్పర్లు. వికెట్లు పడగొట్టడం, మ్యాచ్‌లు గెలుచుకునేందుకు ఆ ముగ్గురూ అనిల్ కుంబ్లేపై ఆధారపడినవారే.

అజరుద్దీన్ రిటైర్ అయిన తరువాత కెప్టెన్సీ అవకాశానికి కుంబ్లే 83 టెస్ట్ మ్యాచ్‌ల దాకా వేచి ఉండవలసివచ్చింది. 2007లో పాకిస్థాన్‌పై టీమ్ ఇండియాకు సారథ్యం వహించేందుకు కుంబ్లేకు ప్రప్రథమంగా అవకాశం లభించింది. నిజానికి అంతకు ముందు సంవత్సరాలలోను కుంబ్లేను కెప్టెన్‌గా నియమించి ఉన్నట్టయితే ఆయన ఎటువంటి విజయాలు సాధించి ఉండేవారో కదా? మ్యాచ్‌లు గెలవగలిగే సామర్థ్యంలో సచిన్‌కు లభించిన గౌరవమే కెప్టెన్‌గా కుంబ్లేకూ లభించింది. ఫీల్డ్‌లో గంగూలీ మాదిరిగా కుంబ్లే కూడా దూకుడుగా వ్యవహరించేవారు, ద్రావిడ్ వలే ఆయన కూడా సంపూర్ణంగా టీమ్‌కు కట్టుబడిన ఆటగాడు. నేను, మరికొంత మంది ఆశించినట్టు 1999లోనే కుంబ్లే కెప్టెన్ అయి ఉన్నట్టయితే దాదాపు ఒక దశాబ్ద కాలం పాటు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండే అవకాశం ఆయనకు లభించి ఉండేది.

మొత్తం మీద టీమ్ ఇండియా కెప్టెన్‌గా కుంబ్లే స్వల్ప కాలం మాత్రమే ఉన్నారు. 2008లో పెర్త్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్ ఆయన కెప్టెన్సీ చరిత్రలో ఒక ఘనమైన రికార్డు. 2024 పెర్త్ టెస్ట్ వలే ఆనాడు కూడా టీమ్ ఇండియా దాదాపు ఓటమి అంచుకు చేరి అనూహ్యంగా విజయం సాధించింది. అంతకు ముందు సిడ్నీలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఓడిపోయింది. అంపైరింగ్‌లో జరిగిన పొరపాట్లు కూడా ఆ సిడ్నీలో ఓటమికి కారణమయ్యాయి. అటువంటి ప్రతికూల పరిస్థితుల్లో అనిల్ కుంబ్లే నైరాశ్యంలో ఉన్న తన జట్టు సభ్యులను ఉత్సాహపరిచి పెర్త్‌లో విజయానికి నడిపించారు. అసాధారణమైన విజయమది.

2024లో సైతం స్వదేశంలో న్యూజిలాండ్ చేతుల్లో ఘోరంగా ఓడిపోయిన భారత్ జట్టు ఆస్ట్రేలియాలో ఆ దేశ జట్టుపై గెలవడం అసాధ్యమని క్రికెట్ అభిమానులు అందరూ తీర్మానించుకున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, బ్యాటర్ శుభ్‌మన్‌గిల్ లేకపోవడం కూడా టీమ్ ఇండియాకు విజయావకాశాలు ఏ మాత్రం లేవనే అభిప్రాయానికి తావిచ్చింది. అయితే మొదటి రోజు చివరి దశలో భారత్ కెప్టెన్, ప్రతిభావంతుడైన బౌలర్ ఆస్ట్రేలియన్ బ్యాటింగ్ వెన్ను విరిచాడు. ఆ తరువాత రెండు రోజులు భారత ఆటగాళ్లు ప్రశస్తంగా ఆడి ప్రత్యర్థులను నిలువరించి తిరుగులేని విజయం సాధించారు.

పెర్త్‌లో బౌలర్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా తన జట్టుకు నెరపిన అసాధారణ సారథ్యం విస్తృతంగా ప్రశంసలు పొందింది. ఆటలోనేకాదు, మ్యాచ్ ముగిసిన అనంతరం విలేఖర్ల సమావేశంలో బుమ్రా ప్రవర్తించిన తీరు కూడా అందరినీ ఆకట్టుకున్నది. సందేహం లేదు బుమ్రా అసాధారణ ప్రజ్ఞావంతుడు. పరిణత వ్యక్తి. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌కు సమీపిస్తున్నందున ఆయన తరువాత కెప్టెన్సీ బాధ్యతలను బుమ్రాకు అప్పగించాలని ఇప్పటికే పలువురు సూచించారు. రోహిత్‌కు ప్రత్యామ్నాయంగా రిషబ్ పంత్‌ను కొంతమంది ప్రతిపాదించారు. బౌలర్ –కెప్టెన్లపై ఉన్న అపోహల కారణంగానే ఇటువంటి ప్రతిపాదనలకు ఆస్కారమేర్పడుతుంది. అయితే పెర్త్‌లో టీమ్ ఇండియాకు బుమ్రా అందించిన సమర్థ నాయకత్వాన్ని చూసిన తరువాత, రోహిత్ శర్మ వారసుడు ఎవరనేది మరి ఆలోచించనవసరం లేదు.

2008లో పెర్త్‌లో టీమ్ ఇండియా విజయం సాధించినప్పుడు కెప్టెన్ కుంబ్లే వయసు 37 సంవత్సరాలు. ఆ సంవత్సరాంతంలోగానే ఆయన టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. 2024లో పెర్త్‌లో టీమ్ ఇండియా విజయానికి కారకుడైన బుమ్రా ఇంకా 31వ వసంతంలోకి ప్రవేశించలేదు. రోహిత్ శర్మ రేపో మాపో క్రికెట్ నుంచి నిష్క్రమించనున్నారు. బుమ్రాకు టెస్ట్ క్రికెట్‌లో నాలుగు లేదా ఐదు సంవత్సరాల పాటు అవకాశాలు ఉన్నాయి.

ఒకనాడు కుంబ్లే వలే బుమ్రా కూడా భారతదేశ అగ్రగామి స్ట్రైక్ బౌలర్. కుంబ్లేకు వలే బుమ్రా కూడా వికెట్లను తీసుకునే సహచర ఆటగాళ్ల సహాయ సహకారాలు సమృద్ధిగా ఉన్నాయి. వారిలో అశ్విన్, జడేజా, షమీ ప్రముఖులు. ఈ ముగ్గురూ బుమ్రా కంటే వయస్సులో పెద్దవారు. ఒకటి రెండేళ్లలో క్రికెట్ నుంచి రిటైర్ అయ్యేవాళ్లే. అయితే సిరాజ్, కుల్దీప్‌లు బుమ్రా కంటే చిన్నవాళ్లు. హర్షిత్ రాణా వలే పెర్త్‌లో తమ ప్రతిభాపాటవాలను చూపిన యువ బౌలర్లు ఉన్నారు. ఇది బుమ్రాకు శుభసూచకం. ఆయన నిస్సందేహంగా టీమ్ ఇండియాకు ప్రశస్తమైన బౌలర్–కెప్టెన్ కాగలరు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

విశాఖ ఉక్కుకై మహాధర్నా

ఉద్యమాల పునాదులపై ప్రాంతాలకతీతంగా, ఆత్మత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు నేడు తన మనుగడకే ముప్పు వాటిల్లగా, నిస్సహాయ స్థితిలో మనందరి సాయం కోసం ఎదురుచూస్తోంది. రాజకీయ జూదంలో పావుగా మారి, ప్రైవేటీకరణ ఉచ్చులో చిక్కి అటు ఉనికి, ఇటు ప్రగతి రెండూ కోల్పోతోంది.

క్యాపిటలిస్టు శక్తులకు లొంగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల నుండి ఎలెక్టోరల్ బాండ్ల రూపేణా నిధులు సంపాదిస్తూ, బదులుగా వారికి మేళ్లు అందించడానికి ప్రభుత్వ ఆస్తులు, భూములు, సంస్థలు, పరిశ్రమలు వారికి కట్టబెడుతున్నారు. ఈ తంతులో బలిపశువుగా మారిన మరొక్క సంస్థ మన విశాఖ ఉక్కు. తెలుగువారికి గర్వకారణం, విశాఖ కిరీటంలో అమూల్యమైన వజ్రంలాంటి విశాఖ ఉక్కును అప్పుల పేరుతో అమ్మజూపే కుట్రకు తెర లేపారు కేంద్రప్రభుత్వం వారు. దీనికి తానా అంటే తందానా అంటూ తలూపుతున్నారు ఇక్కడి పాలక, ప్రతిపక్ష పార్టీలు.

కేవలం రూ. 20,000 కోట్ల అప్పును ఒక తప్పుగా చూపి, ఇక మేము నడపలేము అని ఉక్కును ప్రైవేటుపరం చేస్తుంటే, తెలుగు సమాజం, రాష్ట్ర పార్టీలు, ప్రజలు, మీడియా అందరమూ ఏకమై, ఉక్కు సంకల్పంతో, ఉక్కుపిడికిలితో అడ్డుకోవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న పాలకపక్షం, వారి మిత్రపక్షాలు, ప్రతిపక్షం, ఇతర పార్టీలు, ఇవేవీ కేంద్రానికి ఎదురుగా నిలిచి విశాఖ ఉక్కుకోసం పోరాడే పరిస్థితుల్లో లేవు. ఎందుకంటే వారికీ వారి కేసులు ముఖ్యం, ఎంతో కొంత వచ్చే కాంట్రాక్టులు ముఖ్యం.


ఇటువంటి సందర్భంలో భయం, ద్వంద్వనీతి, దురాశ లేకుండా, విశాఖ ఉక్కుకోసం పోరాటాన్ని ఉధృతం చేసే బాధ్యత బహుజన్ సమాజ్ పార్టీ తన భుజం మీద వేసుకుంది. ఉక్కు ప్రైవేటీకరణతో తీవ్రంగా నష్టపోయేది స్థానిక ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదలు అని బహుజన్ సమాజ్ పార్టీ ఆవేదన చెందుతోంది.

ఉక్కును నమ్ముకున్న ఎందరో కులవృత్తులవారు, ఉక్కును జీవనాధారం చేసుకుని బతుకుతున్న కార్మికులు, వారి కుటుంబాలు, చిరు వ్యాపారస్తులు, ఇతర పనులవారు, ఈ ప్రైవేటీకరణతో రోడ్డుపాలవుతారు. బీఎస్పీ వీరందరికోసం నిలుస్తూ, శక్తులన్నిటినీ సంఘటితపరిచి ముందుకు సాగుతుంది. ఇందులో భాగంగా డిసెంబర్ 1న విశాఖ ఉక్కు కర్మాగారం ముందు మహాధర్నా నిర్వహించతలపెట్టింది. ఈ ధర్నాలో రాష్ట్ర నలుమూలల నుండి బీఎస్పీ పార్టీ కార్యకర్తలు, నేతలు, యువత, కార్మికులు పాల్గొంటారు. ఈ ధర్నాకు సమస్త ప్రజానీకం మద్దతునివ్వాలని కోరుతున్నాం. మద్దతు బేషరతుగా అందించి, మా గళాన్ని, తపనను మీ పత్రికలూ, చానళ్ల ద్వారా ప్రజలకు చేరవేయమని ప్రార్థిస్తున్నాము.

– డా. జుజ్జవరపు పూర్ణచంద్రరావు
కోఆర్డినేటర్, బహుజన్ సమాజ్ పార్టీ, ఆంధ్రప్రదేశ్

విశిష్ట ట్రేడ్ యూనియనిస్ట్ ఎన్. వి. భాస్కరరావు

హైదరాబాదు నగర సిపిఐ(ఎం) పార్టీ, సిఐటియు వ్యవస్థాపకులు కామ్రేడ్ ఎన్.వి. భాస్కరరావు వాటి నిర్మాణం, విస్తరణ క్రమంలో (1964–84) ముఖ్యపాత్ర నిర్వహించారు. భాస్కరరావు సహచరుల, అనుయాయుల జ్ఞాపకాలను అనుభవజ్ఞులైన సంపాదకవర్గం సాయంతో ఆయన ముగ్గురు కుమార్తెలు రూపొందించిన ‘హైదరాబాదు కార్మికోద్యమ దశ, దిశ మార్చిన కా. ఎన్.వి. భాస్కరరావు’ పుస్తకాన్ని కా. బి.వి.రాఘవులు (సిపిఐఎం పొలిట్ బ్యూరో సభ్యులు) నవంబర్ 30న ఉ. 11.గం.లకు సిపిఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ 23వ మహాసభల ప్రారంభ సభలో ఆవిష్కరిస్తారు. హైదరాబాద్ ఎస్.ఆర్. నగర్ మెట్రో సమీపంలోని శ్రీనివాసనగర్ వెస్ట్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.



ఎన్.వి. భాస్కరరావు కృష్ణా జిల్లా చల్లపల్లి దగ్గరున్న కమ్యూనిస్టు ప్రభావిత నాదెళ్ళవారి పాలెం అనే గ్రామంలో 1931 జనవరి 9న నాదెళ్ళ రంగయ్య, వెంకట నర్సమ్మ దంపతులకు జన్మించారు. ఆ ఊరిలోని కొంత మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులతోపాటు, పుచ్చలపల్లి సుందరయ్య ప్రభావం అతిచిన్న వయస్సులోనే భాస్కరరావు మీద పడింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సమయంలో (1946–1951) ముఖ్య నాయకులకు కొరియర్‌గా భాస్కరరావు రాజకీయ ప్రస్థానం మొదలైంది. పార్టీ ఆఫీసు కార్యదర్శిగానూ, సిపిఐ(ఎం) శాసనసభాపక్ష ఆఫీసు కార్యదర్శిగాను, పార్టీ కార్యక్రమాలలోనూ భాస్కరరావు చురుగ్గా పనిచేశారు. 1964లో పార్టీ మొట్టమొదటి చీలిక తరువాత నుండి, చనిపోయేవరకు (1984 అక్టోబర్ 24) సిపిఐ(ఎం) హైదరాబాదు నగర కార్యదర్శిగా పనిచేశారు. 1970–84 మధ్యకాలంలో ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులతో కలసి ట్రేడ్ యూనియన్ రంగంలో గుణాత్మకమైన మార్పులను తీసుకొని రాగలిగారు. ప్రభుత్వ రంగ సంస్థలలోను, ప్రైవేటు రంగ పరిశ్రమలలోను, ఇన్సూరెన్స్ బ్యాంకింగ్ రంగాలలోను, ప్రభుత్వోద్యోగుల సంఘాలలోను, ఇతర ప్రజాసంఘాలలోను సిఐటియుని, పార్టీని నగరంలోని అనేక ప్రాంతాలకు విస్తరింపచేశారు. చాలా మంది పార్టీ కార్యకర్తలను భాస్కరరావు ఓర్పుతో, పట్టుదలతో నిబద్ధతతో నాయకులుగా తీర్చిదిద్దారు. నిశితమైన విప్లవ లక్ష్యంతో తుదిశ్వాస వరకు నిలబడిన ఆదర్శమూర్తి ఎన్.వి. భాస్కరరావు.

– శ్యామల, నిర్మల, ప్రమీల



రాజ్యాంగానికి మార్గదర్శకుడు

భారత రాజ్యాంగ నిర్మాతగా డా. బి.ఆర్. అంబేడ్కర్‌ను గౌరవిస్తున్నాము. మన రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కృషి ఎనలేనిది. అయితే భారత రాజ్యాంగం రూపకల్పన వెనుక మరో మహనీయుడి కృషి కూడా ఉంది. ఆయనే బి.ఎన్. రావు.

బెనెగల్ నర్సింగరావు 26 ఫిబ్రవరి 1887న జన్మించారు. ఆయన ఇంగ్లీష్, ఫిజిక్స్, సంస్కృతంలో ట్రిపుల్ ఫస్ట్ డిగ్రీతో 1905లో పట్టభద్రుడయ్యారు. 1906లో గణితంలో అదనపు మొదటి పట్టా పొందారు. స్కాలర్‌షిప్‌పై, కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కాలేజీకి వెళ్లారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, భారత ప్రభుత్వ చట్టం, 1935 ముసాయిదా రూపకల్పనపై భారత ప్రభుత్వ సంస్కరణల కార్యాలయంతో కలిసి పనిచేశారు. ఆ తర్వాత ఆయన కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు, కానీ భారత ప్రభుత్వం అతనికి అప్పగించిన రెండు అదనపు ప్రాజెక్టుల వల్ల అతని పదవీ కాలానికి అంతరాయం కలిగింది. బి.ఎన్.రావు మొదట రైల్వేలో వేతనాలు, పని పరిస్థితులకు సంబంధించిన విచారణ కోర్టుకు అధ్యక్షత వహించారు. భారతదేశంలో, ఆపై హిందూ చట్టానికి సంబంధించిన సంస్కరణలపై కమిషన్ పని చేస్తుంది. 1942లో నదీతీర హక్కులపై ఒక నివేదికను సమర్పించిన సింధు జలాల కమిషన్‌కు అధ్యక్షుడిగా కూడా ఆయన మళ్లీ నియమితులయ్యారు.

రావు 1946లో భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో రాజ్యాంగ పరిషత్‌కు సలహాదారుగా పనిచేశారు. 1948 ఫిబ్రవరిలో దాని ప్రారంభ ముసాయిదాను ఆయన సిద్ధం చేశారు. ఈ ముసాయిదాను భారత రాజ్యాంగ సభ చర్చించి, సవరించి చివరకు ఆమోదించింది. ఆయనను భారత రాజ్యాంగానికి మార్గదర్శకుడు అని కూడా పిలుస్తారు.

– యం. రాం ప్రదీప్
(నేడు బి.ఎన్. రావు వర్ధంతి)

మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలు తీరేదెన్నడు?

ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో (164 మోడల్ స్కూల్స్) ప్రస్తుతం రెగ్యులర్ ప్రిన్సిపాల్స్, పీజీటీ, టీజీటీ టీచర్లు విద్యా సేవలు అందిస్తున్నారు. ఈ మోడల్ స్కూల్స్ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిన ప్రత్యేకమైన ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు. ప్రస్తుతం ఈ పాఠశాలలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే నడపబడుతున్నాయి. సిబ్బంది మాత్రం పలు సర్వీస్ అంశాల్లో సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది తమ రిటైర్మెంట్ వయస్సును 60ఏళ్ల నుంచి 62ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మోడల్ స్కూల్స్ రెగ్యులర్ సిబ్బందిని పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ పరిధిలోకి తీసుకురావడంతో పాటు, 010 హెడ్ ఆఫ్ అకౌంట్స్ ద్వారా జీతాలు చెల్లించడం వంటి చర్యలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే చేపట్టినప్పటికీ, వీరికి నిర్దిష్టమైన సర్వీస్ మార్గదర్శకాలపై ఇంకా స్పష్టత లేదు. జీవో.ఎంఎస్ పాఠశాల విద్య 23 ప్రకారం, మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచింగ్ సిబ్బందికి అన్ని రకాల ప్రభుత్వ సర్వీస్ ప్రయోజనాలు కల్పిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్ సిబ్బందికి అందించే అన్ని రకాల సర్వీస్, ఆర్థికపరమైన ప్రయోజనాలు కల్పించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం 23 జీవో ప్రకారం స్పష్టం చేసింది. ఈ క్రమంలో, మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయస్సు పెంపు తమ ఉద్యోగ జీవితానికి చివరి దశలో ఆర్థిక భద్రతను పెంపొందించడమే కాకుండా, తమ అనుభవాన్ని విద్యార్థులకు మరింత మెరుగ్గా అందించడానికి వీలు కల్పిస్తుందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 164 మండలాల్లో మాత్రమే మోడల్ స్కూల్స్ ఉన్న విషయం తెలిసిందే. ఈ పాఠశాలల ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని, మోడల్ స్కూల్స్ సిబ్బందికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయగలదని సిబ్బంది ఆశిస్తున్నారు. రిటైర్మెంట్ వయస్సు పెంపుతో పాటు ఇతర సర్వీస్ ప్రయోజనాలు అమలు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన తుది నిర్ణయం తీసుకుని సంబంధిత జీవోలను జారీ చేయాలని మోడల్ స్కూల్ టీచింగ్ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

– బి.సురేష్, అధ్యక్షులు
మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ, ఆంధ్రప్రదేశ్







• నాణెమైన ప్రదర్శన

రకరకాల నాణేలు.. కలర్‌ఫుల్ కరెన్సీ నోట్లు.. వాటి చరిత్ర, అందులో దాగి ఉన్న కోణాలు.. అబ్బో ఒక్కటేమిటి.. వందల సంఖ్యలో నాణేలు, నోట్లన్నీ ఒకేచోట కొలువుదీరాయి. సూర్యారావుపేటలోని చిలుకు దుర్గయ్య వీధిలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024 (కాయిన్స్, స్టాంప్స్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్) శుక్రవారం ప్రారంభం కాగా, మునుపెన్నడూ చూడని, అసలు వాడుకలోనే లేని ఎన్నో నాణేలు, కరెన్సీ నోట్లు కళ్ల ముందు వాలాయి. ఆదివారం వరకు జరిగే ఈ ప్రదర్శనకు తొలిరోజే సందర్శకులు పోటెత్తారు.

8లో

జూన్ నాటికి సురక్షిత కృష్ణా జలాలు

కిడ్నీ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

- ఎ.కొండూరులో కలెక్టర్ లక్ష్మీశ పర్యటన
- పైపులైన్ పనులపై ఆరా

6లో

పరిశ్రమలకు కరెంట్ షాక్

విద్యుత్ సుంకం (ఎనర్జీ డ్యూటీ) తగ్గించి పారిశ్రామిక రంగాన్ని ఆదుకోవాలని, తద్వారా సిక్ ఇండస్ట్రీ జాబితాలోకి చేరకుండా నియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పారిశ్రామిక రంగం విజ్ఞప్తి చేస్తోంది. సిక్‌లోకి వెళ్లిన పరిశ్రమలను తిరిగి బతికించాలన్నా, ఆ జాబితాలో చేరకుండా ఉండాలన్నా ఈడీని తగ్గించాలంటోంది.

వైసీపీ హయాంలో విద్యుత్ సుంకం పెంపు

- 6 పైసల నుంచి ఏకంగా రూపాయికి..
- పరిశ్రమలపై ఒక్కసారిగా పెనుభారం
- ఉమ్మడి కృష్ణాలో నాలుగు మిల్లుల మూత
- తగ్గించాలంటూ కూటమి ప్రభుత్వానికి పారిశ్రామికవేత్తల విజ్ఞప్తి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వినియోగదారులపై విద్యుత్ సుంకం అనేది ఎప్పటినుంచో ఉంది. ప్రజలపై కానీ, పరిశ్రమలకు కానీ 1964 నుంచి కేవలం ఆరు పైసలే ఎనర్జీ డ్యూటీ (ఈడీ) విధించేవారు. కొన్ని దశాబ్దాల పాటు స్థిరంగా ఉంటున్న ఈ విద్యుత్ సుంకాన్ని కిందటి వైసీపీ ప్రభుత్వంలో రూపాయికి పెంచారు. దీంతో పారిశ్రామిక రంగంపై భారం పడింది. కరోనా అనంతర పరిస్థితుల్లో ఈ విద్యుత్ సుంకం పారిశ్రామిక రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఫలితంగా కొన్ని పరిశ్రమలు వెంటిలేటర్‌పైకి చేరాయి. భారీ యంత్రాలు వినియోగించే పరిశ్రమలు ఎక్కువగా ఈ ప్రభావానికి గురయ్యాయి. వీటిలో ఎక్కువగా స్పిన్నింగ్ మిల్లులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 95 స్పిన్నింగ్ మిల్లులు ఉంటే, అందులో 35 వరకు మూతపడ్డాయి. ఎన్టీఆర్ జిల్లాలో రెండు, కృష్ణాజిల్లాలో రెండు స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయి.

కూటమి ప్రభుత్వంలోనూ..

కిందటి వైసీపీ ప్రభుత్వం విధించిన విద్యుత్ సుంకం చార్జీలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో అయినా తగ్గుతాయనుకుంటే ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశం ఆ ఆశ కూడా లేకుండా చేసింది. పరిశ్రమల వరకు ఈ సుంకాన్ని యథాతథంగా ఉంచాలని నిర్ణయం తీసుకోవటంతో పారిశ్రామిక రంగం షాక్‌కు గురైంది. కాగా, డిస్కమ్స్, విద్యుత్ సంస్థల అసమర్థత కారణంగా తలెత్తిన నష్టాలను పరిశ్రమలపై మోపడం తగదని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. పెంచదలచుకుంటే సహేతుకంగా ఉండేలా 10 నుంచి 12 పైసల వరకు పెంచాలంటున్నారు. అలాకాకుండా, అధికారులు చెప్పారని కిందటి ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయటం సరికాదనేది పారిశ్రామికవేత్తల వాదన.

ట్రూ అప్ చార్జీలు మరో భారం

ట్రూ అప్ చార్జీల భారం పారిశ్రామిక రంగానికి గుదిబండగా మారింది. 2014-19లో ట్రూ అప్ చార్జీలు 22 పైసలుండగా, 2023-24లో 40 పైసలకు చేరింది. ఇది విద్యుత్ వినియోగదారులపై తీవ్ర భారాన్ని మోపింది. తాజాగా 2022-23లో రూ.6 వేల కోట్ల నష్టాన్ని చూపిస్తూ 60 పైసలు, 2023-24లో పెంచని కారణంగా చవిచూసిన 11 వేల కోట్ల నష్టాలకు కలిపి రూపాయి చొప్పున విధించబోయే పరిస్థితులు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

మనుగడ కష్టమే..

ఎనర్జీ డ్యూటీ (ఈడీ)ని కిందటి ప్రభుత్వంలో రూపాయికి పెంచారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిని 12 పైసలకు తగ్గించాలని కోరుతున్నాం. పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. వీటిపై ఆధారపడి ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. సిక్ ఇండస్ట్రీస్‌ను బతికించటానికి విద్యుత్ సుంకంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. స్పిన్నింగ్ మిల్లులపై రోజుకు రూ.20 వేలు, నెలకు రూ.20 లక్షలు, ఏడాదికి రూ.2.40 కోట్ల మేర భారం పడుతోంది. ఒక స్పిన్నింగ్ మిల్లు లేదా ఏదైనా పరిశ్రమకు ఏడాదికి రూ.2 కోట్ల లాభం వస్తే.. రూ.2.40 కోట్ల చెల్లింపులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి వాటివల్ల స్వల్ప లాభాలతో ఉన్న పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం విద్యుత్ సుంక నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి.

- పి.కోటిరావు, ఏపీ చాంబర్స్ డైరెక్టర్

రసాభాస

వాడీవేడిగా వీఎంసీ కౌన్సిల్ సమావేశం

- వరద సాయంపై ప్రశ్నించిన వైసీపీ
- ధీటుగా సమాధానం ఇచ్చిన టీడీపీ
- కుక్కల బెడదపై నిలదీసిన టీడీపీ కార్పొరేటర్లు
- మేయర్ తీరుపై విమర్శలు



కౌన్సిల్ హాల్లో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం

చిట్టినగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీఎంసీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం రసాభాసగా సాగింది. వరద బాధితులను ఆదుకోవడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందని వైసీపీ కార్పొరేటర్లు ఆరోపించడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం సాగింది. ప్రతిఘటించిన టీడీపీ కార్పొరేటర్లు పది రోజులు సీఎం చంద్రబాబు కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి వరద ప్రభావాన్ని ప్రత్యక్షంగా సమీక్షించారని, ఏ ముఖ్యమంత్రి చేయలేని పనిచేశారని చెప్పారు. ఇంతలో వైసీపీ కో-ఆప్షన్ సభ్యురాలు పూర్ణమ్మ కలగజేసుకుని.. సహాయం అందక ఎంతోమంది బాధితులు ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, బాధితులకు ఇచ్చిన సాయం చంద్రబాబు తన సొంత డబ్బుతో చేయలేదని, జోలెపట్టి అడుక్కున్నారని అనడంతో టీడీపీ కార్పొరేటర్లు మండిపడ్డారు. దీంతో ఇరుపక్షాల మధ్య వివాదం తారస్థాయికి చేరింది. మేయర్ కలగజేసుకుని.. ఓ మహిళా కార్పొరేటర్‌ను.. టీడీపీ కార్పొరేటర్లు సిగ్గుచేటు అని మాట్లాడటం ఏమిటని, అలా మాట్లాడిన ముమ్మనేని వెంకటప్రసాద్ సారీ చెప్పాలని, లేకుంటే సస్పెండ్ చేస్తానన్నారు. భోజన విరామం అనంతరం ముమ్మనేని వెంకటప్రసాద్ మాట్లాడుతూ తాను ఎవరినీ అగౌరవపరిచేలా మాట్లాడలేదని, అలా జరిగి ఉంటే తన మాటల్ని వెనక్కి తీసుకుంటున్నానని అనడంతో సభ మళ్లీ మొదలైంది. ప్రశ్నోత్తరాల సమయంలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి చర్చ జరిగింది. అభివృద్ధి పనులు, జరగాల్సినవి, ఎంత డబ్బు, ఏయే పనులకు ఖర్చు చేశారనే అంశాలపై వాడీవేడి చర్చ జరిగింది. కాంట్రాక్టర్లకు బిల్లు ఎందుకు చెల్లించలేకపోతున్నారని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రశ్నించారు.

> పాలక, ప్రతిపక్షాల ప్రశ్నలు, ఆరోపణల నడుమ శుక్రవారం నాటి వీఎంసీ కౌన్సిల్ సమావేశం నామమాత్రంగానే ముగిసింది. వరద బాధితులకు సాయంపై వైసీపీ ప్రశ్నించడం, ధీటుగా టీడీపీ సమాధానం చెప్పడంతో ఒక సమయంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పన్నుల వసూలు, కుక్కల బెడదపై ప్రధానంగా చర్చ నడిచింది.

ఏకపక్షంగా మేయర్ తీరు

కౌన్సిల్‌లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. సొంత వైసీపీ అజెండాను అమలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మేయర్ స్థానంలో ఉన్నామన్న సంగతి మరిచి ఆమె వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ కార్పొరేటర్లు గళం వినిపించకుండా.. ఆమె ప్రతి విషయాన్ని ప్రతిఘటించి, సభను ముందుకు సాగకుండా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలి

పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రజారోగ్య విభాగంలో అర్హులైన వారిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలని, ఫలితంగా పనులు సక్రమంగా నిర్వహించే అవకాశం ఉంటుందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. నగరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా సుమారు 17 మంది, హెల్త్ అసిస్టెంట్లుగా ఎనిమిది మంది ఉన్నారని, మిగిలిన వారంతా మేస్త్రీలు, కిందిస్థాయి సిబ్బందితో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే మేయర్ కల్పించుకుని.. గత టీడీపీ హయాంలోనే నియామకాలు జరిగాయన్నారు. దీన్ని ఖండించిన టీడీపీ కార్పొరేటర్లు.. వైసీపీ హయాంలోనే కొందరు పలుకుబడి, డబ్బు పెట్టి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా వచ్చారని ఆరోపించారు.

జక్కంపూడి సమస్య తీర్చండి

జక్కంపూడి హౌసింగ్ కాలనీ పారిశుధ్య నిర్వహణకు సంబంధించి 41 మంది కార్మికులను ఏర్పాటు చేసి, వారికి జనరల్ ఫండ్స్

మిగతా 8లో..

ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా డివిజన్-2 ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.శ్రీకాంత్ చౌదరి బదిలీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఆయన్ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్.వెంకటేశ్వర్లు ఎన్టీఆర్ జిల్లా డివిజన్-2కు బదిలీపై వచ్చారు. జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారిగా ఉన్న శ్రీకాంత్ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'అవినీతి మేత' కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆయన్ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



పోలీస్ పోటీలు నగరంలోని ఏఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న పోలీసుల క్రీడాపోటీలు రెండో రోజు శుక్రవారం కూడా ఉత్సాహంగా జరిగాయి. వివిధ పోటీల్లో పోలీసులు తమలోని ప్రతిభను చూపారు.

మొండి బకాయిలు

దుర్గగుడి షాపులకు పెరిగిన అద్దె బకాయిలు

- వసూలులో అధికారుల మీనమేషాలు
- రూ.కోట్లలో పేరుకుపోయిన అద్దెలు

కొందరికి నోటీసుల జారీ



వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి చెందిన షాపుల అద్దె బకాయిల వసూలులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వెంటనే వసూలు చేయాలంటూ ఈవో కేఎస్ రామారావు పదేపదే ఆదేశాలు ఇస్తున్నప్పటికీ అధికారులు బకాయిపడిన వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు తప్ప వసూలు మాత్రం చేయట్లేదు. కనకదుర్గా నగర్‌లో మొత్తం 24 షాపులుండగా, వీటిలో 21 షాపులు వ్యాపారులకు కేటాయించారు. వీరు మొదట్లో అద్దెలు సక్రమంగానే చెల్లించినప్పటికీ ఆ తర్వాత ఆపేశారు. దీంతో ప్రస్తుతం ఈ షాపుల అద్దె బకాయిలు సుమారు రూ.2.50 కోట్లకు చేరాయి. అధికారుల తీరుపై ఈవో సీరియస్ కావటంతో తొమ్మిది మంది వ్యాపారుల నుంచి రూ.కోటి 20 లక్షలు వసూలు చేశారు. ఈ క్రమంలో అభివృద్ధి పనుల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో అన్ని షాపులను ఈవో ఖాళీ చేయించారు. ఆ తర్వాత అద్దె బకాయిలు చెల్లించిన తొమ్మిది మందికే అధికారులు షాపులు కేటాయించారు. మిగిలినవారు సుమారు కోటిన్నర రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కాగా, బకాయిలు పడిన కొందరు వ్యాపారులు మళ్లీ షాపులు దక్కించుకోవటానికి అధికారులు, రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

నోటీసులు జారీ

కాగా.. గోశాల సమీపంలో ఏర్పాటుచేసిన మరికొంతమంది షాపు నిర్వాహకులకు శుక్రవారం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ ఉన్న తొమ్మిది మంది వ్యాపారులు సుమారు రూ.50 లక్షల అద్దె బకాయి ఉన్నారు. ఈ మొత్తం వారంలో చెల్లించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నారు. కాగా, అద్దె తగ్గించాలని కోరుతూ ఈ తొమ్మిది మంది వ్యాపారులు ఈవోకు లేఖ రాశారు. అధికారులు మాత్రం అద్దెలు చెల్లించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.

అక్రమమా.. సక్రమమా..?

రేషన్ మాఫియాకు అధికారుల పరోక్ష సహకారం



జిల్లాలో పట్టుబడిన పీడీఎస్ బియ్యానికి వేలం

- వేలంలో పాల్గొంటున్నది అక్రమ వ్యాపారులే..
- ఆక్షన్ సర్టిఫైడ్ రశీదుతో బియ్యం మళ్లీ వారి చేతికే..
- అధికారికంగా సరిహద్దులు దాటిస్తున్న వ్యాపారులు
- అక్కడి నుంచి ఆఫ్రికా దేశాలకు తరలింపు
- అధికారుల ఆక్షన్‌పై వెల్లువెత్తుతున్న విమర్శలు

> పేదల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ విజయవాడ సరిహద్దుల్లో ఓ వ్యాపారి అధికారుల చేతికి చిక్కాడు. ఇలా జిల్లాలో పక్కదారి పడుతున్న బియ్యాన్ని పట్టుకుంటున్న సివిల్ సప్లయిస్ అధికారులు వాటికి బహిరంగంగా వేలం వేస్తున్నారు. ఈ వేలంలో బియ్యాన్ని ఎవరైతే వ్యాపారి పక్కదారి పట్టించాడో అతడో లేక అతడి బినామీనో పాల్గొంటున్నాడు. ఇలా పట్టుబడిన బియ్యం చివరికి ఆ వ్యాపారే పాడుకుంటున్నాడు. ఈసారి వేలంపాట ద్వారా వచ్చిన సర్టిఫైడ్ రశీదుతో సదరు వ్యాపారి స్వేచ్ఛగా ఆ బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నాడు. ఇంతా జరుగుతున్నా.. అన్నీ తెలిసిన సివిల్ సప్లయిస్ అధికారులు అక్రమార్కులకు సహకరిస్తుండగా, అసలు ఈ వేలం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అధికారుల తనిఖీల్లో పట్టుకున్న రేషన్ బియ్యానికి ఆక్షన్ వేసే ముసుగులో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. పట్టుకున్న పీడీఎస్ బియ్యానికి సివిల్ సప్లయిస్ అధికారులే గంపగుత్తగా వేలం వేస్తున్నారు. ఈ వేలానికి అక్రమ బియ్యం వ్యాపారులే తమ బినామీలను పంపుతున్నారు. వారితో పాట పాడిస్తున్నారు. ఫలితంగా ఆ బియ్యం మళ్లీ అక్రమ వ్యాపారుల చేతికే

మిగతా 6లో..

వంద శాతం పూర్తిచేయండి

- 2,31,127 పింఛన్లు.. రూ.97.93 కోట్లు విడుదల
- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దిశా నిర్దేశం



కృష్ణలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 1 ఆదివారం నేపథ్యంలో ముందురోజే నవంబరు 30న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, తొలిరోజే వందశాతం పంపిణీకి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో పింఛన్ల పంపిణీపై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో వుంచుకొని సమస్యలుంటే వెంటనే సరిదిద్ది ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని, జిల్లాలో 2,31,127 లబ్ధిదారులకు రూ.97.93 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వివిధ కారణాల వల్ల రెండు నెలల పాటు వరుసగా పింఛన్ తీసుకోకపోయినా మూడో నెలలో ఆ మొత్తాన్ని ఒకేసారి చెల్లించేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. పింఛన్ లబ్ధిదారు మరణిస్తే అతడి భార్య మరుసటి నెల నుంచే స్పౌజ్ పెన్షన్ (వితంతు పెన్షన్) పొందేలా వీలు కల్పించినట్టు వివరించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

విజయవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రాష్ట్రంలో 68 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడ ఆర్‌అండ్ఆర్, ఇరిగేషన్ క్యాడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామిశెట్టి శ్రీలతను నియమించింది. కోనేరు రంగారావు కమిటీ ఎన్టీఆర్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎ.పద్మజను నియమించింది. నందిగామ ఆర్డీవోగా గతంలో పనిచేసిన ఎ.రవీంద్రరావును ఎన్టీఆర్ జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా నియమించింది. ఎన్టీఆర్ జిల్లాకు ఇంతకు ముందు డీఆర్వోగా పనిచేసిన వల్లభనేని శ్రీనివాసరావును సీఆర్‌డీఏ ఓఅండ్ఎం డైరెక్టర్‌గా నియమించింది. కృష్ణా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బి.మల్లయ్యను నియమించింది. విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి జీవీవీ సత్యనారాయణను డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఏపీఎస్ఎఫ్ఎల్ ఈడీగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడును నియమించారు.

2 నుంచి ఇగ్నో పరీక్షలు

వన్‌టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) టర్మ్ ఎండ్ పరీక్షలను డిసెంబరు 2 నుంచి వచ్చే ఏడాది జనవరి 9వరకు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ కేంద్రం సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు దోనేపూడి రామాంజనేయ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విజయవాడ పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతరపురంలలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హాల్ టిక్కెట్లు ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడు చేసుకోవచ్చని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తమ తమ అధ్యయ కేంద్రాలను థీయరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని తెలిపారు. వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని, ఈ మెయిల్ ద్వారా గాని, 0866-2565253 నెంబర్‌లోగాని సంప్రదించవచ్చన్నారు.

ఏపీలో 88 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్రం ఆమోదం

- ఎన్టీఆర్ జిల్లాకు రెండు
- కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్
- పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక వివరణ

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో 88 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం తెలుపగా, ఎన్టీఆర్ జిల్లాకు రెండు కేంద్రాలు మంజూరైనట్టు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థితిని గురించి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంట్ సమావేశాల్లో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 72 మంది స్టాఫ్ నర్సులకు ఆమోదం ఉండగా, ఇప్పటికే 68మందిని నియమించామని, 45 మంది వైద్యులకుగాను, 42 మందిని నియమించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 97 మంది స్టాఫ్ నర్సులకుగాను 86 మంది ఉన్నారని, 49 మంది వైద్యులకు గాను 48మందిని నియమించినట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో నిపుణులైన వైద్యులను నియమించలేదని తెలిపారు.

● ఏపీలో వన్‌స్టాప్ సెంటర్లకు రూ.5.48 కోట్లు విడుదల చేయగా, కేవలం 96.50 లక్షలు మాత్రమే వ్యయం చేసినట్టు కేంద్ర మహిళా శిశు అభివృద్ధిశాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీ శివనాథ్, అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఏపీలో 26 వన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయని.. కృష్ణా, అనకాపల్లి, బాపట్ల, కోనసీమ, పల్నాడు, పార్వతీపురం మన్యం, నంద్యాల ఈ ఏడు జిల్లాలో కొత్తగా సెంటర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు వన్‌స్టాప్ సెంటర్లలో 17,797 మంది మహిళలు సహాయం పొందినట్టు సావిత్రి ఠాకూర్ తెలిపారు.

కలెక్టర్ లక్ష్మీశను కలిసిన ఎంపీ కేశినేని చిన్ని



ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు జి.లక్ష్మీశను శుక్రవారం ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు.

29 కెఎల్‌పి-4-రైతుల సమస్యలు వింటున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఎం.నవీన్

రైతుల సమస్యలు తక్షణం పరిష్కరించండి

- అధికారులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఆదేశం

కృష్ణలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు గ్రీవెన్స్ డే ద్వారా తమ సమస్యలు చక్కగా చెప్పుకొంటున్నారని, గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు విశేషంగా పాల్గొని వారి సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. సీఆర్‌డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరయ్యారు. అదనపు కమిషనర్ వారికి వచ్చిన సమస్యలలో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపాలన్నారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరీ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరక్టర్ జి.పి.రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసిల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



మోపిదేవిలో ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు



పామర్రులో జాతీయ రహదారిపై రాశులు పోస్తున్న ధాన్యం

వరికి వాన గండం!

ఫెంగల్ హెచ్చరికలతో అన్నదాతల్లో వణుకు

- రహదారుల వెంబడి గుట్టలుగా ధాన్యం
- అకాల వర్షంతో తీవ్ర అవస్థలు

ఆరుగాలం కష్టించి పండించిన పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాత గుండెల్లో తుపాను హెచ్చరికలు రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఈ ఏడాదైనా దిగుబడులు ఆశించిన మేర వస్తాయనుకుంటున్న తరుణంలో అకాల వర్షాలతో బెంబేలెత్తుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కోసిన పంటను రోడ్లపైనే రాశులుగాపోసి ఆరబెడుతు పంటను రక్షించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం నిబంధనలు ఒకవైపు.. వాయుగుండం, తుపాను హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మోపిదేవి/పామర్రు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మండలంలో పలుగ్రామాల్లో యంత్రాల ద్వారా వరికోతలు, నూర్పిడి పనులు చేపట్టారు. ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం నిబంధన పెట్టడంతో రైతులు రోడ్ల వెంబడి గుట్టలుగా పోసి ఆరబెడుతున్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయటంతో రైతులు చేతికందివచ్చిన పంటను యంత్రాల ద్వారా నూర్పిడి చేపట్టారు. తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు సూచిస్తున్నా రైసుమిల్లర్లు, రైతు సేవాకేంద్రాల్లో తేమశాతం నిబంధన సాకు చూపుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మండలంలో పెదకళ్లేపల్లి, వెంకటాపురం, శివరామపురం, కొక్కిలిగడ్డ, పెదప్రోలు, బొబ్బర్లంక గ్రామాల్లో వందల కొద్ది ఎకరాల్లో యంత్రాల ద్వారా నూర్పిడి చేశారు. ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయటంతో మిల్లుల వద్ద సరిపడిన స్థాయిలో డ్రైయర్లు లేకపోవటంతో నిల్వచేసే సామర్థ్యం తక్కువగా ఉండటం, బారులు తీరిన వాహనాలు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సంచుల కొరతతో అవస్థలు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు సంచుల అందించటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నూర్పిడి చేస్తున్నా విస్తీర్ణానికి సరిపడా గోనె సంచులు సరఫరా కావటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



పామర్రులో ఐదురోజుల క్రితం కోతలు కోసి ఆరబెట్టిన పనలు

నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో సంచులు కొరత ఉందని, ధాన్యాన్ని పొలాల్లోనే ఆరబోసుకోవాల్సి వస్తుందని, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ఇదిగో వస్తాయంటూ దాట వేస్తున్నారని తెలిపారు. కనీసం గోనె సంచుల్లో ఎత్తుకుని నిల్వ చేసుకుందామనుకున్నా సంచులు సరఫరా చేయటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సరిపడా గోనె సంచులు, వాహనాలు సమకూర్చి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● పామర్రు మండలంలో రైతులు వరికోతలను కూలీలతోపాటు యంత్రాలతో యుద్ధ ప్రాతిపాదికన కోతలు కోసి నూర్పిళ్లను పూర్తి చేశారు. పనలు ఆరబెట్టారు. శుక్రవారం సాయంత్రం ఓమాదిరి వర్షాలతో పాటు ఈదురు గాలులకు వరిచేలు 25శాతం మేర నెలకొరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు మండలంలో పెదమద్దాలి, పామర్రు, బల్లిపర్రు, రిమ్మనపూడి, జమీగోల్వేపల్లి, పసుమర్రు, జమీదగ్గుమిల్లి తదితర గ్రామాల్లో కూలీలతో కోసిన వరి పనలు వర్షానికి చిక్కుకుంటున్నాయని రైతులు ఆందోళనతో ఉన్నారు. పంటను కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని అధికారులను కోరుతున్నారు.

కోతలు వాయిదా వేసుకోండి : తహసీల్దార్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతల పనులు వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ గూడపాటి రవికాంత్ కోరారు. శుక్రవారం ఆయన గ్రామాల్లో పర్యటించారు. మూడురోజులు పాటు వర్షాలు పడే సూచనలున్నాయని రైతులు కోతలను నిలుపుదలచేసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తయిన వారు మిల్లులకు తరలించాలని తెలిపారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అప్రమత్తంగా ఉండండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తరలింపులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని దావులూరు, ప్రొద్దుటూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కోతలు కోసి ఆరబోసిన ధాన్యాన్ని తక్షణం మిల్లులకు తరలించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతున్నామన్నారు. వారంరోజులుగా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం తరలింపులో కృషి చేస్తున్నారని, రైతులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. మిల్లులకు వచ్చిన వాహనాలను తక్షణం అన్‌లోడు చేయించే విధంగా కృషి చేయాలని మిల్లర్లను కోరారు. తహసీల్దార్ భవన్నారాయణ, వ్యవసాయశాఖ అధికారి పీఎం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రంలో ధాన్యం సేకరణ పరిశీలన



ఉయ్యూరు : చిన ఓగిరాల రైతు సహాయకేంద్రాన్ని కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో హెలా షారోన్ శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. చినఓగిరాలలో పర్యటించి రైతు సహాయ కేంద్రంవద్ద రైతులతో మాట్లాడారు. ధాన్యం తరలించేందుకు వాహనాలు వస్తున్నాయని రైతులు సంతృప్తి వ్యక్తంచేశారు. తుపాను కారణంగా రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ అన్నారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్‌ఐ యతేంద్రియులు, ఏవో నిస్సీగ్రేస్, సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ నాటికి సురక్షిత కృష్ణా జలాలు!

- కిడ్నీ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు
- ఎ.కొండూరులో కలెక్టర్ లక్ష్మీశ పర్యటన.. పైప్‌లైన్ పనులపై ఆరా

ఎ.కొండూరు/రెడ్డిగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలకు జూన్ నాటికి శాశ్వత ప్రాతిపదికన సురక్షితమైన కృష్ణా జలాల అందజేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రూ.50 కోట్లతో చేపట్టిన పనులు త్వరగతిన పూర్తిచేయనున్నట్టు చెప్పారు. శుక్రవారం మండలంలో కలెక్టర్ పర్యటించారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో నిర్మిస్తున్న వాటర్‌ట్యాంక్ పనులు, ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఆయన పరిశీలించి కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. కంభంపాడులో కృష్ణా వాటర్ పైపు లైన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవాలు అందించేందుకు ఎ.కొండూరులో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రోగులకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో 13 రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నామని, వైద్యులు, అపోలో సిబ్బంది నెలలో రెండుసార్లు రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రూ.50 కోట్లతో చేపట్టిన జలజీవన్ విషన్ పైపులైన్ పనులు 90 మీటర్లు పూర్తికాగా, 22 కి.మీ పనులు తుది దశకు చేరాయన్నారు. కిడ్నీ ప్రభవిత గ్రామాల్లో అదనంగా మరో 14 ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్టు తెలిపారు.



ఎ.కొండూరులో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి



రెడ్డిగూడెంలో కృష్ణాజలాల పనుల పురోగతిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కేజీబీవీ పాఠశాల పరిశీలన..

ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని బాలికలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. పాఠశాల తరగతి గదులు, భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్డీవో కె.మాధురి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఇతర అధికారులు, నేతలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై దృష్టిపెట్టండి

- ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పారిశ్రామితవేత్తలకు అనువైన వాతావరణం : మంత్రి కొల్లు రవీంద్ర
- పరిశ్రమలకు స్వర్ణయుగం : డెయిరీ చైర్మన్ చలసాని

లబ్బీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ లో ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే మెగా బిజినెస్ ఎక్స్ పోను మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో అయన మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత ఐదేళ్ళ రాష్ట్రంలో పరిశ్రమల రంగాన్ని పట్టించుకోలేదని, ఉన్న పరిశ్రమలు కూడా తరలిపోయే విధంగా భయపెట్టారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని అన్నారు. ప్రతిభ ఉన్న యువత పొట్ట చేత పట్టుకుని అవకాశాలు కోసం తరలివెళ్ళారని, కూటమి ప్రభుత్వం వచ్చాక పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పారిశ్రామిక వేత్తలతో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈ కింద ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో తప్పకుండా పరిశ్రమలు ఏర్పాడతాయని, లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ఈ ఎక్స్ పో ఏర్పాటు చేయడం అభినందనీయమని, పారిశ్రామిక వేత్తగా ఎదగాలంటే అనువైన మార్గాలు ఇక్కడ తెలుసుకోవచ్చని అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు పాలన కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు, దార్శనికుడు అయిన చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రస్తుతం రాష్ట్రంలో స్వర్ణయుగం నడుస్తుందని అన్నారు. యువకులు రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న పారిశ్రామిక పాలసీలను అవకాశంగా మార్చుకుని మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌పో ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వేదికపై మంత్రి రవీంద్ర తదితరులు

రవాణా రంగ సమస్యలు పరిష్కరించండి

తమ సమస్యలు పరిష్కరించాలని లారీ యజమానులు సంఘం నాయకులు మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరుగుతున్న బిజినెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని సంఘం నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా రవాణా సమస్యలను మంత్రికి వివరించడంతో పాటు కూటమి ప్రభుత్వం రాగానే వందరోజుల్లో గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తామని ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అదేవిధంగా రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. లారీ యజమానుల సమస్యలు సానుకూలంగా విన్న మంత్రి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కృష్ణ జిల్లా సంఘం అధ్యక్షులు నాగుమోతు రాజా, కార్యదర్శి రావి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు

అక్రమమా.. సక్రమమా?

(5వ పేజీ తరువాయి)

చిక్కుతోంది. ఇలాంటపుడు అక్రమ బియ్యం రవాణాపై విజిలెన్స్ ఎందుకు? తనిఖీలుచేసి ఎందుకు పట్టుకోవటం? పట్టుకున్న పేదల బియ్యాన్ని మళ్లీ దొంగలకు ఎందుకు ఇవ్వడం? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

స్వేచ్ఛగా సరిహద్దులు దాటించేస్తూ..

ఈ ఆక్షన్ వల్ల బియ్యం వ్యాపారులు మరింత దర్జాగా రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. ఆక్షన్‌లో కొన్నవారిని సివిల్ సప్లయిస్ అధికారులు సర్టిఫై చేస్తూ అధీకృతంగా రశీదులు ఇస్తారు. ఈ రశీదులతో దర్జాగా రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ రశీదుల జిరాక్సులు తీసుకుని బియ్యం తరలించే ప్రతిసారీ వినియోగిస్తున్నారు. నగరం నుంచి ఆఫ్రికా దేశాలకు ఈ బియ్యం రవాణా సాగుతోంది. తాజాగా కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు వెళ్తున్న రేషన్ బియ్యం కంటైనర్‌షిప్‌ను అధికారులు పట్టుకున్నారు. ఈ కంటైనర్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన రేషన్ బియ్యం కూడా కొంతమేర ఉందని తెలుస్తోంది. సివిల్ సప్లయిస్ ఇచ్చే ఆక్షన్ రశీదు కాపీలను చూపించే ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించారు. పోలీసుల తనిఖీలు ఎక్కువగా ఉన్నాయన్న ఉద్దేశంతో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి రూటు మార్చి.. విజయవాడ నుంచి వయా ఛత్తీస్‌గఢ్ మీదుగా ముంబయి పోర్టుకు తరలించి, అక్కడి నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఆక్షన్ రశీదులు చూపించి..

బియ్యం అక్రమంగా రవాణా చేయడానికి ఆక్షన్‌లో సివిల్ సప్లయిస్ అధికారులు ఇచ్చే రశీదులే కారణంగా తెలుస్తోంది. దీంతో అవినీతి రేషన్ సామ్రాజ్యాన్ని విస్తరించటానికి దోహదపడుతున్న ఆక్షన్‌ను ఎందుకు నిర్వహించాలనే అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో సమీక్ష చేసి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. రేషన్ మాఫియాను కొంతవరకైనా కట్టడి చేయటానికి ఈ విధానాన్ని ఎత్తివేయాలనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా ప్రభుత్వానికి కూడా కొంతమేర ఆర్థిక ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు అందిస్తే ప్రొక్యూర్‌మెంట్ భారం కొంతవరకైనా తగ్గుతుంది. ఆన్‌లైన్ రికార్డ్ నిర్వహిస్తూ వాటిని కోటాగా పంపిణీ చేయించటం వల్ల అక్రమార్కుల రీ సైక్లింగ్ వ్యాపారానికి చెక్ పెట్టొచ్చు. ఆక్షన్‌లో కొన్న బియ్యాన్ని అక్రమ వ్యాపారులు మిల్లులకు తరలించి పాలిష్ పట్టిస్తున్నారు. ఈ బియ్యాన్నే సన్నబియ్యంగా మార్చి సొంత బ్రాండ్లతో మార్కెట్‌లోకి వెదజల్లే అక్రమ వ్యాపారులు కూడా ఉన్నారు. ఇంత అవినీతికి ఆస్కారంగా మారుతున్న ఆక్షన్‌ను తక్షణం రద్దు చేయాల్సిన అవసరం ఉంది.

జలవనరుల శాఖ ఎస్ఈగా మోహనరావు

విజయవాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్ఈగా రాచప్రోలు మోహనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ధవళేశ్వరం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇంతకుముందు కేఈ డివిజన్ ఈఈగా పనిచేశారు. ఇక్కడి నుంచి ధవళేశ్వరం బదిలీపై వెళ్లారు. మొన్నటి వరకు స్పెషల్ డివిజన్ ఈఈగా ఉన్న గంగయ్య ఎఫ్ఏసీ ఎస్ఈగా ఉండేవారు. ఆయన ఈ పదవిలో కొనసాగలేనని చెప్పడంతో మోహనరావుకు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు.

పెళ్లికి ఒప్పుకోలేదని యువతి ఆత్మహత్య!

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదని చిట్టినగర్‌కు చెందిన ఓ యువతి (19) తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని రైవస్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు శుక్రవారం గవర్నర్‌పేట స్టేషన్‌లో కేసు నమోదైంది. చిట్టినగర్‌కు చెందిన యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడిని ప్రేమించింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే యువకుడి తల్లిదండ్రులు వారిపెళ్లికి అంగీకరించలేదు. దీంతో మనస్థాపం చెందిన ఆమె 26వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆమె భోజనం చేసి నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం తల్లిదండ్రులు లేచిచూడగా యువతి కనిపించలేదు. దీంతో అన్నిచోట్ల వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు రైవస్ కాలువలో యువతి దూకినట్టు స్థానికుడు ఆమె తల్లిదండ్రులకు చెప్పాడు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 605

స్టెల్లాలో అధ్యాపకుల మిస్టర్, మిసెస్ పోటీలు



పటమట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మారిస్ స్టెల్లా కళాశాలలో క్రిస్మస్ ఫెట్ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన మిస్టర్, మిసెస్, మిస్ స్టెల్లా పోటీల్లో అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు ర్యాంపుపై వయ్యారాలు ఒలికిస్తూ సందడి చేశారు. మిస్ స్టెల్లాగా పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు రజనీ, మిస్టర్ స్టెల్లాగా కృష్ణమనోహర్, మిసెస్ స్టెల్లాగా అర్థశాస్త్ర అధ్యాపకురాలు స్వప్న వున్నం ఎన్నికయ్యారు. ప్రిన్సిపాల్ సిస్టర్ జసింతా క్వాడ్రెస్ విజేతలకు బహుమతులు అందజేశారు. శైలజ, పూజిత, హైమా, అనుపమలు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు సర్వోత్తమం

● 1800 గ్రంథాలతో సర్వోత్తమ గ్రంథాలయం ప్రారంభం ●అందుబాటులో 60,345 పుస్తకాలు, 34,988 డిజిటల్ పుస్తకాలు ● 2500మందికి పైగా సభ్యులు

(పటమట, ఆంధ్రజ్యోతి)

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు, చరిత్ర తెలుసుకోవాలనే జిజ్ఞాసులకు, పిల్లల మెదడకు పదును పెట్టే బాలల పుస్తకాలకు ఇలా అన్ని రకాల పుస్తకాలను సమకూర్చుకుని విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని మూడంతస్థుల భవంతిలో 12వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఠీవిగా నిలబడి ఉంది సర్వోత్తమ గ్రంథాలయం.

తొలుత ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం గ్రంథాలయంగా ప్రారంభమైన గ్రంథాలయంలో గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉండేది. గాడిచర్ల శత జయంతి సందర్భంగా గ్రంథాలయాన్ని పునరుద్ధరించి, సర్వోత్తమ గ్రంథాలయంగా పేరుపెట్టి 1987 మార్చి 30న విజయవాడ నగర పౌరులందరికీ ప్రవేశం కల్పించారు. ఈ గ్రంథాలయం పూర్తిస్థాయిలో న్యూజెన్ లిబ్ అనే గ్రంథాలయ సాఫ్ట్‌వేర్‌తో కంప్యూటీకరణ చేయబడింది. తద్వారా పుస్తకానికి సంబంధించి సమాచారం మనకు సెకన్లలో తెలిసిపోతుంది. ఆనాడు 1800 గ్రంథాలతో ప్రారంభమైన ఈ గ్రంథాలయంలో 60,345 పుస్తకాలతో పాటు 34,988 డిజిటల్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 60కు పైగా వివిధ పత్రికలు అందుబాటులో ఉంచుతారు. ప్రస్తుతం 2500 మందికి పైగా సభ్యులు ఉన్నారు. గత మూడు దశాబ్దాల నుంచి ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటలకు ఒక్క రోజు కూడా మూయకుండా 365 రోజులు పనిచేస్తుందని నిర్వాహకులు తెలియజేశారు. అన్ని విభాగాల్లో ప్రతీరోజు 200 మందికి పైగా పాఠకులు వస్తుంటారని వారు తెలియజేశారు. ఇందులో భారతి పూర్తి సంపుటాలు, కలెక్టెడ్ వర్క్ఆఫ్ మహాత్మాగాంధీ వంద సంపుటాలు, విశేష సంఖ్యలో జాతీయ రాష్ట్రస్థాయిలో వివిధ రంగాల్లో లబ్ధ ప్రతిష్టులైన ప్రముఖుల అభినందన సంచికలు, 80,90 సంవత్సరాల క్రితం ప్రచురించబడిన వేలాది అపురూప, అమూల్య గ్రంథాలు, జాగ్రత్తగా భద్రపరచబడ్డాయి, ఈ గ్రంథాలయంలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరుతో ప్రత్యేకంగా పిల్లల విభాగం ఉంది. ఇందులో పిల్లల పుస్తకాలు ఆంగ్ల భాషలో సుమారు 10,500 పుస్తకాలు ఉన్నాయి.



సర్వోత్తమ గ్రంథాలయం



లాకర్లలో భద్రపరిచిన అపురూప పుస్తకాలు

ప్రస్తుతం ఈ గ్రంథాలయానికి పాలకవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, కార్యదర్శిగా రావిశారదలు వ్యవహరిస్తున్నారు. పిల్లలలో పుస్తక విజ్ఞానం పెంపొందించడానికి ప్రతి సంవత్సరం నవంబరులో గ్రంథాలయంలో వివిధ పోటీలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ పోటీలతో పాటు పిల్లలో పఠనపు అలవాటు పెంచడం కోసం మే 1 నుంచి 31వ వరకు గ్రంథాలయాలనికి వచ్చి 100 గంటలకు పైగా పుస్తక పఠనం చేసిన వారికి గోల్డ్‌మెడల్, 60-100 గంటలు పుస్తక పఠనం చేసే వారికి సిల్వర్ మెడల్ ఇస్తారు.

గ్రూప్-2 పుస్తకాల కోసం వస్తున్నా



ఏడాది నుంచి సర్వోత్తమ గ్రంథాలయానికి ప్రతి రోజూ గ్రూప్-2 ప్రిపిరేషన్ కోసం వస్తున్నాను. నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన అన్ని పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ చదువుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

-సాయికుమార్

డిజిటల్ లైబ్రరీ సౌకర్యం



ఇక్కడ ప్రశాంతమైన వాతావరణంలో డిజిటల్ లైబ్రరీ సౌకర్యం కోసం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటలకు తెరిచి ఉంచడం వలన ఎక్కువ సమయం ఇక్కడ గడపటానికి వీలుంటుంది. సెలవులు లేకుండా కొనసాగడం తమకు ఎంతో ఉపయోగంగా ఉంది. లే ని పుస్తకాలను తెప్పించి ఇక్కడ ఉంచుతున్నారు.

- పి సుధాకర్

రోజూ 200 మంది వస్తారు



గ్రంథాలయానికి రోజుకు 200 మంది వస్తుంటారు. పోటీపరీక్షలకు వెళ్లే వారికి కావాల్సిన పుస్తకాలు వారికి అందుబాటులో ఉంచుతాం. కూడలి ప్రదేశంలో ఉండటం వలన ఈ గ్రంథాలయం అందరికీ అందుబాటులో ఉంటుంది. పూర్తిగా కంప్యూటరీకరణ చేయడం వలన కావాల్సిన పుస్తకం అర నిమిషంలో అందజేస్తాం. గ్రంథాలయశాస్త్రం చదివిన అభ్యర్థులు సిబ్బందిగా ఉండటం వలన ఉద్యోగార్థులకు పుస్తకాలు మీద మార్గదర్శనం చేయటానికి వీలవుతుంది.

- రావి శారద, గ్రంథాలయ కార్యదర్శి

రామలింగేశ్వరస్వామికి శాంతి కల్యాణం



కోటి దీపోత్సవంలో అందంగా అలంకరించిన లింగ, ఓంకార రూపాలు

విజయవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురులోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామికి ఉదయం 6 గంటల నుంచి 11.30 వరకు రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీ సాయి భక్త బృందం మహిళలు భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని పది రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. సంగా నరసింహారావు ఆధ్వర్యంలో లింగ, ఓంకార రూపాలలో పుష్పాలతో అందంగా అలంకరించిన దీపాలను కోటి దీపోత్సవంగా జరిపి భక్తిని చాటుకున్నారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్, ఆలయ కార్యనిర్వాహణాధికారిణి ఎస్.భవానీ పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు గద్దె : బుద్దా వెంకన్న

మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బుద్దా వెంకన్న, గద్దె

పటమట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్యమంత్రి చంద్రబాబు గుండెల్లో ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న చెప్పారు. శుక్రవారం ఉదయం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె కార్యాలయంలో డివిజన్‌లోని పేదలకు వైద్యం, విద్య వరదల కారణంగా కొండరాళ్లు పడి ఇళ్లు దెబ్బతిన్న వారికి ఇంటి మరమ్మతుల నిమిత్తం, జీవనోపాధి నిమిత్తం సాయం అందజేశారు. గద్దె తన సొంత నిధులను నియోజకవర్గంలోని 34 మందికి రూ.8లక్షలను బుద్దా వెంకన్న, గద్దె రామ్మోహన్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు గద్దె రామ్మోహన్ అని, ముచ్చటగా మూడుసార్లు గెలిచిన ఆయన మీద ఒక్క అవినీతి ఆరోపణ లేదన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అంటే ముఖ్యమంత్రికి చాలా మంది అభిప్రాయం ఉందని, గద్దె రామ్మోహన్ పార్టీలు చూడకుండా ప్రజలకు సహాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కుమారుడు క్రాంతికుమార్ ఇప్పుడు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని, ఆయనను కూడా ప్రజలు ఆదరించాలన్నారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అంటే ఓట్లు పొందడం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వారికి దగ్గరంగా ఉండాలన్నారు. అప్పుడే వారి సమస్యల కొన్నైనా పరిష్కరించగలమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, నందిపాటి దేవానంద్, దాసరి గాబ్రియేల్, పడాల గంగాధర్, వలిశెట్టి అన్నారావు, సాయి ప్రసాద్, రాయి రంగమ్మ, నాగమణిలు పాల్గొన్నారు.

రాజస్థానీయుల ఆత్మీయ సమావేశం

రాణిగారితోట: అమరావతి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని అక్కడ పనులు మొదలైతే నగర వాసులకు చేతినిండా పనులు ఉంటా యని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాణిగారితోటలోని అంబేడ్కర్ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం రాజస్థాన్ వారి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రూ.30వేల కోట్లతో అమరావతిలో త్వరలో అభివృద్ధి పనులు చేపట్ట నున్నారని, ఆ అభివృద్ధిలో మీరంతా భాగస్వాములు కావాలని అన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారి సమస్యలు పరిష్కరించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆలీభాయ్, మహమ్మద్ బాబు, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, కొప్పోలు శ్రీనివాస చౌదరి, ముని పోలిపల్లి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భ్రమరాంబ



వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి (పాత శివాలయంలో) జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాలు సందర్భంగా 28వ రోజు శుక్రవారం భ్రమరాంబ అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో నటరాజన్ షణ్ముగం పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొమ్ము మధు, కమిటీ సభ్యులు రాంపిళ్ల వాసు, వేలాది శాంతి, కామినేని కోమల, నాగోతి విజయ నిర్మల, ఏనుగుల దుర్గాభవాని పాల్గొన్నారు.

ఆకాశ దీపానికి ఈవో దంపతుల పూజలు



వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస సందర్భంగా నిత్యం ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న క్రమంలో శుక్రవారం ఈవో రామరావు దంపతులు ఆకాశ దీపాన్ని వెలిగించే ముందు లోక కల్యాణార్థం సంకల్పం చేశారు. గంగా పార్వతీ మల్లేశ్వరుల ఊంజల్ సేవలో పాల్గొన్నారు. సహస్ర దీపాలంకరణ సేవలో దీపాలను వెలిగించారు. సాయంత్రం భక్తులకు నిర్వహించిన అన్న వితరణలో ఈవో రామరావు, అధికారులు స్వయంగా అన్న వితరణ చేశారు.

దుర్గగుడి కళావేదిక పై అంధుల భక్తిసంగీత విభావరి

దుర్గగుడి కళావేదికపై శుక్రవారం శ్రీఅంధుల కళాపరిషత్ అసోసియేషన్ నిర్వాహకుడు ఎస్.ఎల్.ప్రసాద్ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఎస్.ఎల్.ప్రసాద్ కూడా అంధుడు. ఇప్పటి వరకు ఆయన 300కు పైగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రదర్శనలో 10 కీర్తనలను హృద్యంగా ఆలపించారు. ఆహుతులను అలరించారు. ఈవో కె.ఎస్.రామరావు, డిప్యూటీ ఈవో రత్నరాజు ప్రశంసి, సత్కరించారు.

చిట్ నిర్వాహకుడిపై కేసు

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిట్ నగదు చెల్లించలేదని దౌర్జన్యంగా షాపులోకి వెళ్లి వ్యాపారిని కొట్టిన నిర్వాహకుడిపై శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురంలో పొట్టి వెంకటశ్రీహరి వన్‌టౌన్ మార్వాడీ వీధిలో కుమార్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. టీవీఎల్ చిట్‌ఫండ్ నిర్వాహకుడు పి.వెంకటేశ్వరరావు వద్ద తన కుటుంబ సభ్యులు, బంధువులు పేరుతో శ్రీహరి చిట్ వేశాడు. సకాలంలో చెల్లిస్తున్నాడు. శ్రీహరి తన తండ్రి పేరుతో వేసిన ఒక నెల చిట్ నగదు సకాలంలో చెల్లించ లేదు. ఈనెల 27న వెంకటేశ్వరరావు దౌర్జన్యంగా దుకాణంలోకి చొరబడి తనపై దాడి చేశాడని శ్రీహరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మహిళను నమ్మించి నగదు, బంగారం తీసుకున్న వ్యక్తిపై కేసు

మహిళకు మాయమాటలు చెప్పి బంగారం, నగదు తీసుకుని ఇవ్వమంటే బెదిరిస్తున్న వ్యక్తిపై శుక్రవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపూడిలో బొమ్మనబోయిన శ్రీకృష్ణ (44) కుటుంబ సభ్యులతో ఉంటుంది. తాడేపల్లిలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న సమయంలో కిరణ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆమెకు మాయమాటలు చెప్పి తన అవసరాల కోసం పలు దఫాలుగా 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15లక్షలు తీసుకున్నాడు. బాధితురాలు కిరణ్‌ను తిరిగి నగదు, బంగారం అడుగుతుండగా కాలయాపన చేస్తున్నాడు. ఇటీవల ఆమె నిలదీయడంతో తనతో అక్రమ సంబంధం ఉందని, భర్తకు చెబుతానని బాధితురాలిని బెదిరిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి కిరణ్‌పై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించండి

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆప్కాస్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా



దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

చిట్టినగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆప్కాస్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ 10 నుంచి 25 ఏళ్లుగా నగరంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు 1200 మంది చాలీచాలని జీతాలతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇంజనీర్, ఇంజనీరింగ్ కార్మికులను విడగొట్టి సవతి ప్రేమ చూపించి జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల జీతాలు పెంచాలన్నారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులు వరద వలన 12 రోజుల హాజరు కాలేదని, సెలవు దినాలను పని దినాలుగా కలిపి జీతం ఇవ్వాలన్నారు. నగర జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని, మరణించిన కార్మికుల కుటుంబాల్లో పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబస్, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు. దుర్గారావు, మహేష్, జైపాల్, బుచ్చిబాబు, టీ.చిన్న, వెంకట్రావ్, కృష్ణవేణి, దుర్గాప్రసాద్, సాంబశివరావు, రామారావు పాల్గొన్నారు.

రూపాయి నోటు ప్రస్తుతం చలామణిలో లేదు. ఆ ఒక్క నోటు ధర రూ.30. రెండు రూపాయల నోటు ముద్రణ ఏనాడో ఆగిపోయింది. ఆ నోటు ధర రూ.20. సంఖ్య, విలువ పరంగా చూసినా రూపాయి, రెండు రూపాయలు తక్కువే అయినా వాటికి పలికే ధర మాత్రం ఎక్కువే ఉంటుంది. కరెన్సీ ఎంత పురాతన చరిత్ర కలిగి ఉంటే అంత ఎక్కువ ధర పలుకుతోంది. నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణపై ఆసక్తి ఉన్న వారు ఆ చరిత్రను చూసి ఎంత ధరకైనా కొనుగోలు చేస్తారు. ప్రతి కరెన్సీ వెనుక అనేక కోణాలు, తరగని చరిత్ర కనిపిస్తోంది. విజయవాడ సూర్యారావుపేటలోని చిలుకు దుర్గయ్య వీధిలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024(కాయిన్స్, స్టాంప్స్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్) శుక్రవారం ప్రారంభమైంది. ఆదివారం వరకు ప్రదర్శనను నిర్వహిస్తారు.


ప్రదర్శనలో నాణేలు, కరెన్సీ నోట్లను తిలకిస్తున్న విద్యార్థులు, ఎన్టీఆర్ నాణేన్ని చూపుతున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు




ప్రదర్శనలో ఉంచిన అంతర్జాతీయ నాణేలు, నోట్లు

నోటుకో రేటు

* విజయవాడలో కొలువుదీరిన అంతర్జాతీయ కరెన్సీ
* నగరంలో ఇంటర్నేషనల్ కాయిన్స్ ఎక్స్‌పో ప్రారంభం
* మూడు రోజులపాటు నిర్వహణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్)

శ్రీధర్ సీసీఈ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024(కాయిన్స్, స్టాంప్స్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్)ను నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనను పురావస్తు శాఖ ముఖ్యకార్యదర్శి వాణీమోహన్, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, అడ్మిన్ ఐజీ శ్రీకాంత్, సుమన్ మీనా, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సందర్శించారు.

మాల్టా నాణెంపై గాంధీ చిత్రం



ప్రపంచ దేశాలు కొత్త నాణేలు, కరెన్సీని ముద్రించి విడుదల చేస్తుంటాయి. ఆయా దేశాల్లోని ప్రముఖులు, చరిత్రకారుల పేరు, చిత్రాలతో నాణేలు, కరెన్సీలను ముద్రిస్తాయి. మాల్టా దేశం కొన్నాళ్ల క్రితం 5వేల లిరాస్ నాణేన్ని విడుదల చేసింది. దీనిపై మహాత్మాగాంధీ చిత్రాన్ని ముద్రించింది. ఈ నాణెం ప్రదర్శనలో ప్రత్యేకార్షణగా నిలిచింది. దీనితోపాటు ఆస్ట్రేలియా ది ఇయర్ ఆఫ్ ది హార్స్ పేరుతో విడుదల చేసిన నాణెం, కాంగో దేశం విడుదల చేసిన 25 ఫ్రాన్సెస్, 10 ఫ్రాన్సెస్ నాణేలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

ఒక రూపాయి..మూడు దేశాలు

రూపాయి, డాలర్, సీఎఫ్ఏ ఫ్రాన్స్, లెవ్, రీల్, యూరో, దినార్, పెసో.. ఇవన్నీ ప్రపంచంలోని వివిధ దేశాల్లో చలామణిలో కరెన్సీ పేర్లు. ఆయా దేశాలకు వెళ్లినప్పుడు స్వదేశ కరెన్సీని అందులోకి మార్చుకోవాల్సి ఉంటుంది. మన దేశంలో ముద్రించిన కరెన్సీని కొన్ని సంవత్సరాలు బర్మా, పాకిస్థాన్ దేశాలు ఉపయోగించుకున్నాయి. 1940వ సంవత్సరంలో ముద్రించిన రూపాయి నోటును ఈ రెండు ఉపయోగించుకున్నాయి. తర్వాత సొంతంగా కరెన్సీని రూపొందించుకున్నాయి. భారతదేశం వింట్‌లో ముద్రించిన ఈ కరెన్సీ ఆ దేశాలకు వెళ్లిన తర్వాత ఆ నోట్లపై ఆ దేశం ఒక స్టాంప్ వేస్తుంది. ఆ దేశ మిలటరీ అనుమతితో వచ్చినట్టు ఇంగ్లీష్‌లో రాసి ఉం టుంది. దీన్ని ఓవర్ ప్రింట్ నోట్లుగా వ్యవహరిస్తారు.



ఆర్బీఐ గవర్నర్ సంతకాన్ని బట్టి డిమాండ్

ఒక నోటు ఎంత పురాతన చరిత్ర కలిగి ఉంటే అంత ఎక్కువ ధర పలుకుతుంది. మనదేశ నాణేలు, కరెన్సీ నోట్లు ఆర్బీఐ ద్వారా వివిధ మింట్లలో ముద్రిస్తారు. ఇందులో కరెన్సీ నోట్లపై రిజర్వ్ బ్యాంక్ గవర్నరుగా పనిచేసిన అధికారి సంతకం ఉంటుంది. ఈ సంతకాలు ఉన్న నోట్లు ఒక్కొక్కటి ఒక్కో ధర పలుకుతోంది. 1985లో ఆర్బీఐ రూ.100 నోటును విడుదల చేసింది. ఆ సమయంలో ఆర్బీఐ గవర్నరుగా మల్హోత్ర వ్యవహరించారు. ఈ సంతకం ఉన్న ఒక రూ.100 నోటు ఖరీదు రూ.300. ఈ నోటు 1990 వరకు చలామణిలో ఉంది. 1977లో ఆర్బీఐ రూ.100 నోటును విడుదల చేసింది. నాడు గవర్నరుగా ఆర్.నరసింహన్ వ్యవహరించారు. ఆయన సంతకం ఉన్న ఈ నోటు ఖరీదు రూ.6వేలు. 1970లో రూ.100 నోటును విడుదల చేసింది. ఆ సమయంలో ఆర్బీఐ గవర్నరుగా ఎస్.జగన్నాథన్ ఉన్నారు. ఆయన సంతకం చేసిన నోటు రూ.600 పలుకుతోంది.

ప్రపంచంలోనే పెద్ద నోటు



రిజర్వ్ బ్యాంకులు విడుదల చేసిన నాణెలు, కరెన్సీ నోట్లకు కొలమానాలు ఉంటాయి. ఒక్కో నాణేనికి బరువు, చుట్టుకొలత, ఉపయోగించిన లోహం వేర్వేరుగా ఉంటాయి. ప్రతి కరెన్సీ నోటుకు పొడవు, వెడల్పు ఉంటాయి. ఈ పరిమాణాలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంటాయి. ప్రపంచంలో అతి పెద్ద కరెన్సీ నోటును మలేషియా ముద్రించింది. అక్కడ కరెన్సీని రింగేట్స్‌లో వ్యవహరిస్తారు. 600 రింగేట్స్ కరెన్సీ నోటును మలేషియా ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నోటు పొడవు 22.86, వెడల్పు 40.64 సెంటీమీటర్లు. అన్ని దేశాల కరెన్సీల్లో మలేషియా ముద్రించిన 600 రింగేట్స్ నోటు అతి పెద్దదిగా స్థానం దక్కించుకుంది.

'స్టార్' కరెన్సీ



బిట్‌కాయిన్, క్రిప్టో ప్రపంచీకరణ తర్వాత డిజిటల్ యుగం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో వచ్చిన కొత్త కరెన్సీలు. వాటికి ముందు నుంచే ఆర్బీఐ స్టార్ కరెన్సీని తీసుకొచ్చింది. ఇదేమి కొత్త కరెన్సీ కాదు. చలామణి అవుతున్న కరెన్సీలో ఇదొక భాగం. ఆర్బీఐ వివిధ మింట్‌ల్లో కరెన్సీ నోట్లను ముద్రిస్తోంది. రూ.10, 20, 50, 100, 500నోట్లు దేశంలోని మింట్‌ల్లో ముద్రణ చేస్తున్నారు. ప్రస్తుతం పది రూపాయల నోట్లను తగ్గించి వాటి స్థానంలో నాణేలను మార్కెట్లోకి దింపుతున్నారు. నోట్లను ముద్రించి 100 నోట్లను ఒక కట్టగా లెక్కిస్తారు. ఆ కట్టలో ఉన్న నోట్లన్నీ వరుస సంఖ్య ఉంటుంది. ఒక్కో నోట్ల కట్టకు ఒక్కో సీరియల్ నంబరు ఉంటుంది. ముద్రణ చేసే సమయంలో ఈ సీరియల్ నంబర్లలో ఏదైనా ఒక నోటు పాడైపోతే దాని స్థానంలో స్టార్ నోట్లను పొందుపరుస్తారు. అదే విలువతో ప్రత్యేకంగా నోట్లను ముద్రిస్తారు. ప్రతి నోటుకు కుడిచేతి వైపున పైభాగంలో, ఎడమ చేతి వైపున కింది భాగంలో సీరియల్ నంబరు ఉంటుంది. ఈ నంబరుకు మధ్యలో స్టార్ (నక్షత్రం) ఉంటుంది. ఈ తరహా నోట్లను స్టార్ నోట్లు, స్టార్ కరెన్సీగా వ్యవహరిస్తారు. ఈ నోటు కట్టలో చేరితే వాటిలో సీరియల్ నంబర్ ఒకటి తప్పుతుంది. అందుకోసం బ్యాంకర్లకు తెలిసేలా కట్టపై అతికించే లేబుల్‌పై స్టార్ నోట్ ఉందని ముద్రిస్తారు.

ఎన్నికల గోదాము తనిఖీ

కృష్ణలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో ఈవీఎంలను భద్రపరిచిన జిల్లా ఎన్నికల గోదామును శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌ను, వేసిన సీల్డ్‌లను ఈవీఎంల రక్షణకు భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమేరాల నిఘాను ఆయన పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాము క్షుణంగా తనిఖీచేసి నివేదికను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందన్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహ, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బి.కిరణ్, పి.యేసుదాస్, కె.పరమేశ్వరరావు, వై.రామయ్య, ఎం.వినోద్‌కుమార్, పీవీ శ్రీహరి పాల్గొన్నారు.


గొల్లపూడిలో ఎన్నికల గోదాము తనిఖీ చేశాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

టీ కప్పులో తుఫాన్‌లా రామలక్ష్మి వ్యవహారం

» నెట్టెం బుజ్జగింపులు, తాతయ్య సోదరుడి రాయబార ఫలితం

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట): నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, పదో వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి జనసేనలో చేరికకు బ్రేక్‌లు పడినట్టు తెలుస్తోంది. రెండు రోజులు క్రితం జనసేనలో కన్నెబోయిన చేరుతున్నట్టు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం టీడీపీలో సంచలనం రేపింది. ఇప్పటి వరకు వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి వలసలు సాగుతుండగా, రామలక్ష్మి కూటమిలో టీడీపీ నుంచి జనసేనలో చేరేందుకు చర్చలు సాగిస్తుండటం చర్చకు దారితీసింది. టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుల ఇలాకాలోనే ఇది జరగటంపై అన్ని వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. రామలక్ష్మి పార్టీ మారుతున్నారని వార్తలు రావడంతో నెట్టెం రఘురాం పరిస్థితి తెలుసుకుని సరిదిద్దే చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శుక్రవారం తన సోదరుడు శ్రీరాం చినబాబును రామలక్ష్మితో చర్చలకు పంపించారు. ఒక వైపు నెట్టెం సూచనలు, చినబాబు బుజ్జగింపులతో పార్టీపరంగా అన్ని రకాలుగా ఉజ్వల భవిష్యత్ కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. పార్టీ సీనియర్ నేత తూమాటి వెంకన్న కుమార్తె రామలక్ష్మి పార్టీ మారే ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకించటంతో రామలక్ష్మి వెనుకడుగు వేసినట్టు తెలిసింది.

రసాభాస

(5వ పేజీ తరువాయి)

నుంచి సంవత్సరానికి రూ.కోటి 26 లక్షలు చెల్లిస్తున్నారని, జక్కంపూడి హౌసింగ్ కాలనీ, గొల్లపూడి, షైలవరంలోని ఇంటి, మంచినీటి పన్నుల రూపేణా నగరపాలక సంస్థకు ఏమీ రావట్లేదని, ఆ డబ్బు ఉంటే నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయవచ్చని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎస్.బాలస్వామి, పలువురు కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మేయర్ కలుగజేసుకుని వెంటనే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి, స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.

పన్నులు రాబట్టేందుకు చర్యలు తీసుకోండి

కొన్నేళ్లుగా నగరంలో పన్నుల బకాయిలు పెరిగాయని, కోట్లాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నామని, వందలాది కేసులు కోర్టుల్లో ఉన్నాయని, వీఎంసీ లాయర్‌తో మాట్లాడి పన్నుల బకాయిదారుల నుంచి డబ్బు రాబట్టాలని, కొంత మంది కోర్టులకు వెళ్లినవారు వడ్డీలు మాఫీ చేస్తే చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మేయర్‌ను కోరారు. స్పందించిన మేయర్ కమిషనర్‌తో మాట్లాడారు. పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుక్కల బెడదపై వాడీవేడిగా చర్చ

నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు కార్పొరేటర్లు మండిపడ్డారు. కుక్కల సమస్యలపై ప్రతి కౌన్సిల్లో మాట్లాడటమే మినహా ఎటువంటి చర్యలు లేవని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నగరంలో ఒకేచోట మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న అడ్మిన్లను, ఆర్పీలను, సీవోలను బదిలీ చేయాలని టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి కోరారు. కొన్నిచోట్ల ఐదేళ్లకు పైబడి పనిచేస్తున్న వారు ఉన్నారని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

దేవస్థానం టూ న్యాయస్థానం

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వలంటీర్ల కార్యక్రమం

» ప్రభుత్వ పెద్దల మనసు మారాలంటూ దుర్గగుడిలో వినతిపత్రాల సమర్పణ

» స్పందించకపోతే న్యాయస్థానాల మెట్లెక్కుతామని, ఉద్యమిస్తామని హెచ్చరిక

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ దేవస్థానం టూ న్యాయస్థానం కార్యక్రమం పేరిట వలంటీర్లు శుక్రవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంకా గోవిందరాజుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం దగ్గర ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ తమ ఉద్యోగ భద్రతపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దల మనస్సులను మార్చి తమ న్యాయమైన కోర్కెలు నెరవేరేలా చూడాలని అమ్మవారిని కోరుతూ అందులో రాశామని వలంటీర్లు తెలిపారు. టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో వలంటీర్లకు ఉద్యో గభద్రత కల్పిస్తామని, నెలకు రూ.10వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, దానిపై ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదని, అమ్మవారైనా తమ మొర ఆలకిస్తుం దని, తమ కోర్కె నెరవేరుస్తుందని విన్నవించుకున్నామన్నారు. తమ డిమాండ్లను ఆమోదించాలంటూ దేవస్థానం టూ న్యాయ స్థానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోకపోతే త్వరలో న్యాయస్థానాల మెట్లు ఎక్కుతామని, భారీ సంఖ్యలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.


తమ డిమాండ్లు ఆమోదించాలంటూ దుర్గగుడిలో వినతిపత్రాలు చూపుతున్న వలంటీర్లు


11 గ్రాముల బంగారు నత్తువను అందజేస్తున్న బొడ్డు శ్రీధర్ దంపతులు

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తువ

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ ఏర్పడింది. అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్ కొత్తపేట టీవీటీ మార్కెట్ ప్రాంతంలోని శ్రీధర్ శారీ హౌస్ యజమాని బొడ్డు శ్రీధర్ శుక్రవారం తన కుటుంబ సభ్యులతో ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారి అలంకరణ నిమిత్తం ఎరుపు, తెలుపు, పచ్చరాళ్ల పొదిగిన 11 గ్రాముల నాసికాభరణం(నత్తువ)ను ఆలయ అధికారులకు అందజేశారు.

అన్నవితరణకు రూ.లక్ష విరాళం

నగరంలోని వన్‌టౌన్ సమ్మెట వారి వీధికి చెందిన పల్లపోతు వెంకట శ్రీనివాసరావు ఆలయంలో అన్నవితరణ నిమిత్తం రూ.లక్ష చెక్కును డిప్యూటీ ఈవో రత్నరాజుకు అందజేశారు.


మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీఎన్జీవో రాష్ట్ర నాయకులు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, సీహెచ్ పురుషోత్తమనాయుడు కోరారు. శుక్రవారం మంత్రిని సచివాలయంలోని చాంబర్‌లో అసోసియేషన్ నాయకులు కలిశారు. 'గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కామన్ అపాయింట్‌మెంట్ డేట్ ఇవ్వాలి. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో సీనియారిటీ లిస్టులు తయారు చేయాలి. జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ మంజూరు చేయాలి. డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. పదోన్నతులు కల్పించి ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల్లో సచివాలయ ఉద్యోగులకు అవకాశమివ్వాలి. పించన్ల పంపిణీలో ఉద్యోగులపై ఒత్తిడి లేకుండా చూడాలి.' అని వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. పశ్చిమ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.రమణ, కోశాధికారి రంగారావు, గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీబాషా పాల్గొన్నారు.


అభినందనలు అందుకున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులకు ప్రశంస

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియా వాల్వ్స్, పీసీఆర్ టోక్యో వాల్వ్స్, పీసీఆర్ లండన్ వాల్వ్స్ వంటి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రమేష్ హాస్పిటల్స్ వైద్యులు వైద్యనిపుణుల ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 26న లండన్‌లో నిర్వహించిన పీసీఆర్ లండన్ వాల్వ్స్ సదస్సులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నూకవరపు రాజా రమేష్ పాల్గొన్నారు. తీవ్ర లెఫ్ట్ వెంట్రికులర్ డిస్‌ఫంక్షన్ ఉన్న రోగికి అయోటిక్ కవాట మార్పిడి విజయవంతంగా నిర్వహించడంపై సదస్సులో హాజరైన సభ్యులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడారు. 'ఏపీలో తొలిసారిగా టావి(టీఏవీఐ), మైట్రా క్లిప్ చికిత్సలను విజయవంతంగా నిర్వహించాం. ఇప్పటివరకు 30 మందికి పైగా అయోటిక్ లేదా మైట్రల్ కవాటాలను శస్త్రచికిత్స అవసరం లేకుండా ట్రాన్స్‌క్యాతటర్ వాల్వ్ రీప్లేస్మెంట్ విధానంలో విజయవంతంగా నిర్వహించాం. అంతర్జాతీయ వేదికలపై ఆస్పత్రి మరోసారి ప్రత్యేక ముద్ర వేసింది.' అని రమేష్‌బాబు తెలిపారు. తమ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ వైద్య బృందం నైపుణ్యం, కృషి వల్ల ఈ ఘనత సాధ్యమైందన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆస్పత్రి సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ భాస్కరనాయుడు, డాక్టర్ జి.కృష్ణమోహన్, డాక్టర్ సోమనాథ్, డాక్టర్ రాజారమేష్, డాక్టర్ అనూప్, డాక్టర్ రామ్‌మనోహర్, డాక్టర్ మధుకృష్ణ, డాక్టర్ వెంకటేష్‌రెడ్డి, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ షహనాజ్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

» మంత్రి శ్రీనివాస్‌తో విజయవాడ చాంబర్ ప్రతినిధుల భేటీ

ధర్నాచౌక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు గడ్డం బాల వెంకటరవికుమార్ నేతృత్వంలో చాంబర్ ప్రతినిధులు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చాంబర్ ఆధ్వర్యంలో వ్యాపారుల సమస్యలపై ముఖాముఖి నిర్వహిస్తున్నట్టు మంత్రికి వివరించారు. వ్యాపారులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రతినిధుల బృందానికి మంత్రి హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డూండీ రాకేశ్, చాంబర్ ఉపాధ్యక్షుడు వీవీకే నరసింహారావు, జాలాది వెంకటేశ్వరరావు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.


మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

నేడు, రేపు సైక్లింగ్ టీమ్‌ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మందడం గ్రామంలో సీడ్ యాక్సెస్ రోడ్డు వద్ద ఈనెల 30, డిసెంబరు 1వ తేదీల్లో ఏపీ సైక్లింగ్ అండర్-14, 16, 18 బాల, బాలికలు 20 ప్లస్ మహిళలు, పురుషుల టీమ్‌ల ఎంపికలను నిర్వహిస్తున్న ట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 8 గంటలకు గుడ్‌రోడ్ స్పాట్‌లో రిపోర్టు చేయాలన్నారు. ఇక్కడ సత్తా చాటిన వారిని డిసెంబరు 7 నుంచి 10 వరకు ఒడిసాలోని పూరిలో నిర్వహించే జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. వివరాలకు 98493 79932 సంప్రదించాలని సూచించారు.

2, 3 తేదీల్లో కౌలురైతు సంఘం నిరసనలు

ఆటోనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని 48 గంటల్లో ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిసెంబరు 2, 3 తేదీల్లో స్థానికంగా నిరసనలు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సం ఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ధాన్యం కొనుగలు కేంద్రాల వద్ద గోనెసంచులు అందుబాటులో ఉంచాలని, ఆర్బీకేల వద్ద చూసిన తేమశాతం ఆధారంగానే ధాన్యం ధరను ఆర్బీకే వద్దే నిర్ణయించాలని డిమాండ్ చేసింది.

10న మాదిగల కృతజ్ఞతయాత్ర ముగింపు సభ

ధర్నాచౌక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ వేసిన సీఎం చంద్రబాబునాయుడుకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరు పోగు వెంకటేశ్వరరావు మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు ఏబీసీడీ వర్గీకరణ చేయడం వల్ల మాదిగలకు 25 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. గత ఎన్నికల్లో 29 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలో సగం సీట్లు మాదిగలకు కేటాయించి సామాజిక న్యాయం చేసినందుకే ఆగస్టు 16 నుంచి హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞత యాత్ర చేపట్టామన్నారు. డిసెంబరు 10న నగరంలోని ఐలాపు రం కన్వెన్షన్‌లో యాత్ర ముగింపుసభ నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

సమ్మె ఒప్పందం అమలు చేయాలి

» అంగన్వాడీ సంఘాల డిమాండ్

ధర్నాచౌక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని అంగన్వాడీ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. డిసెంబర్ 12కు సమ్మె ప్రారంభించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుస్థాయిలో నిరసన, ప్రదర్శనలు చేయాలని మూడు కమిటీలు నిర్ణయించాయన్నారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్లు ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ), ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ప్రతినిధులు సుబ్బరావమ్మ, జె.లలితమ్మ, ఆర్.జ్యోతి పాల్గొన్నారు.

డ్రగ్స్ స్మగ్లింగ్ కోసం స్టార్‌లింక్

అరేబియా సముద్రంలో 500 కేజీల డ్రగ్స్ పట్టివేత

చెన్నై, నవంబరు 29: అరేబియా సముద్రంలో జరిపిన ఒక ఆపరేషన్‌లో భారత నౌకాదళం 500 కేజీల మాదకద్రవ్యాల(క్రిస్టల్ మెథంఫెటమైన్)ను స్వాధీనం చేసుకుంది. 9 మందిని అదుపులోకి తీసుకుంది. నవంబరు 24న శ్రీలంక నౌకాదళం నుంచి అందిన సమాచారం మేరకు మొదలైన ఈ ఆపరేషన్ రెండు రోజులపాటు సాగింది. అరెస్టు చేసిన 9మందిని భారత్ శ్రీలంక నౌకాదళానికి అప్పగించింది. కాగా, ఈ మాదక ద్రవ్యాల రవాణాకు స్మగ్లర్లు అత్యాధునిక స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత సమాచార పరికరాలను ఉపయోగించారని అండమాన్, నికోబార్ పోలీసులు వెల్లడించారు. అక్కడ పట్టుబడిన చేపల వేట ట్రాలర్ నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఆ ట్రాలర్ వెళ్లాల్సిన మార్గ సూచికలు(నావిగేషన్ కోఆర్డినేట్స్)కూడా సేవ్ చేసి ఉన్నాయి. ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్ 'ఎక్స్' నిర్వహిస్తోన్న స్టార్‌లింక్ సుదూర సముద్ర జలాల్లో కూడా అధిక వేగ ఉపగ్రహ ఆధారిత ఇంటర్‌నెట్‌ని అందిస్తోంది. ఇది స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహించేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. మరోవైపు, కొలంబియా దేశ అధికారుల ఆధ్వర్యంలో 60కి పైగా దేశాల అధికారులు జరిపిన ఆపరేషన్‌లో భారీఎత్తున మాదక ద్రవ్యాలను పట్టుకున్నారు. కొలంబియా నుంచి ఆస్ట్రేలియాకు ఆరు సెమి సబ్‌మెర్సిబుల్ పడవల్లో వీటిని రవాణా చేస్తుండగా పసిఫిక్ మహా సముద్రంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొకెయిన్ 225 టన్నులు, 128 టన్నుల గంజాయితోపాటు మొత్తం 1400 టన్నులకు పైగా మాదక ద్రవ్యాలు ఉన్నాయి.

ప్రసాదం నాణ్యతపై 'పిల్'ను తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 29: ఆలయాల్లో పంపిణీ చేసే ప్రసాదం, ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేలా నిబంధనలు రూపొందించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) శుక్రవారం సుప్రీంకోర్టు తిస్కరించింది. ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపర నిర్ణయమని, తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఇది ప్రచారం కోసం వేసిన వ్యాజ్యం కాదని తెలిపారు. ప్రసాదం, ఆహారం తిని భక్తులు అస్వస్థతకు గురయిన సందర్భాలు ఉండడంతో దీన్ని దాఖలు చేసినట్టు చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ "అలాంటప్పుడు దీన్ని ఒక్క ప్రసాదానికే పరిమితం చేయడం ఎందుకు? రెస్టారెంట్లు, కిరాణా కొట్లను కూడా కలపండి. అక్కడ కూడా కల్తీ జరగవచ్చు" అని వ్యాఖ్యానించింది.

సంభాల్ కోర్టు విచారణపై సుప్రీంకోర్టు స్టే!

న్యూఢిల్లీ, నవంబరు 29: యూపీలోని చందాసీలో ఉన్న మొఘల్ కాలం నాటి జామా మసీదు సర్వే అంశం మీద స్థానిక సంభాల్ జిల్లా కోర్టు జరుపుతున్న విచారణపై సుప్రీంకోర్టు తాత్కాలిక నిలుపుదల (స్టే) విధించింది. స్థానిక కోర్టు ఆదేశాల మేరకు మసీదులో సర్వే జరిపిన కోర్టు కమిషనర్ రూపొందించే నివేదికను తదుపరి ఆదేశాల వరకూ బహిరంగపరచవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మసీదులో సర్వే జరపాలంటూ సంభాల్ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ షాహీ జామా మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. స్థానిక కోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు రాకుండా, తొలుత హైకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని పిటిషనర్లకు సూచించింది. మూడు పనిదినాల్లో అలహాబాద్ హైకోర్టు ఈ అంశాన్ని విచారణకు తీసుకోవాలని ఆదేశించింది.

నవజోత్ సిద్ధు భార్యకు రూ.850 కోట్లకు నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 29: మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత నవజోత్ సింగ్ సిద్ధు, ఆయన భార్య నవజోత్ కౌర్ సిద్ధు చిక్కుల్లో పడ్డారు. అల్లోపతి మందులతో పనిలేకుండా కేవలం ఆహార నియంత్రణతోనే తన భార్యకు స్టేజ్-4 కేన్సర్ నయమైందంటూ సిద్ధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ సివిల్ సొసైటీ (సీసీఎస్) కౌర్‌కు రూ.850 కోట్లకు నోటీసులు పంపించింది. కేన్సర్ చికిత్సకు సంబంధించి వారం రోజుల్లోగా ఆధారాలు చూపించాలని, లేదంటే రూ.850 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆ నోటీసుల్లో హెచ్చరించింది. దీనిపై సీసీఎస్ కన్వీనర్ డాక్టర్ కుల్దీప్ సోలంకి మాట్లాడుతూ.. 'ఇలాంటి మాటలు విని కేన్సర్ రోగులు అల్లోపతి చికిత్స తీసుకోవడం, మందులు వేసుకోవడం మానేస్తే వారి ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుంది' అని పేర్కొన్నారు.

ఎన్నికల అక్రమాలపై ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవలి ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) శుక్రవారం ఇక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. దాదాపు నాలుగున్నర గంటలపాటు జరిగిన ఈ భేటీలో.. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను సమీక్షించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శులు కె.సి. వేణుగోపాల్, జైరాం రమేశ్ మీడియాకు వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు, క్రమశిక్షణను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఈ సమావేశంలో పిలుపునివ్వగా.. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా కార్యకర్తలు నైతిక స్థైర్యం కోల్పోకూడదని రాహుల్ గాంధీ అన్నారు. రెండు రాష్ట్రాల్లో ఫలితాలు తమకు దిగ్భ్రాంతి కలిగించాయన్న సీడబ్ల్యూసీ.. ఒక పథకం ప్రకారం ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించింది. ఈ ఫలితాలపై సాంకేతిక, రాజకీయ సమీక్షల్ని నిర్వహిస్తున్నామని, త్వరలో మరింత స్పష్టంగా ఈ అక్రమాలను ప్రజల ముందు పెడతామని తెలిపింది. ఫలితాల విశ్లేషణకు అంతర్గత కమిటీలు ఏర్పర్చాలని నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాల్లో జిల్లాలవారీగా సమీక్షలు జరిపి పార్టీ పనితీరును బలోపేతం చేయాల్సిన బాధ్యతను ఖర్గేకు అప్పగించాలని సీడబ్ల్యూసీ తీర్మానించింది. ఎన్నికల్లో ఓటమికి జవాబుదారీ ఎవరిదో నిర్ణయించి కఠిన చర్యలు తీసుకోవాలని నిశ్చయించింది. "మహాత్మాగాంధీ బెల్గాంలో 1924లో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు జరపాలి. డిసెంబర్ 26-27 తేదీల్లో బెల్గాంలో ప్రత్యేక వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి" అని సీడబ్ల్యూసీ తీర్మానించింది. జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి పార్టీల గెలుపు, వయనాడులో ప్రియాంక ఘనవిజయంపై సీడబ్ల్యూసీ హర్షం వ్యక్తం చేసింది. అదానీ, మణిపూర్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలపై చర్చకు ఒప్పుకోకుండా మోదీ సర్కారు మొండిగా వ్యవహరిస్తోందని నిరసన వ్యక్తం చేసింది.



కఠిన చర్యలు తప్పవు: ఖర్గే

వరుస అపజయాలతో కుంగిపోతున్న కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావాలంటే.. పార్టీని మూలాల నుంచి బలోపేతం చేయాలంటే.. కఠిన చర్యలు తీసుకోకతప్పదని ఖర్గే అన్నారు. ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలంటే ఓటమికి కారకులైన వారిని జవాబుదారీ చేయాలని, పార్టీలో ఉన్న సంస్థాగత లోపాలను సవరించుకోవాలని ఆయన తన అధ్యక్షోపన్యాసంలో పిలుపునిచ్చారు. ఈవీఎంల పనితీరు కూడా ఎన్నికల ఫలితాలపై అనుమానాలను ఏర్పరుస్తున్నాయని, దేశంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది అని ఆయన చెప్పారు. కార్యకర్తలు, నాయకులు.. అంతా కలిసికట్టుగా పోరాడాలని, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు బహిరంగ ప్రకటనలు చేయడం మానుకోవాలని సూచించారు. అది జరగనంత కాలం ప్రత్యర్థులను రాజకీయంగా ఎలా ఎదుర్కొంటామని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వాతావరణం ఏర్పడినంత మాత్రాన విజయం లభించినట్లు కాదని, ఆ వాతావరణాన్ని ఫలితాలుగా మార్చగలిగిన శక్తిని సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. పాతకాలం పద్ధతులతో పార్టీ విజయాలు సాధించలేదని.. రాజకీయ ప్రత్యర్థుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండాలని, తగిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ ఒంటరి పోరు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయనుంది. మొత్తం 70 నియోజకవర్గాల్లోనూ ఎవ్వరితోనూ పొత్తు పెట్టుకోకుండా పోటీ చేస్తామని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. ఇండి కూటమిలో భాగంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ హరియాణాలో ఒంటరిగా పోటీ చేయడంతో ఢిల్లీలో కాంగ్రెస్ పొత్తుకు దూరంగా ఉంది.

ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నివేదిక!

న్యూఢిల్లీ, నవంబరు 29: మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమి పరాభవానికి ఎన్నికల్లో జరిగిన అక్రమాలే కారణమని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఇదేసమయంలో ఎన్నికల సంఘం మాజీ చీఫ్ కమిషనర్ ఎస్.వై. ఖురేషీ కూడా మహారాష్ట్ర ఎన్నికల ప్రక్రియపై పలు సందేహాలు లేవనెత్తారు. ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలైన ఓట్లు, ఓట్ల లెక్కింపును ఆయన నిశితంగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాజాగా కాంగ్రెస్ పార్టీ 12 పేజీలతో కూడిన నివేదికను 'అత్యవసర మెమొరాండం' పేరుతో శుక్రవారం ఈసీకి సమర్పించింది. తాము లేవనెత్తుతున్న సందేహాలపై విచారణ చేయాలని, ఇన్ పర్సన్(భౌతికంగా) సమావేశం నిర్వహించి ఎన్నికల్లో అక్రమాలపై నిగ్గుతేల్చాలని కోరింది. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయని పేర్కొంటూ ఖురేషీ వ్యాఖ్యలను జోడించింది. ఏకపక్షంగా ఓటర్లను తొలగించారని, అదేసమయంలో ఒక్కొక్క నియోజకవర్గంలో 10 వేల మంది చొప్పున ఓటర్లను చేర్చారని తెలిపింది. అదేవిధంగా పోలింగ్ సమయంలో ప్రకటించిన ఓటింగ్ శాతానికి, మరుసటి రోజు ప్రకటించిన ఓటింగ్ శాతానికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని పేర్కొంది.

అదానీపై అదే రగడ

న్యూఢిల్లీ, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాలు అయిదో రోజు కూడా ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడ్డాయి. ప్రతి రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కాగానే అదానీపై అమెరికా చేసిన ఆరోపణలపై చర్చకు అనుమతి ఇవ్వాలని విపక్షాలు పట్టుపట్టాయి. దర్యాప్తునకు జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండు చేశాయి. మణిపూర్, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసాకాండపై చర్చించాలని నినాదాలు చేయడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. అదే సమయంలో రాజ్యసభ కూడా విపక్ష సభ్యుల నినాదాలతో అట్టుడుకుంది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభ్యుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభను డిసెంబర్ 2వ తేదీ (సోమవారానికి)కి వాయిదా వేశారు. అటు లోక్‌సభ మళ్లీ ప్రారంభమైనప్పటికీ ఇదే పరిస్థితి కనిపించడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

అలిగిన శిందే.. సొంతూరికి

ముంబై, నవంబరు 29: మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరనే విషయంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఢిల్లీలో బీజేపీ అధిష్ఠానంతో గురువారం చర్చల తర్వాత శుక్రవారం ముంబైలో జరగాల్సిన మహాయుతి కూటమి సమావేశం రద్దు అయింది. తర్వాత ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే తన సొంతూరు సతారాకు వెళ్లిపోయారు. ఢిల్లీ సమావేశంలో ఆయన పట్టణాభివృద్ధి శాఖతో పాటు హోం మంత్రిత్వ శాఖ కూడా అడిగినట్లు తెలిసింది. హోం శాఖ సీఎం వద్దే ఉంటుందంటూ బీజేపీ అధిష్ఠానం నిరాకరించినట్లు సమాచారం. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఢిల్లీలో గురువారం రాత్రి జరిగిన సమావేశం తర్వాత విలేకరులకు ఏ విషయమూ చెప్పకుండానే నేతలంతా మౌనంగా వెళ్లిపోయారు. ముంబై తిరిగి వచ్చిన శిందే సొంతూరుకు వెళ్లిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాగా, మహాయుతి సమావేశం ఆదివారం జరుగుతుందని కూటమి వర్గాల ద్వారా తెలిసింది. ఆ రోజే సీఎం అభ్యర్థిపై, మంత్రి పదవులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది.

లోకం తీరు



ప్రతీ ఓటీపీని బ్యాంకు ధ్రువీకరించాల్సిందే

ఆ తర్వాతే వినియోగదారుడికి సందేశం

న్యూఢిల్లీ, నవంబరు 29: టెలికం రెగ్యులేటరీ అథారిటీ డిసెంబరు 1 నుంచి కొత్త నిబంధనను అమల్లోకి తెస్తోంది. ట్రేసబిలిటీ గైడ్‌లైన్స్‌గా పిలుస్తున్న ఆ నిబంధనల ప్రకారం టెలికం సంస్థలు వినియోగదారులకు వచ్చే ఓటీపీలు నిజమైనవా? కాదా? ధ్రువీకరించుకొని మాత్రమే డెలివరీ చేస్తాయి. ముందు ఓటీపీలు నిర్దిష్ట ఫార్మాట్‌లో ఉన్నాయా? లేదా? చూస్తాయి. ఆ తర్వాత ఓటీపీ సందేశంలో పేర్కొన్న బ్యాంకు లేదా ఈ-కామర్స్ కంపెనీ నుంచే వచ్చిందా? లేదా? అని కూడా ధ్రువీకరించుకుంటాయి. ఆ తర్వాతే వినియోగదారుడికి సందేశాన్ని పంపిస్తాయి. తద్వారా స్పామ్ లేదా మోసపూరిత సందేశాలను చాలా వరకు పరిహరించవచ్చు. అయితే, ఈ మొత్తం ప్రాసెస్ వల్ల ఓటీపీలు కస్టమర్‌కు చేరడానికి సమయం పడుతుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పాముకాటును నోటిఫైబుల్ డిసీజ్‌గా గుర్తించండి

న్యూఢిల్లీ, నవంబరు 29: పాముకాటులను 'ప్రకటనార్హ వ్యాధి' (నోటిఫైబుల్ డిసీజ్)గా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. పాముకాటు బాధితులు, ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలను తప్పకుండా ప్రభుత్వానికి పంపించడం కోసం ఈ గుర్తింపు ఇవ్వడం తప్పనిసరి. ప్రయివేటు ఆస్పత్రులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఈ సమాచారం ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. ఈ గుర్తింపు ఇచ్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని సూచిస్తూ కేంద్రం లేఖ రాసింది. దేశంలో ఏటా 30-40 లక్షల మంది పాముకాటుకు గురవుతుండగా సుమారు 50వేల మంది మరణిస్తున్నారు.

నవ్య | చిత్రజ్యోతి

కాపీరైట్ ఉల్లంఘన జరగలేదు

● నోటీసులపై నయనతార లాయర్ స్పందన




'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీ విషయంలో నటి నయనతారకు, హీరో ధనుష్‌కు మధ్య తలెత్తిన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తన చిత్రంలోని మూడు సెకన్ల సన్నివేశాలను వినియోగించారని పేర్కొంటూ నయనతార దంపతులపై ధనుష్ మద్రాస్ హైకోర్టులో దావా వేయగా, దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు నయన్ దంపతులకు నోటీసులు జారీ చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై నయనతార న్యాయవాది రాహుల్ ధవాన్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. నయనతార డాక్యుమెంటరీలో ఎలాంటి కాపీరైట్ ఉల్లంఘన జరగలేదని పేర్కొన్నారు. అందులో ఉపయోగించిన క్లిప్పింగ్స్ 'నానుం రౌడీ దాన్' సినిమాలోని సన్నివేశాలు కాదని, అవి వ్యక్తిగత లైబ్రరీలోని బీటీఎస్‌కు సంబంధించినవని స్పష్టంచేశారు.

వడ్డీతో సహా తిరిగొస్తుంది

ఇదిలా ఉంటే నయనతార శుక్రవారం కర్మ సిద్ధాంతాన్ని పేర్కొంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. 'అబద్ధాలతో పక్కవారి జీవితాన్ని నాశనం చేయాలని చూసేవాళ్లు దాన్నొక అప్పుగా భావించండి. ఏదో ఒక రోజున మీకు వడ్డీతో సహా తిరిగొస్తుందని గుర్తు పెట్టుకోండి' అనేది ఆ పోస్ట్ సారాంశం. నయనతార ఈ పోస్ట్ ద్వారా ధనుష్‌కు వార్నింగ్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

సమంతకు పితృవియోగం



నటి సమంతకు పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు శుక్రవారం గుండెపోటుతో చెన్నై నగరంలో మృతి చెందారు. తండ్రి మరణవార్తను సమంత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. ఒక ఎమోజీని షేర్ చేస్తూ 'నాన్నా... మళ్లీ మనం కలిసేంత వరకూ...' అంటూ పేర్కొన్నారు. తెలుగు ఆంగ్లో ఇండియన్ అయిన జోసెఫ్ ప్రభు మలయాళ కుటుంబానికి చెందిన నినెట్‌ను వివాహం చేసుకున్నారు. మొదటి నుంచీ సమంతకు తండ్రితో అనుబంధం ఎక్కువ. చిన్నతనం నుంచి తనలో ఆత్మవిశ్వాసం నింపి, తను ఈ స్థాయికి ఎదగడానికి తల్లితండ్రులే కారణం అని సమంత పలు సందర్భాల్లో చెప్పారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

హల్దీ వేడుక



అక్కినేని నాగ చైతన్య - శోభిత ధూళిపాళ్ల డిసెంబరు 4న వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. గురువారం కాబోయే వధూవరులకు హల్దీ వేడుక నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలో కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. నాగచైతన్య, శోభితలకు మంగళ స్నానాలు చేయించి అభినందనలు తెలిపారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

శ్రీవల్లితో కలసి స్టెప్పులేసిన పుష్ప



అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించిన 'పుష్ప' చిత్రం డిసెంబర్ 5న విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో సినిమా ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. పట్నాతో ప్రారంభించి, చెన్నై, కొచ్చిలలో ఈవెంట్స్ నిర్వహించిన చిత్ర యూనిట్ శుక్రవారం ముంబైలో ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో అల్లు అర్జున్, రష్మిక స్టెప్స్ వేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ మాట్లాడుతూ 'నేను హీరోగా నిలబడ్డానంటే కారణం దర్శకుడు సుకుమారే. నన్ను స్టార్‌ని చేసింది ఆయనే. హీరోగా నా ఎదుగుదల లో ఆయన పాత్ర కీలకం. ఈ నిర్మాతలు లేకపోతే 'పుష్ప' నిర్మాణం సాధ్యమయ్యేది కాదు. బాలీవుడ్‌లో విడుదల చేస్తున్న అనిల్ తడాని, భరత్ భూషణ్‌కు ధన్యవాదాలు' అని చెప్పారు. ఐదు సంవత్సరాల 'పుష్ప' ప్రయాణంలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయని రష్మిక చెప్పారు. చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 12 వేలకు పైగా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు నవీన్, రవిశంకర్ చెప్పారు.

ఆ నిర్ణయం మారొచ్చు



'ఏ.ఆర్.రెహమాన్, సైరాభానులది సుదీర్ఘ వైవాహిక ప్రయాణం. ఎంతో ఆలోచించాకే వారిద్దరు విడిపోవడానికి సిద్ధపడ్డారు. అయినా ఆ నిర్ణయం మారొచ్చు. వారిద్దరూ తిరిగి కలిసే అవకాశం లేకపోలేదు' అని లాయర్ వందన షా ఓ ఇంటర్వ్యూలో అన్నారు. రెహమాన్, సైరాభాను విడిపోవడం జీర్ణించుకోలేని అభిమానుల్లో వందన షా వ్యాఖ్యలు ఆనందాన్ని నింపాయి. ఈ జంట కలిసుండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

కాగా, గోవాలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' ముగింపు వేడుకల్లో రెహమాన్ పాల్గొన్నారు. ఈతరం ఎక్కువగా ఎదుర్కొంటున్న కుంగుబాటు సమస్యపై మాట్లాడారు. 'ఈ రోజుల్లో చాలామంది ఒత్తిడి, కుంగుబాటుకు గురవుతున్నారు. జీవితంలో ఏదో కోల్పోయామనే భావనలో ఉంటున్నారు. జీవితమంతా శూన్యంగా మారిందనే భ్రమలో జీవిస్తున్నారు. అలాంటి వారు చదవడం, రాయడం లేదా మనకు ఇష్టమైన సంగీతం వినడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. నాకు కూడా యవ్వనంలో ఉన్నప్పుడు ఓ సారి ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. 'మనం ఇతరుల కోసం జీవించినప్పుడు ఆత్మహత్య ఆలోచనలు రావు' అని ఆ సమయంలో మా అమ్మ ఇచ్చిన సలహా నా జీవితాన్ని మార్చేసింది' అని రెహమాన్ అన్నారు.

వచ్చే నెలలో నా పెళ్లి

కీర్తి సురేశ్



తన స్నేహితుడు ఆంటోనీతో ప్రేమలో ఉన్నాననీ, దాదాపు పదిహేనేళ్ల తమ స్నేహబంధం ఇకపై జీవితాంతం కొనసాగనుందని ఇటీవల వెల్లడించిన హీరోయిన్ కీర్తి సురేశ్ తమ పెళ్లి ఎప్పుడనేది మీడియాకు చెప్పేశారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపంలో వేద పండితుల ఆశీర్వాదం పొందిన కీర్తి సురేశ్ ఆలయం వెలుపలికి వచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడారు. వచ్చే నెలలో తన పెళ్లి గోవాలో జరుగనుందని, అందుకే స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం కీర్తి సురేశ్ 'బేబీ జాన్' హిందీ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమాతోనే ఆమె బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వరుణ్ ధావన్ ఇందులో హీరోగా నటిస్తున్నారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

నందమూరి నాయకా...



మహానటుడు ఎన్టీఆర్ మనవడు, బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్న సంగతి తెలిసిందే. 'హను-మాన్' ఫేం ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఈ సినిమాను తేజస్విని, చెరుకూరి సుధాకర్ కలసి నిర్మిస్తున్నారు. మోక్షజ్ఞ పుట్టినరోజున ఈ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన దగ్గర నుంచి షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని నందమూరి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పౌరాణిక గాథల స్ఫూర్తితో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. తాజాగా మోక్షజ్ఞ కొత్త స్టిల్‌ను శుక్రవారం విడుదల చేశారు. గడ్డం, చెక్ షర్ట్‌తో చాలా హాండ్‌సమ్‌గా కనిపించారు మోక్షజ్ఞ. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.



జాసన్ సంజయ్ దర్శకత్వంలో..

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వంలో సినిమా తీయబోతున్నట్లు 'లైకా' సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో హీరోగా సందీప్ కిషన్ నటించబోతున్నారని ప్రకటిస్తూ మూవీ పోస్టర్‌ను చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకెఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ 'జాసన్ సంజయ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ఈ కథలో పాన్ ఇండియా దృష్టిని ఆకర్షించే ప్రధానమైన పాయింట్ ఉంది. తమన్ సంగీతం అందించబోతున్నారు. జనవరిలో షూటింగ్ ప్రారంభించబోతున్నాం' అని తెలపారు.

ముగిసిన ఇఫీ చిత్రోత్సవం

- ఆస్ట్రేలియా దర్శకుడు ఫిలిప్ నోయిస్‌కు సత్యజిత్ రే జీవిత సాఫల్య పురస్కారం
- ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2024 - విక్రాంత్ మాస్సే
- 'టాక్సిక్' చిత్రానికి 'ది గోల్డెన్ పీకాక్' పురస్కారం

ఈ నెల 20 నుంచి 28 వరకూ తొమ్మిది రోజుల పాటు సినీ ప్రేమికులను అలరించిన 55వ భారత అంతర్జాతీయ చిత్రోత్సవం (ఇఫీ) ముగిసింది. గురువారం గోవాలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రతిష్ఠాత్మక సత్యజిత్ రే జీవిత సాఫల్య పురస్కారం ఆస్ట్రేలియా దర్శకుడు ఫిలిప్ నోయిస్‌కు దక్కింది. ఉత్తమ చిత్రం విభాగంలో లిథువేనియన్ చిత్రం 'టాక్సిక్' 'ది గోల్డెన్ పీకాక్' పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ చిత్రానికి గాను ఉత్తమ నటీమణులుగా వెస్ట, లెవాలు సంయుక్తంగా పురస్కారం అందుకున్నారు. 'ద న్యూ ఇయర్ దట్ నెవర్ కేమ్' చిత్రానికి గాను రొమేనియాకు చెందిన బోగ్దాన్ మురేసాకు ఉత్తమ దర్శకుడి పురస్కారం దక్కింది. ఫ్రెంచ్ చిత్రం 'హోలీ కౌ'లో నటించిన కెమెంట్ ఫావు ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. స్వీడిష్ చిత్రం 'క్రాసింగ్' దర్శకుడు లెవన్ అకిన్ ఐసీఎఫ్‌టీ - యునెస్కో గాంధీ మెడల్ - 2024 పురస్కారాన్ని అందుకున్నారు.



ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సేకు దక్కింది. ఇండియన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో గుజరాతీ చిత్రం 'ఘరత్ గణపతి'కి గాను నవజ్యోత్ బండివాడేకర్ ఉత్తమ అరంగేట్ర దర్శకుడిగా పురస్కారాన్ని దక్కించుకున్నారు.



ఫిలిప్ నోయిస్



విక్రాంత్ మాస్సే

మరాఠీ వెబ్‌సిరీస్ 'లంపన్' ఉత్తమ వెబ్‌సిరీస్‌గా నిలిచింది. ఈ చిత్రోత్సవాల్లో 80 దేశాలకు చెందిన 180 సినిమాలను ప్రదర్శించారు. ఇఫీ ముగింపు వేడుకల్లో దేశ విదేశాలకు చెందిన సినీ ప్రముఖులు సందడి చేశారు. రష్మిక మందన్న, శ్రియా శరణ్, ప్రతీక్‌గాంధీ, మధుర్ భండార్కర్, హరీశ్ శంకర్, నివేదాథామస్, నిర్మాత దిల్‌రాజు సహా పలువురు సినీ ప్రముఖులు ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ చిత్రోత్సవంలో అక్కినేని నాగేశ్వరరావు, రాజ్‌కపూర్, గాయకుడు మహమ్మద్ రఫీ, దర్శకుడు తపన్‌సిన్హాల శతాబ్ది వేడుకలు నిర్వహించారు.

కేర్ హాస్పిటల్స్ చేతికి
ఏస్టర్ డీఎం హెల్త్

మూడో అతి పెద్ద హాస్పిటల్ చైన్‌గా అవతరణ.. హైదరాబాద్‌లోనే ప్రధాన కార్యాలయం



న్యూఢిల్లీ: దేశంలో ఆస్పత్రుల రంగంలో మరో భారీ విలీనం చోటు చేసుకుంది. బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ హాస్పిటల్ చెయిన్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్‌లో (కేర్ హాస్పిటల్స్) విలీనమవుతోంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. విలీనం తర్వాత కంపెనీ పేరు ఏస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్‌గా (ఏడీక్యూసీఎల్) మారుస్తారు. కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించనున్నట్టు ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ ప్రకటించింది. ఈ విలీనంతో అపోలో, మణిపాల్ హాస్పిటల్స్ తర్వాత ఏడీక్యూసీఎల్ దేశంలో మూడో అతి పెద్ద ఆస్పత్రుల చెయిన్‌గా ఆవిర్భవించనుంది.

ఏస్టర్ డీఎందే మెజారిటీ వాటా

ఈ విలీనంతో ఏర్పడే ఏడీక్యూసీఎల్ కంపెనీ ఈక్విటీలో ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ వాటాదారులకు 57.3 శాతం వాటా ఉంటుంది. మిగిలిన 42.7 శాతం వాటా క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ (క్యూసీఐఎల్) వాటాదారులకుంటుందని ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ స్టాక్ ఎక్స్ఛేంజిలకు తెలిపింది. విలీన కంపెనీ మొత్తం ఈక్విటీలో ఏస్టర్ డీఎం ప్రమోటర్లయిన మూపెన్ కుటుంబానికి 24 శాతం, కేర్ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్న ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్‌కు 30.7 శాతం వాటా ఉంటుంది. విలీనం తర్వాత కూడా ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ ప్రధాన ప్రమోటర్ ఆజాద్ మూపెన్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, క్వాలిటీ కేర్ గ్రూప్ ఎండీ వరుణ్ ఖన్నా ఎండీ, సీఎఫ్ఓగా కొనసాగుతారు.

10,000కు పైగా పడకలు

ఈ విలీనంతో ఏస్టర్ డీఎం, కేర్ హాస్పిటల్స్ కిమ్స్ హెల్త్, ఎవర్‌కేర్ పేర్లతో నడుస్తున్న నాలుగు ప్రధాన హాస్పిటల్ చెయిన్స్ ఏడీక్యూసీఎల్ నిర్వహణలోకి రానున్నాయి. ఈ నాలుగు హాస్పిటల్స్‌కు ప్రస్తుతం దేశంలోని 27 నగరాల్లో 10,150+ పడకలతో కూడిన 38 ఆస్పత్రులున్నాయి. అంతర్గత వనరులతో 2027 మార్చి నాటికి మరో 3,500 పడకలను ఏడీక్యూసీఎల్ ఏర్పాటు చేయనుంది.

ఏస్టర్ గూటికి ప్రేరణ హాస్పిటల్

మహారాష్ట్రలోని కొల్హాపూర్ కేంద్రంగా పనిచేసే 254 పడకల ప్రేరణ హాస్పిటల్‌ను, ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ పూర్తిగా కొనుగోలు చేసింది. ఏస్టర్ ఆధార్ హాస్పిటల్ పేరుతో నిర్వహిస్తున్న ఈ హాస్పిటల్ ఈక్విటీలో ఏస్టర్ డీఎంకు ఇప్పటికే 87 శాతం వాటా ఉంది. మిగిలిన 13 శాతం వాటా కొనుగోలు చేసేందుకు కూడా ఒప్పందం కుదిరినట్టు తెలిపింది.

సబ్బులు మరింత ప్రియం

ఎనిమిది శాతం వరకు పెంపు



న్యూఢిల్లీ: దేశంలో సబ్బుల ధర పెరిగింది. హిందూస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), విప్రో కన్స్యూమర్, గోద్రెజ్‌తో సహా అన్ని ఎఫ్ఎంసీజీ కంపెనీలు స్నానపు సబ్బుల ధర ఏడు నుంచి ఎనిమిది శాతం పెంచేశాయి. సబ్బుల తయారీలో ప్రధాన ముడి పదార్థమైన పామాయిల్ ధర 35 నుంచి 40 శాతం పెరగడంతో కంపెనీలు ఈ చర్య తీసుకున్నాయి. స్నానపు సబ్బుల ధరతో పాటు చర్మ సంరక్షణ క్రీమ్‌ల ధరలను కూడా కంపెనీలు పెంచాయి. కొన్ని కంపెనీలు ఒక్కసారిగా ఏడెనిమిది శాతం పెంచితే, కొన్ని కంపెనీలు దశలవారీగా పెంచేందుకు నిర్ణయించాయి. ఒకేసారి పెంచితే డిమాండ్ తగ్గే ప్రమాదం ఉందని కంపెనీల భయం. ప్రతికూల వాతావరణంతో ఉత్పత్తి తగ్గడంతో ఇటీవల ఎఫ్ఎంసీజీ కంపెనీలు కాఫీ, టీ పొడి ధరలనూ 25 శాతం వరకు పెంచాయి.

మరో చారిత్రక కనిష్ఠానికి రూపాయి

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి 13 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ఠ స్థాయి 84.60కి దిగజారింది. మార్కెట్ నుంచి విదేశీ నిధులు నిరాటంకంగా తరలిపోతుండడంతో పాటు దిగుమతిదారుల నుంచి నెలాఖరు డిమాండు, శుక్రవారం వెలువడిన నిరుత్సాహపూరిత జీడీపీ గణాంకాలు కరెన్సీ మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీన పరిచాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	600	విజయవాడ	605
వరంగల్	602	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,110 ▲	71,600 ▲	1,00000 ▲
ముంబై	76,740 ▲	70,290 ▲	89,380 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	109
కరీంనగర్	105	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	99
కర్నూలు	105	నెల్లూరు	99
విశాఖపట్నం	115	అనంతపురం	99
గోదావరి	109		

సెన్సెక్స్ 760 పాయింట్లు అప్

ముంబై: ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌ను శుక్రవారం పరుగులు తీయించాయి. సెన్సెక్స్ 759 పాయింట్ల లాభంతో 79,802 వద్ద ముగియగా నిఫ్టీ 216.95 పాయింట్ల లాభంతో 24,131.10 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 685.68 పాయింట్లు, నిఫ్టీ 223.85 పాయింట్లు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్-100 సూచీ 0.31 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.76 శాతం లాభంతో ముగిశాయి.

లాభాల్లో అదానీ షేర్లు: అదానీ గ్రూప్‌లోని 11 కంపెనీల్లో 9 కంపెనీల షేర్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ అత్యధికంగా 22 శాతం లాభపడగా అదానీ ఎనర్జీ (16%), అంబుజా సిమెంట్స్ (3.73%) అదానీ పోర్ట్స్ (1.94%), ఏసీ సీ (1.59%), అదానీ టోటల్ గ్యాస్ (1.03%), అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1.02%), ఎన్‌డీటీవీ (0.60 శాతం, అదానీ విల్మర్ (0.05 శాతం) లాభపడ్డాయి.

- ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజనీర్స్ లిస్టింగ్ అదిరింది. బీఎస్ఈలో ఈ షేరు ఇష్యూ ధర రూ.148 కన్నా 47.29 % ప్రీమియంతో రూ.218 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 57.77% లాభపడి రూ.233.50 వరకు వెళ్లిన ఈ షేరు చివరికి 39.86% లాభంతో రూ.207 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 39.97 శాతం లాభంతో రూ.207.16 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో బంగారం ధర 10 గ్రాములు రూ.700 పెరిగి రూ.79,400 పలుకగా కిలో వెండి ధర రూ.1300 పెరిగి రూ.92,200కి చేరింది.

కీలక రంగాలు డీలా

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తికి కీలకమైన 8 రంగాల ఉత్పత్తి వృద్ధిరేటు ఈ అక్టోబరులో 3.1 శాతానికి పడిపోయింది. గత ఏడాదిలో ఇదే నెలలో నమోదైన 12.7 శాతం ఉత్పత్తి వృద్ధితో పోలిస్తే బాగా తగ్గింది. సెప్టెంబరులో నమోదైన 2.4 శాతం వృద్ధితో పోలిస్తే మాత్రం కాస్త మెరుగైంది. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలను కీలకంగా భావిస్తారు. దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీలో ఈ 8 రంగాలు 40.27 శాతం వెయిటేజీ కలిగి ఉన్నాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి 7 నెలలకు (ఏప్రిల్-అక్టోబరు) కీలక రంగాల ఉత్పత్తిలో 4.1 శాతం వృద్ధి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వృద్ధి 8.8 శాతంగా ఉంది.

ఏపీలో కేవీబీ రెండు కొత్త శాఖలు

చెన్నై: ప్రైవేటు రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) గురువారం నాలుగు కొత్త శాఖలు ప్రారంభించింది. వీటిలో రెండు ఆంధ్రప్రదేశ్‌లోను, రెండు తమిళనాడులోను ప్రారంభమయ్యాయి. దీంతో బ్యాంకు శాఖల సంఖ్య 858కి చేరింది. విశాఖపట్టణంలోని మురళీనగర్ శాఖను సింహాచలం దేవస్థానం ఎవాల్యుయేషన్ అధికారి త్రినాథరావు ప్రారంభించారు. కడపలోని ఏడు రోడ్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన బ్రాంచిని ఆర్‌డీఓ జాన్ ఇర్విన్ పాలపర్తి ప్రారంభించారు.

హెచ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా గంటి వెంకటేశ్వర్లు



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెట్ (హెచ్ఎస్ఎల్) డైరెక్టర్‌గా గంటి వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2018 మే నెలలో అడిషనల్ జనరల్ మేనేజర్‌గా సంస్థలో ప్రవేశించారు.



రెండేళ్ల కనిష్ఠానికి జీడీపీ వృద్ధి రేటు

క్యూ2లో 5.4 శాతానికి పరిమితం
తయారీ రంగం పేలవ పనితీరు..
వినియోగంలో తగ్గుదలే కారణం

న్యూఢిల్లీ: భారత ఆర్థిక ప్రగతి చక్రం వేగం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి జీడీపీ వృద్ధిరేటు 7 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి జారుకుంది. తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరుతోపాటు దేశంలో వస్తు వినియోగం తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో జీడీపీ వృద్ధి రేటు 8.1 శాతంగా నమోదు కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో 6.7 శాతంగా ఉంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- 2022-23 ఆర్థిక సంవత్సరం క్యూ3 (అక్టోబరు-డిసెంబరు) వృద్ధిరేటు 4.3 శాతానికి పడిపోగా.. ఆ తర్వాత నమోదైన అత్యల్ప స్థాయి ఇదే.
- వినియోగదారుల వ్యయానికి సంకేతమైన ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ) క్యూ1లో 7.4 శాతం కాగా.. క్యూ2లో 6 శాతానికి తగ్గింది.
- రెండేళ్ల స్థాయికి జారినప్పటికీ, శరవేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన హోదాను నిలబెట్టుకోగలిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో చైనా జీడీపీ వృద్ధి రేటు 4.6 శాతానికి పరిమితమైంది.
- జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరం క్యూ2లో వాస్తవిక జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ అంచనా రూ.44.10 లక్షల కోట్లుగా ఉంది. 2023-24లో ఇదే కాలానికి రూ.41.86 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 5.4 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ2లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ అంచనా రూ.76.60 లక్షల కోట్లుగా ఉంది. గత క్యూ2లో రూ.70.90 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 8 శాతం వృద్ధి నమోదైంది.
- 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థానికి వాస్తవిక జీడీపీ అంచనా రూ.87.74 లక్షల కోట్లుగా ఉంది. 2023-24లో ఇదే కాలానికి రూ.82.77 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 6 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, ఈ ప్రథమార్థంలో నామినల్ జీడీపీ అంచనా రూ.153.91 లక్షల కోట్లుగా ఉంది. 2023-204 ప్రథమార్థంలో రూ.141.40 కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 8.9 శాతం వృద్ధి నమోదైంది.

రెండో త్రైమాసిక జీడీపీ నిరాశపరిచినప్పటికీ, పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలకు అనుగుణంగా 6.5 శాతానికి చేరుకోగలదన్న నమ్మకం ఉందని ప్రభుత్వ ముఖ్య సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ అన్నారు.

క్యూ2లో స్థూల విలువ జోడింపు (జీవీఏ) శాతం

రంగం	2024-25	2023-24
వ్యవసాయం సంబంధిత రంగాలు	3.5	1.7
మైనింగ్ అండ్ క్వారీయింగ్	-0.01	11.1
మాన్యుఫాక్చరింగ్	2.2	14.3
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	3.3	10.5
నిర్మాణం	**7.7**	**13.6**
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	6.0	4.5
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	6.7	6.2
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	9.2	7.7

హైబ్రిడ్‌కు ఒప్పుకొంటారా? లేక తప్పుకొంటారా?

చాంపియన్స్ ట్రోఫీపై పాక్ బోర్డుకు ఐసీసీ అల్టిమేటం



న్యూఢిల్లీ/దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై తాడోపేడో తేల్చేందుకు ఐసీసీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైబ్రిడ్ పద్ధతికి అంగీకరించాల్సిందేనని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు స్పష్టం చేసింది. ఒకవేళ పీసీబీ ఇందుకు ఒప్పుకోకపోతే ఆతిథ్య హక్కులను వదులుకోవాల్సి ఉంటుందని ఏకంగా అల్టిమేటం జారీ చేసింది. ఒకవేళ.. పాక్ బోర్డు ఈ టోర్నీని బాయ్‌కాట్ చేయాలనుకుంటే, ఆ జట్టు లేకుండానే చాంపియన్స్ ట్రోఫీ జరుగుతుందని ఖరాఖండీగా చెప్పేసింది. పాక్ నిర్ణయం తెలిపేందుకు శనివారం వరకు గడువిచ్చింది. ప్రస్తుత పరిస్థితిలో ఐసీసీకి తలొగ్గడం మినహా పాక్ బోర్డుకు మరో దారి లేదని ఇతర సభ్య దేశాలు కూడా భావిస్తున్నాయి. భద్రతా కారణాలరీత్యా వచ్చే ఏడాది జరిగే ఈ మెగా టోర్నీ కోసం తాము పాక్‌లో అడుగుపెట్టమని బీసీసీఐ ఇదివరకే ఐసీసీకి తెలిపింది. అంతేకాదు.. పాక్‌లో భారత జట్టు పర్యటనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని కేంద్ర విదేశాంగ శాఖ కూడా శుక్రవారం స్పష్టం చేసింది. కానీ పాక్ మాత్రం మ్యాచ్‌లన్నీ తమ దేశంలోనే జరగాలని, హైబ్రిడ్ పద్ధతిని ఒప్పుకోమంటూ వాదిస్తోంది. శుక్రవారం జరగాల్సిన ఐసీసీ బోర్డు సమావేశం కూడా ఇందుకే వాయిదాపడింది. హైబ్రిడ్ పద్ధతికి పాక్ అనుకూలంగా ఉంటే మాత్రం భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈలో జరుగనున్నాయి. 'ఒకవేళ భారత్ ఈ టోర్నీలో ఆడకపోతే బ్రాడ్‌కాస్టర్ సంస్థ పెన్నీ కూడా ఐసీసీకి ఇవ్వదు. ఆ విషయం పాక్‌కు కూడా తెలుసు. హైబ్రిడ్ పద్ధతికి పాక్ బోర్డు చైర్మన్ నఖ్వీ అంగీకరిస్తేనే శనివారం సమావేశం జరుగుతుంది. ఇందుకు నేటి వరకు గడువిచ్చాం. ఒకవేళ వారు మరీ పట్టుదలగా వ్యవహరించి బహిష్కరించాలనుకుంటే, పాక్ లేకుండానే మరో దేశంలో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడం ఖాయం. ఏదిఏమైనా పీసీబీ హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తుందనే భావిస్తున్నాం' అని ఐసీసీ బోర్డు అధికారి పేర్కొన్నాడు. ఈ సంకటస్థితిలో పాక్ క్రికెట్ బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. డిసెంబరు 1న జైషా ఐసీసీ కొత్త బాస్‌గా బాధ్యతలు తీసుకోబోతున్నాడు. దీంతో ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్క్‌లే చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై అధికారికంగా చివరి నిర్ణయం తీసుకోనున్నాడు.



ఇద్దరూ సమంగా..

లిరెన్‌తో గుకేష్ నాలుగో రౌండ్ డ్రా
ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మూడో రౌండ్లో విజయంతో అద్భుతంగా పుంజుకున్న భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ఆ తర్వాతి రౌండ్‌ను మాత్రం డ్రాగా ముగించాడు. డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్లో పాయింట్ పంచుకున్నాడు. నల్లపావులతో ఆడిన గుకేష్ ఆరంభంలో వెనుకంజలో ఉన్నా, ఆ తర్వాత పుంజుకొని గేమ్‌ను డ్రా దిశగా మళ్లించాడు. చివరికి 42 ఎత్తుల తర్వాత ఇరువురు ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. బుధవారం జరిగిన మూడో రౌండ్లో 32 ఏళ్ల లిరెన్‌పై గుకేష్ గెలిచిన సంగతి తెలిసిందే. నాలుగో రౌండ్ తర్వాత ఇద్దరు ఆటగాళ్లు చెరి రెండు పాయింట్ల (2-2)తో సమంగా నిలిచారు. తొలి రౌండ్ ఓటమితో టోర్నీని ప్రారంభించిన 18 ఏళ్ల గుకేష్, రెండో రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. మరో పది రౌండ్లు మిగిలున్న ఈ టోర్నమెంట్‌లో ఎవరైతే ముందుగా 7.5 పాయింట్లకు చేరతారో వాళ్లు విజేతగా నిలుస్తారు. శనివారం జరిగే ఐదో రౌండ్లో గుకేష్ తెల్లపావులతో తలపడనున్నాడు.



విరాట్‌ను దాటేశాడు

ఆర్జనలో పంత్‌దే అగ్రస్థానం

న్యూఢిల్లీ: ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర కలిగిన ఆటగాడిగా నిలిచిన రిషబ్ పంత్ మరో ఘనత కూడా దక్కించుకున్నాడు. భారత క్రికెట్‌లో వేతనం రూపంలో ఎక్కువగా ఆర్జించే ఆటగాడిగా విరాట్‌ను అధిగమించాడు. ఇప్పుడు పంత్ బీసీసీఐ నుంచి రూ.30 కోట్లు అందుకోబోతున్నాడు. ఎలాగంటే.. ఐపీఎల్ వేలంలో అతడిని లఖ్‌నవూ రూ.27 కోట్లకు తీసుకుంది. అలాగే బోర్డు కాంట్రాక్ట్‌లో గ్రేడ్ 'బి'లో ఉన్న పంత్‌కు రూ.3 కోట్ల వార్షిక వేతనం దక్కుతుంది. దీంతో మొత్తంగా అతడు రూ.30 కోట్లతో టాప్‌లో నిలిచాడు. అటు విరాట్‌ను ఆర్‌సీబీ రూ.21 కోట్లకు రిటైన్ చేసుకోగా.. గ్రేడ్ ఎ+లో ఉన్న అతడి వార్షిక వేతనం రూ.7 కోట్లుగా ఉంది. దీంతో తను రూ.28 కోట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. శ్రేయాస్ ఐపీఎల్ ధర రూ. 26.75 కోట్లుగా ఉన్నా తనకు బోర్డు కాంట్రాక్ట్ లేదు.

బ్రూక్ అజేయ శతకం

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 319/5

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ దీటుగా జవాబిస్తోంది. బ్రూక్ (132 బ్యాటింగ్) అజేయ శతకానికి తోడు పోప్ (77) అర్ధసెంచరీతో రాణించగా.. రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 319/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం కివీస్‌కన్నా 29 పరుగులు వెనుకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 348 పరుగులకు ఆలౌటైంది. కార్స్, బషీర్‌లకు నాలుగేసి వికెట్లు దక్కాయి.

మనోళ్ల దూకుడు



సెమీస్‌కు సింధు, ఉన్నతి, లక్ష్య, రజావత్,
డబుల్స్‌లో గాయత్రి, అశ్వని జోడీలు
సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: సొంతగడ్డపై జరుగుతున్న సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టైటిళ్లను క్లీన్‌స్వీప్ చేసే దిశగా దూసుకెళ్తున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో రెండుసార్లు చాంపియన్, టాప్‌సీడ్ పీవీ సింధు 21-15, 21-17తో చైనాకు చెందిన డాయి వాంగ్‌ను చిత్తు చేసింది. మరో భారత అమ్మాయి ఉన్నతి హుడా 21-16, 21-9తో ఇషికా జైస్వాల్ (అమెరికా)ను ఓడించి సెమీస్‌లో సింధుతో అమీతుమీకి సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్య సేన్ 21-8, 21-19తో సహచర షట్లర్ మీరాబా లువాంగ్ మైస్నమ్‌పై, రెండో సీడ్ ప్రియాన్షు రజావత్ 21-13, 21-8తో గుయెన్ హై డాంగ్ (హాంకాంగ్)పై గెలిచి సెమీస్‌లో ప్రవేశించారు. మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-8, 21-15తో ఆరో సీడ్, మలేసియా ద్వయం గో కీ/టో మి జింగ్‌పై, టాప్ సీడ్ అశ్విని పొన్నప్ప/తనీషా క్యాస్ట్రో జంట 21-12, 17-21, 21-16తో భారత్‌కే చెందిన శ్రుతి మిశ్రా/ప్రియపై గెలిచి సెమీస్ లోకి అడుగుపెట్టాయి. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన ఇషాన్ భట్నాగర్/శంకర్ ప్రసాద్ జోడీ 21-12, 30-29తో మూడో సీడ్, మలేసియా జంట ఆరోన్/కాంగ్ కై జింగ్‌పై, పృథ్వీ కృష్ణమూర్తి/సాయిప్రతీక్ ద్వయం 12-21, 21-11, 21-16తో మలేసియాకే చెందిన లిమ్ జి/వాంగ్ తిమ్ జోడీపై గెలిచి సెమీస్‌లో ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జంట, ఐదో సీడ్ తనీషా క్యాస్ట్రో/ధ్రువ్ కపిల 21-16, 21-13తో లూ బింగ్/హో లా (మలేసియా) జోడీని ఓడించి ఫైనల్‌కు అడుగుదూరంలో నిలిచింది.

గిల్ సిద్ధం

రోహిత్‌తో ప్రాక్టీస్
నేటినుంచి భారత్ వామప్ మ్యాచ్



కాన్‌బెర్రా: గాయంతో తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ రెండో టెస్టుకు అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే అతను తొలిసారిగా శుక్రవారం నెట్స్‌లో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రాక్టీస్ సాగించాడు. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ రోహిత్‌శర్మ కూడా సాధన చేశాడు. స్థానిక మనూకా ఓవల్ మైదానంలో భారత ఆటగాళ్లు కాసేపు నెట్స్‌లో గడిపారు. డిసెంబరు ఆరు నుంచి రెండో టెస్టు జరుగనుంది. అయితే దానికి ముందు శనివారం నుంచి ప్రైమ్ మినిస్టర్ లెవన్‌తో భారత్ రెండు రోజుల వామప్ మ్యాచ్ ఆడనుంది. ముందుగా రోహిత్ మైదానంలోకి రాగా ఆ తర్వాత యశస్వీ జైస్వాల్, కోహ్లీ వారికి జత కలిశారు. అటు గిల్ బొటన వేలి గాయం నుంచి పూర్తి స్థాయిలో కోలుకున్నట్టు కనిపించింది. పేసర్లు ప్రసిద్ధ్, యష్ దయాళ్, ఆకాశ్‌ల బంతులను గిల్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. అతడి ఫిట్‌నెస్‌పై సహాయక కోచ్ అభిషేక్ నాయర్ కూడా సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే బుమ్రా, సిరాజ్, హర్షిత్ మాత్రం ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నారు. మిగిలిన ఆటగాళ్లు గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడారు. మరోవైపు వర్షం కురవడంతో టీమిండియా సాధన ఎక్కువసేపు సాగలేదు.

రోహిత్ ఏ స్థానంలో..?

రెండో టెస్టులో రోహిత్‌శర్మతోపాటు శుభ్‌మన్ గిల్ కూడా ఆడడం దాదాపు ఖాయమైనందున బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్ఠంగా మారనుంది. వీరి రాకతో జట్టులో దేవ్‌దత్, జురెల్‌ల స్థానాలు గల్లంతైనట్టే. అయితే ఈ ఇద్దరినీ ఏ స్థానాల్లో ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. 'గిల్, రోహిత్ రాకతో మాకు సెలెక్షన్ డైలమా తప్పదు. ఇద్దరు టాప్ ప్లేయర్స్ జట్టులోకి తిరిగి వస్తే ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుంది' అని అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తెలిపాడు. అయితే రోహిత్ బ్యాటింగ్ ఆర్డర్‌పై అతడు పెదవి విప్పలేదు. అడిలైడ్ చేరుకున్నాక ఆ విషయం ఆలోచిస్తామని చెప్పాడు. అటు ఓపెనర్‌గా రాహుల్ మెరుగ్గానే ఆడడంతో పాటు తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో తొలి వికెట్‌కు 201 పరుగులు అందించాడు. దీంతో ఫామ్‌లో లేని రోహిత్‌ను మిడిలార్డర్‌లో ఆడించే అవకాశాలు లేకపోలేదని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

ఆంధ్ర జట్టు హ్యాట్రిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఆంధ్ర జట్టు హ్యాట్రిక్ విజయాన్ని సాధించి, గ్రూప్-ఈలో అగ్రస్థానానికి చేరుకుంది. మిడిలార్డర్ బ్యాటర్ అవినాష్ అర్ధశతకం (55)తో, బౌలర్లు శశికాంత్ (3/22), యశ్వంత్ (3/29)తో చెరో మూడు వికెట్లతో చెలరేగడంతో బలమైన మహారాష్ట్ర జట్టుకు ఆంధ్ర షాకిచ్చింది. శుక్రవారం సికింద్రాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. అనంతరం మహారాష్ట్ర 15.4 ఓవర్లలో 99 పరుగులకు ఆలౌటైంది.

ఉత్కంఠ పోరులో పుణె గెలుపు

నోయిడా: ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన పోరులో చివరి సెకన్లలో పుణెరి పల్టన్‌కు విజయం దక్కింది. శుక్రవారం ప్రో కబడ్డీ లీగ్‌లో జరిగిన ఈ రసవత్తర మ్యాచ్‌లో పుణె 34-33తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. పుణె కెప్టెన్ ఆకాష్ షిండే 12 పాయింట్లు సాధించి ఆ జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 42-30తో తమిళ తలైవాస్‌పై గెలిచింది.

ఓటమి దిశగా శ్రీలంక

రెండో ఇన్నింగ్స్ 103/5

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక ఓటమి దిశగా పయనిస్తోంది. 516 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఈ జట్టు మూడో రోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్‌లో 103 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. క్రీజులో చాందిమల్ (29 బ్యాటింగ్), ధనంజయ పరుగులేమీ చేయకుండా ఉన్నారు. జాన్సెన్, రబాడలకు రెండేసి వికెట్లు దక్కాయి. శ్రీలంక గెలవాలంటే ఇంకా 413 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు సఫారీ రెండో ఇన్నింగ్స్‌లో స్టబ్స్ (122), బవుమా (113) సెంచరీలు సాధించారు. దీంతో ఆతిథ్య జట్టు 366/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 45, దక్షిణాఫ్రికా 191 పరుగులు చేశాయి.



వంటిల్లు

శీతాకాలంలో వేడి వేడి చపాతీలతో రుచికరమైన కూరలు తింటుంటే ఆ తృప్తే వేరు. అందుకే ఈ సారి కొన్ని కూరలు మీకోసం అందిస్తున్నాం..

చపాతీలతో తింటే భలే రుచి

పనీర్ మిరియాల కూర

కావాల్సిన పదార్థాలు:

పనీర్- అరకిలో, మిరియాలు- నాలుగు స్పూనులు, తరిగిన ఉల్లిపాయలు- ఒక కప్పు, జీడిపప్పు- అరకప్పు, నూనె- అరకప్పు, నెయ్యి- నాలుగు స్పూనులు, పెరుగు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, లవంగాలు- నాలుగు, పచ్చి మిర్చి- ఒకటి, ఏలకులు- నాలుగు, పసుపు- ఒక స్పూను, కారం-ఒక స్పూను, తరిగిన కొత్తిమీర- నాలుగు స్పూనులు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, క్రీమ్- నాలుగు స్పూనులు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- పనీర్‌ను చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. మిరియాలను పొడి చేయాలి. ఈ రెండింటిని కలపాలి.
- ఒక గిన్నెలో పెరుగు, కారం, పసుపు, ఉప్పు వేసి ఎక్కడ ఉండలు లేకుండా కలపాలి. ఈ మిశ్రమంలో పనీర్ ముక్కలను వేసి 15 నిమిషాలు వదిలేయాలి.
- ఒక మూకుడులో పావు కప్పు నూనె వేసి పనీర్ ముక్కలను వేయించాలి. వాటిని కిందకు దించి చల్లార్చాలి.
- ఈ మూకుడులోనే మిగిలిన పావు కప్పు నూనెను వేడి చేసి- ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, లవంగాలు, పచ్చిమిర్చి, జీలకర్ర, పసుపు, కారం, జీడిపప్పు వేసి వేయించాలి. ఇవన్నీ చల్లారిన తర్వాత ఒక మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- మూకుడులో నెయ్యిని వేసి వేడి చేయాలి. దీనిలో ఈ ముద్దను వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. ఉప్పు వేయాలి. దానిలో వేయించిన పనీర్ ముక్కలను వేయాలి. పైన తరిగిన కొత్తిమీర చల్లాలి. క్రీమ్‌ను కలపాలి.

జాగ్రత్తలు

- పనీర్ ముక్కలను ఎక్కువ సేపు వేయించకూడదు. దోరగా వేగిన వెంటనే తీసేయాలి.
- తాజా క్రీమ్ దొరకకపోతే వెన్న కూడా వేసుకోవచ్చు.

చికెన్ జల్‌ఫ్రిజి

కావాల్సిన పదార్థాలు:

చికెన్- పావుకిలో, తరిగిన ఉల్లిపాయముక్కలు- ఒక కప్పు, తరిగిన టమాటాలు- ఒక కప్పు, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, మిరియాలు- ఒక చెంచా, పసుపు- ఒక చెంచా, ఎండు మిర్చి- నాలుగు, వెల్లుల్లి- నాలుగు రెబ్బలు, నూనె- కప్పు, గరం మసాలా- రెండు చెంచాలు, నిమ్మరసం- ఒక స్పూను, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ఒక మూకుడులో అరకప్పు నూనె వేసి ఉల్లిపాయముక్కలు, టమోటా ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి, వేసి వేయించాలి. ఇవి బాగా వేగిన తర్వాత కొద్దిగా నీళ్లు పోసి ఉడకనివ్వాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- మిక్సీలో ధనియాలు, జీలకర్ర, గరం మసాలా, మిరియాలు వేసి పొడి చేయాలి.
- చికెన్ ముక్కలను తీసుకొని- వాటిలో అర కప్పు నూనె, మిక్సీలో ఆడిన పొడిని వేసి బాగా కలపాలి. ఈ ముక్కలు ఒక గిన్నెలో లేదా ప్లాస్టిక్ బౌల్‌లో వేసి మూత బెట్టి ఒక గంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి.
- మూకుడులో మిగిలిన నూనె వేసి చికెన్ ముక్కలను వేయించాలి. దానిలో ముందుగా మిక్సీ చేసుకున్న ముద్దను కలపాలి. కొద్దిగా నీళ్లు, ఉప్పు కలిపి ఒక పదినిమిషాల పాటు ఉడకనివ్వాలి.



జాగ్రత్తలు

- చికెన్ ముక్కలను ఎంతసేపు ఫ్రిజ్‌లో ఉంచితే కూరకు అంత రుచి వస్తుంది. చికెన్ ముక్కలను ఎక్కువ వేయించకూడదు.

దమ్ ఆలూ

కావాల్సిన పదార్థాలు

చిన్న బంగాళదుంపలు- 250 గ్రాములు, నూనె- అర కప్పు, తరిగిన ఉల్లిపాయలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 చెంచాలు, జీలకర్ర- రెండు చెంచాలు, నల్ల మిరియాలు- ఒక చెంచా, కారం- రెండు చెంచాలు, పసుపు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, ఎలకులు- నాలుగు, లవంగాలు- నాలుగు దాల్చిన చెక్క- రుచికి తగినంత, జీడిపప్పు- నాలుగు స్పూన్లు, పెరుగు- ఒక కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, నీళ్లు- తగినన్ని, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ఒక మూకుడులో ఒక అరకప్పు నూనె వేసి వేడి చేయాలి. చిన్న బంగాళ దుంపల తొక్క తీసి వాటిని వేయించాలి. వాటిని చల్లార్చటానికి ఒక ప్లేటులో పెట్టుకోవాలి.
- మిగిలిన నూనెలో ఏలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, జీలకర్ర వేసి వేయించాలి. ఇవి వేగిన తర్వాత జీడిపప్పు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేగనివ్వాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో ముద్దగా చేయాలి.
- ఆ ముద్దను మిక్సీలో వేసి తగినన్ని నీళ్లు కలపాలి. దానిలో పసుపు, కారం, ధనియాల పొడి, పెరుగు వేసి మరింత సేపు ఉడికించాలి.
- ఈ మిశ్రమంలో వేయించి పెట్టుకున్న బంగాళ దుంపలను వేసి ఉడికించాలి. ముక్కలు మగ్గిన తర్వాత పైన కొత్తిమీర చల్లాలి.



జాగ్రత్తలు

- చిన్న బంగాళదుంపలు దొరకకపోతే మామూలు బంగాళదుంపలతో ఈ కూర చేసుకోవచ్చు. కానీ పెద్ద బంగాళ దుంపలను ముక్కలుగా చేసిన తర్వాతే నూనెలో వేయించాలి.
- పెరుగు వేసిన తర్వాత కూరను తిప్పుతూ ఉండాలి. దీనివల్ల పెరుగు విరిగిపోదు.

బియ్యపు జావలు అనేక రకాలు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనం బియ్యపు అన్నాన్ని ముద్దగా తింటాం. కానీ అలా కాకుండా జావ రూపంలో రకరకాలుగా కూడా స్వీకరించవచ్చు. వాస్తవానికి జావ అంటే అన్నం రసం. అన్నంలో ఉన్న సారమంతా దీనిలో ఉంటుంది. ఇలాంటి జావలు ఎన్ని రకాలో తెలుసుకుందాం.

బియ్యపు కడుగు: బియ్యాన్ని నీళ్లలో వేసి కడిగి తేర్చిన నీటిని బియ్యపు కడుగు అంటారు. ఈ కడుగులో దుమ్ము, బియ్యాన్ని అంటి ఉండే చిట్టు, తవుడు అన్నీ కొట్టుకు వస్తాయి. చేటతో చెరిగి బియ్యాన్ని శుభ్రపరచి కడిగితే ఆ కడుగులో చిట్టు, తవుడు మాత్రమే ఉంటాయి, దీన్ని 'ఆరనాళకము' అంటారు. ఈ నీటిని ఒక రాత్రంతా నిలవుంచితే పులుస్తుంది. ఈ పుల్లని ద్రవం తరవాణి లాంటిదే. బీరుతో సమానమైన గుణాలుంటాయి. దీన్ని 'కలి' అని కూడా అంటారు.

చిట్టుడుకు నీళ్లు: అన్నం వండటానికి బాగా పొంగులొచ్చేలా కాగబెట్టిన నీటిని ఎసరు అంటారు. కడిగి శుభ్రపరచిన బియ్యాన్ని ఎసట్లో వేసి ఉడికిస్తారు. బియ్యం ఉడుకుతూ ఉండగా చిన్న గ్లాసుతో అందులో నీళ్లను ఇవతలకు తీస్తే ఆ నీటిని చిట్టుడుకు నీళ్లు అంటారు. ఈ నీళ్లు తాగితే అమితమైన చలవ నిస్తాయి. బియ్యంలో సారవంతమైన బాగం చిట్టు తవుడే! ఇవి బియ్యపు పైపొరలు. మనం ప్రస్తుతం ఈ పొరలను తొలగించిన నిస్సారమైన బియ్యాన్ని అన్నం పేరుతో తింటున్నాం. దంపుడు బియ్యంతో అన్నం వండేప్పుడు తీసిని చిట్టుడుకు నీళ్లలో ఈ చిట్టు, తవుడు ఎక్కువగా ఉంటాయి.



గంజి: బియ్యానికి రెండు నుంచి మూడు రెట్లు నీళ్లు పోసి ఉడికించిన అన్నంలో అదనపు నీటిని వారుస్తారు. ఇది అన్నరసం. దీన్నే ఇంగ్లీషులో స్టార్చి అంటారు. దీనిని బట్టలు ఫెళఫెళలాడటానికి ఉపయోగిస్తారు. ఈ గంజినీళ్ళని కదలకుండా ఉంచితే దాని పైన తెట్టు కడుతుంది దీన్ని గంజి తొరక అని, మాసరం అనీ పిలుస్తారు. మెతుకు లేని గంజిని గొడ్డంబలి అంటారు. ఈ గంజిలో పిండిపదార్థాలు, కొంచెం కొవ్వు, విటమిన్లు కూడా ఉంటాయి. గంజి ద్వారా పిండి పదార్థాలు కొంత వరకు బయటకు పోతాయి. అందువల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు కుక్కర్లో వండిన అన్నం కన్నా గంజివార్చిన అన్నమే గొప్పది. గంజి వార్చకుండా వండిన అన్నాన్ని ఇగిరిక అంటారు. ఇందులో అసృతాన్నదోషం ఉంటుందని.. అందువల్ల వార్చిన అన్నాన్నే తినాలని పాకదర్పణం గ్రంథం పేర్కొంది..

జావ: బియ్యానికి ఆరు రెట్లు నీళ్లు పోసి పలుచగా కాచినది జావ. దీన్నే అంబలి, గటక అని కూడా పిలుస్తారు. ఆయుర్వేద గ్రంథాలు యవాగువు అన్నాయి. భోజన కుతూహలం గ్రంథం ఈ యవాగువు బలకరమైందని, సంతృప్తి నిస్తుందని, వాత దోషాన్ని పోగొడ్తుందని పేర్కొంది. దీన్నే 'మండం' అని కూడా పిలుస్తారు.

విలేపి: బియ్యానికి నాలుగు రెట్లు నీళ్లు పోసి కొంచెం చిక్కగా కాచినట్లైతే దాన్ని విలేపి అంటారు. ఇది ఎక్కువ బలకరమైనది. వేడిని తగ్గిస్తుంది. పురుషత్వాన్ని పెంచుతుంది.

పేయం: బియ్యంలో చాలా ఎక్కువ నీళ్లు పోసి పలుచగా కాచినట్లైతే దాన్ని పేయం అంటారు. బార్లీ, జొన్న, రాగి లాంటివాటితో పేయం (పారిజ్)తయారు చేసుకుని ఉదయం టిఫిన్లకు బదులుగా తీసుకుంటారు. దీన్ని పాలు పోసి కాస్తారు లేదా మజ్జిగ కలుపుకుని తాగుతారు. ఇది విరేచనాల్లో నీటి శాతాన్ని తగ్గిస్తుంది. తేలికగా అరుగుతుంది. కఫ దోషాన్ని పోగొడుతుంది.

- గంగరాజు అరుణాదేవి

మేకప్

మొటిమలను దాచేద్దాం

ముఖం మీద మొటిమలను దాచడానికి మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. లేదంటే మొటిమలు మరింత స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంది. మొటిమలను దాచే మేకప్ మెలకువలు ఇవే!

మాయిశ్చరైజర్: మేకప్ చర్మం మీద సమంగా అంటుకోవాలంటే, మొదట ముఖాన్ని శుభ్రంగా కడిగి, మాయిశ్చరైజర్ పూసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు మాయిశ్చరైజర్ వాడకూడదు.

ప్రైమర్: మేకప్‌కు ముందు అనుసరించవలసిన చిట్కా ఇది. మేకప్ ఉత్పత్తులు చర్మంలోకి ఇంకిపోకుండా ప్రైమర్ తోడ్పడుతుంది. హెచ్చుతగ్గులు లేకుండా మేకప్ చర్మం మీద పరుచుకోవడానికి వీలుగా, ప్రైమర్ చర్మాన్ని సిద్ధం చేస్తుంది.

కరెక్టర్: మొటిమలను కరెక్టర్‌తో కనిపించకుండా చేయవచ్చు. ఇందుకోసం ఎర్రగా ఉండే మొటిమల మీద ఆకుపచ్చని కరెక్టర్ అద్ది, పైన కన్‌సీలర్ అద్దుకోవాలి. ఇలా చేయడంవల్ల మొటిమ ఎరుపు రంగు తగ్గి, చర్మంలో కలిసిపోతుంది. మొటిమ ఎరుపు రంగులో లేకపోతే, నేరుగా కన్‌సీలర్‌నే అద్దవచ్చు. కన్‌సీలర్‌ను మొటిమ మీద అద్దాలే తప్ప, రుద్దకూడదు.

లిక్విడ్ ఫౌండేషన్: బ్రష్ లేదా మేకప్ స్పాంజ్‌తో ముఖం మీద ఫౌండేషన్‌ను వేసుకోవాలి. అంటే ముఖం మీద ఫౌండేషన్ చుక్కలుగా అద్ది, బ్రష్ లేదా స్పాంజ్‌తో ముఖాన్ని అద్దినట్టు చేస్తూ, ముఖమంతా పరుచుకునేలా చేయాలి.



మేపక్ సెట్టింగ్: ఫౌండేషన్ పూసుకున్న తర్వాత కొన్ని నిమిషాలు ఆగాలి. ఆ తర్వాత ప్రెస్‌డ్ లేదా లూజ్ పౌడర్‌ను అద్దుకోవాలి. తర్వాత ఫినిషింగ్ స్ప్రే కూడా వాడుకోవచ్చు.

మచ్చలను దాచాలంటే... : ఫేస్ ప్రైమర్‌తో మేకప్ మొదలుపెట్టాలి. తర్వాత ప్రైమర్, కన్‌సీలర్, అంతిమంగా ఫౌండేషన్, లూజ్ పౌడర్ వాడాలి. మచ్చలు నల్లగా లేదా ఎర్రగా ఉంటే, కలర్ కరెక్టర్‌ను వాడుకోవచ్చు.

సంస్కృతి

కళా వారసత్వానికి కొత్త ఊపిరి



అంతరించిపోతున్న జానపద సంగీతాన్ని సజీవంగా నిలిపే ప్రయత్నం చేస్తున్నారు ఆమె. భర్త గోవింద్‌సింగ్ భాటీతో కలిసి... యువ కళాకారులను ప్రోత్సహిస్తూ... ఘురాలియో వంటి రాజస్థాన్ సంస్కృతితో ముడిపడిన వాయిద్యాలను భావితరాలకు అందిస్తున్నారు. దాని కోసం 'లోక్ సంగీత్ శాల' నెలకొల్పి... నవతరం కళాకారులను తీర్చిదిద్దుతున్న షరాన్ జెనీవివ్ కథ ఇది.

"శత్రుదుర్భేద్యమైన కోటలు, కళ్లు తిప్పుకోనివ్వని సౌధాలకే కాదు... ఎన్నో అపురూప సంప్రదాయ, జానపద కళలకూ, కళాకారులకూ నిలయం మా రాజస్థాన్. కానీ క్రమంగా ఆ కళలు కనుమరుగైపోతున్నాయి. ముఖ్యంగా పలు వాయిద్యాలను వారసత్వంగా కొనసాగించేవారు కరువై... వాటి ఉనికిని కోల్పోతున్నాయి. ఇది మమ్మల్ని తీవ్రంగా కలవరానికి గురి చేసింది. మాది తమిళనాడే అయినా పెళ్లి తరువాత రాజస్థాన్‌తో విడదీయలేని అనుబంధం ఏర్పడింది. ముఖ్యంగా మావారు గోవింద్‌సింగ్ భటీది రాజస్థాన్ కావడంతో... చిన్నప్పటి జానపద సంగీతం వింటూ పెరిగారు. ఆయన తండ్రి, తాతగారు మోర్చాంగ్, సారంగి తదితర వాయిద్యాలు వాయించేవారు. ఎంతోమంది కళాకారులు ఇంటికి వచ్చి వెళుతుండేవారు. అలాంటి వాతావరణంలో పెరిగిన ఎవరికైనా సహజంగానే కళలపై అమితమైన ప్రేమ ఏర్పడుతుంది కదా. ఆ ప్రేమతోనే మావారు రాజస్థానీ జానపద కళాకారులను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నారు. వారి ప్రదర్శనలు ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు చూపించేందుకు ఎంతో కష్టపడ్డారు. దాని కోసం రాష్ట్రవ్యాప్తంగా 'మెహ్రాన్‌గఢ్ ట్రస్ట్, జైపూర్ విరాసత్ ఫౌండేషన్' తదితర ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశారు. అవి సత్ఫలితాలనిచ్చాయి. ఆ సంస్థల ఆధ్వర్యంలో జానపద కళాకారులు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు.

ఉపాధి మార్గం...

2008లో ప్రారంభమైన ఆయన ప్రయాణంలో తరువాత నేను కూడా భాగమయ్యాను. పద్నాలుగేళ్లుగా నేను కూడా సామాజిక సేవలో నిమగ్నమయ్యాను. మావారు ఎంచుకున్న మార్గం నాలో స్ఫూర్తి నింపింది. కళాకారుల కోసం ఆయన శ్రమించే తత్వం నన్ను ఆకట్టుకుంది. ఆయనతో కలిసి అడుగులు వేశాను. జానపద కళాకారుల అభ్యున్నతి కోసం, అరుదైన సంగీత వారసత్వాన్ని కొనసాగించడం కోసం మేమిద్దరం కలిసి 2014లో 'బ్లూ సిటీ వాల్స్' సంస్థను ప్రారంభించాం. కొందరు కళాకారుల సహకారంతో షోలు నిర్వహించాం. 'జోధ్‌పూర్ ఓల్డ్ సిటీ' పేరుతో పర్యటనలు ఏర్పాటు చేశాం. వీటన్నిటి నిర్వహణకు స్థానికంగా ఉన్న నిరుద్యోగులను నియమించడంవల్ల కళాకారులతో పాటు వారికీ ఉపాధి లభించింది.

యువతను ప్రోత్సహించేలా...

అయితే ఈ ప్రయాణంలో మాకు అర్థమైంది ఏమిటంటే... జానపద కళా వారసత్వాన్ని కొనసాగించాలంటే మా ప్రయత్నం సరిపోదని. మరింతమందికి చేయూత అందివ్వాలని. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని భావించాం. ప్రధానంగా పాత తరం కళాకారులు కాలం చేస్తుంటే... వారి వారసులు ఆ విద్యను అభ్యసించేందుకు ముందుకు రావడంలేదు. ఇది కలవర పెట్టే అంశం. దానికి ప్రధాన కారణం సంప్రదాయ కళలను నమ్ముకొంటే వారికి సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం. రెండోది... నేర్చుకోవాలనే ఉత్సాహం ఉన్నా ప్రోత్సాహం కరువవడం... తమ కళను ప్రదర్శించేందుకు సరైన వేదికంటూ లేకపోవడం. దీనంతటికి పరిష్కార మార్గంగా మా సంస్థ నిలబడాలనే లక్ష్యంతో అడుగులు వేశాం.



అద్భుత స్పందన...

యువ కళాకారులను తీర్చిదిద్దడం, వారికి మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు రాజస్థాన్ సంస్కృతిని నలుదిశలా విస్తరించే లక్ష్యంతో మా 'బ్లూ సిటీ వాల్స్' ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టాం. తొలి ప్రయత్నంలో భాగంగా ఎనిమిదిమంది యువ జానపద కళాకారులతో 'రైతిలా రాజస్థాన్' పేరుతో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశాం. 'మెహమాన్' అనే పాట రూపొందించాం. సంగీతం మావారే సమకూర్చారు. కళాకారులకు ఆరు నెలలపాటు మేమే శిక్షణ ఇచ్చాం. ఆ పాట 'నెట్‌ఫ్లిక్స్'లో బాగా ప్రాచుర్యం పొందిన 'మిస్ మ్యాచ్' షో రెండో సీజన్‌లో ప్రదర్శించారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. నెట్టింట్లో విపరీతంగా చక్కర్లు కొట్టింది. అన్నిటికీ మించి మా కళాకారులకు మంచి పేరు లభించింది.

ఆ ఆలోచన మారాలి...

మా తరువాతి ప్రాజెక్టులు కూడా విజయవంతమయ్యాయి. అయితే జానపద కళలు కలకాలం జీవించి ఉండాలంటే మా ఒక్కరి ప్రయత్నం సరిపోదు. ఇప్పటికీ చాలామందికి జానపద కళాకారులంటే చిన్న చూపు. ఎవరైనా ఈవెంట్ నిర్వాహకుల వద్దకు వెళ్లి 'ఇలా జానపదాలు ప్రదర్శిస్తాం' అని అడిగితే... వెంటనే పారితోషికం సగం తగ్గించి మాట్లాడతారు. ప్రభుత్వ కార్యక్రమాలకూ ఇదే పరిస్థితి. అదే ఏ సినీ గాయకులకో అయితే అడిగినంత ఇచ్చి తెచ్చుకొంటారు. ఈ ఆలోచన మారాలి. అలాంటివారందరికీ నేను ఒక్కటే చెబుతాను... జానపద కళారూపాలు, కళాకారులు దేనికీ తీసిపోరని. ఇది అర్థమయ్యేట్టు చెప్పేందుకు 'లోక్ సంగీత్ శాల' ప్రారంభించాం. దీని ద్వారా తరువాతి తరం కళాకారులను తయారు చేస్తున్నాం. వారసత్వ కళను ఒక వృత్తిగా చేపట్టేలా ప్రోత్సహిస్తున్నాం. అందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేసి, ఉపాధి మార్గాలు చూపి, ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం".

ఇలా చేస్తే నోటి దుర్వాసన మాయం

కొంతమందికి నోరు ఎప్పుడూ దుర్వాసన వస్తూ ఉంటుంది. పలు రకాల నోటి సమస్యలు, నోటిలో తేమ తగ్గడం, అనారోగ్య కారణాల వల్ల ఇలా జరుగుతూ ఉంటుంది. నోటి దుర్వాసనను తొలగించే కొన్ని మార్గాల గురించి తెలుసుకుందాం!

పళ్లు తోముకోవడం: దంతాల్లో రంధ్రాలు, పిప్పి పళ్లు ఏర్పడితే నోటిలో హానికర బ్యాక్టీరియాలు వృద్ధి పొందుతాయి. ఇవి కడుపులోకి చేరి పలు అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. వీటివల్ల నోరు దుర్వాసన వస్తుంది. ఉదయం లేవగానే మరల రాత్రి పడుకునేముందు తప్పనిసరిగా పళ్లు తోముకోవాలి. పళ్ల సందుల్లో ఆహార పదార్థాలు ఇరుక్కుంటే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

చిగుళ్లు భద్రం: నోరు పరిశుభ్రంగా లేకపోతే పంటి చిగుళ్లలో వాపు, పుండ్లు ఏర్పడుతుంటాయి. వీటివల్ల కూడా నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. రోజూ పళ్లతో పాటు చిగుళ్లను కూడా శుభ్రం చేసుకోవాలి. ఆలివ్ నూనె, ఇ విటమిన్ నూనె, ఆల్మండ్ నూనెల్లో ఒకదాన్ని తీసుకుని పంటి చిగుళ్ల మీద రాయాలి. తరవాత వేలితో గుండ్రంగా 5 నిమిషాలు రుద్దాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేయడం వల్ల చిగుళ్లు గట్టిపడతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది.



నాలుక శుభ్రం: నాలుక మీద ఆహారపదార్థాలు, నీరు ఒక పొరలా చేరతాయి. వీటి నుంచి కూడా దుర్వాసన వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే రోజుకు ఒక్కసారైనా నాలుకను శుభ్రం చేసుకోవాలి. దూది మీద గ్లిసరిన్ రెండు చుక్కలు వేసి దానితో నాలుక మీద మెల్లగా రుద్దుతూ శుభ్రం చేయాలి. తరవాత గోరువెచ్చని నీటితో నోటిని పుక్కిలించాలి. నాలుక ఎప్పుడూ లేత గులాబీ రంగులో కనిపిస్తూ ఉండాలి.

పుక్కిలింత: భోజనం చేసిన తరవాత నోటిని తప్పనిసరిగా నీళ్లతో పుక్కిలించాలి. నోటినిండా నీరు నింపి 30 సెకన్లు ఉంచుకొని విడవాలి. నోరు బాగా దుర్వాసన వస్తూ ఉంటే ఒక గ్లాసు నీళ్లలో అయిదు పుదీనా ఆకులు వేసి బాగా మరిగించి ఆ నీటితో అయిదుసార్లు నోటిని పుక్కిలించాలి. ఒక గ్లాసు నీళ్లలో మూడు చుక్కల యూకలిప్టస్ ఆయిల్ లేదా ఒక చెంచా తేనె లేదంటే రెండు చెంచాల నిమ్మరసం కలిపి ఆ నీటితో నోరు పుక్కిలించినా మంచి ఫలితం ఉంటుంది. రోజూ రాత్రి పడుకునేముందు ఉప్పు నీటితో నోటిని శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

నీళ్లు తాగాలి: తరచూ మంచి నీళ్లు తాగుతూ నోరు తడారిపోకుండా చూసుకోవాలి. దీనివల్ల నోటిలో సూక్ష్మక్రిములు పెరగకుండా ఉంటాయి. నోరు, నాలుక తేమగా ఉంటే వాటి నుంచి దుర్వాసన రాదు.

సోంపు నమలాలి: భోజనం చేసిన తరవాత ఒక చెంచా సోంపు గింజలు నమలడంవల్ల నోరు పరిశుభ్రమవుతుంది. జీర్ణక్రియ కూడా సజావుగా జరుగుతుంది. పచ్చి ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి లాంటి ఘాటైన వాసన వచ్చే ఆహారం తిన్నపుడు నోటి శుభ్రతకు జాగ్రత్తలు తీసుకోవాలి.

యాపిల్ తినాలి: రోజూ ఒక యాపిల్ తింటే అందులోని పాలిఫెనాల్స్ దంతాలను, నాలుకను శుభ్రం చేస్తాయి. నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. తులసి ఆకులు, పుదీనా ఆకులను తరచూ నమిలినా ప్రయోజనం ఉంటుంది.

ఇలా నడవండి...

నడక ఆరోగ్యానికి మంచిది. రోజుకి కనీసం పదివేల అడుగులు వేయాలని నిపుణులు చెబుతున్నారు. అయితే నడిచే విధానంలో కొన్ని పద్ధతులు ఉన్నాయి. శరీరాన్ని దృఢంగా ఉంచుతూ వివిధ ఆరోగ్య సమస్యలను నివారించే నడకల గురించి తెలుసుకుందాం.

వేగంగా: నడుస్తూ మాట్లాడగలిగే వేగాన్ని అనుసరించాలి. కానీ పాట పాడగలిగేంత తక్కువ వేగం కాదు. గంటకు నాలుగు మైళ్ల వేగంతో భుజాలను కదిలిస్తూ నడవాలి. ఇలా రోజుకు అర్ధ గంట చొప్పున వారానికి అయిదు రోజులు నడవడం వల్ల గుండెకు, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ బాగా అందుతుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం తప్పుతుంది. రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతాయి.

శక్తితో: మొదట సాధారణంగా నడక ప్రారంభించి క్రమంగా వేగం పెంచాలి. భుజాలు, చేతులను కూడా వేగంగా ముందుకు, వెనక్కు కదిలేలా చూసుకోవాలి. మధ్యలో విరామం తీసుకోవచ్చు. ఈవిధంగా నడవడానికి ఎక్కువగా శక్తి ఖర్చవుతుంది. గంటకు అయిదు మైళ్ల వేగంతో రోజుకు ఒక మైలు ఇలా నడిస్తే శరీరంలో పేరుకున్న అదనపు కొవ్వు కరిగిపోతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుంది.

ఎగుడు దిగుడు నేలపై: ఎత్తు పల్లాలు ఉన్న ప్రదేశాల్లో నడవడం వల్ల పాదాలు, మోకాళ్లలో కండరాలు ఉద్దీపనకు గురై బలంగా మారతాయి. కీళ్లు పట్టేయకుండా సులువుగా కదులుతాయి. శరీర భాగాలన్నీ సమన్వయంతో పనిచేస్తూ సమతాస్థితిలో ఉంటాయి. కాళ్లకు చెప్పులు వేసుకోకుండా రాళ్ల, ఇసుక ఉన్న నేలపై నడిస్తే పాదాలకు రక్తప్రసరణ అందుతుంది.



సన్నని కర్రలతో: ప్రత్యేకంగా రూపొందించిన సన్నని కర్రలను రెండు చేతులతో పట్టుకుని ముందుకు నడవాలి. దీనివల్ల వల్ల కాళ్లతోపాటు భుజాలు, చేతులు, మెడ కండరాలు బలోపేతమవుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగవుతుంది. ఊపిరి తీసుకోవడం, వదలడం ఒక క్రమ పద్ధతిలో జరగడం వల్ల గుండె కొట్టుకునే వేగం సాధారణంగా ఉంటుంది. కర్రలు చాలా సన్నగా తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలి. లేదంటే చేతి మణికట్టులో నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది.

విరామంతో: నడక వేగాన్ని ఒక నిర్ణీత సమయానుసారం మారుస్తూ నడవడం వల్ల శరీరం జీవక్రియలను సక్రమంగా నిర్వహిస్తుంది. మొదట ఒక నిమిషం వేగంగా నడిచి తరవాత రెండు నిమిషాలు సాధారణంగా నడవాలి. ఇలా నడక వేగాన్ని మారుస్తూ ఉంటే ఓర్పు. సహనం, ఏకాగ్రత అలవడుతాయి.

అన్నీ లోపాలే.. అయినా ఎంత ప్రేమో!

ద్వారంపూడి లంపకలోవ రొయ్యల ఫ్యాక్టరీపై చర్యలేవీ?


లంపకలోవలో ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ

- అందులో భారీగా ఉల్లంఘనలు
- వ్యర్థ జలాలు శుద్ధి చేయకుండా బయటకు
- గ్రీన్‌బెల్ట్ నిర్వహణ లేనేలేదు
- 3 నెలలు గడువిచ్చినా సరిదిద్దని వైనం
- 21న చేసిన తనిఖీల్లో గుర్తింపు
- వారం గడచినా చర్యలు తీసుకోకుండా కాలుష్య మండలి మీనమేషాలు
- రెండో అవకాశమివ్వాలని నిర్ణయం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన రెండో రొయ్యలశుద్ధి కంపెనీలో భారీ ఉల్లంఘనలు బయటపడ్డాయి. ప్రత్తిపాడు మండలం లంపకలోవలో నిర్వహిస్తున్న ఫ్యాక్టరీలో అడుగడుగునా కాలుష్య నిబంధనలు అతిక్రమిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గుర్తించింది. వీటిని సరిదిద్దుకునేందుకు మూడు నెలలు గడువిచ్చినా అతీగతీ లేదు. అయినా సీజ్ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఆ ఫ్యాక్టరీపై అవ్యాజ ప్రేమ చూపుతున్నారు. లోపాలను సరిదిద్దడానికి మళ్లీ రెండో అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. కొందరు పీసీబీ అధికారులు తెరవెనుక సహకరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కడ మూసేసినా..

జగన్‌కు అత్యంత సన్నిహితుడైన ద్వారంపూడికి కాకినాడ జిల్లాలో రెండు చోట్ల వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ పేరుతో రొయ్యల కంపెనీలున్నాయి. వీటిలో ఒకటి కాకినాడ సమీపంలోని కరప మండలం గురజనాపల్లిలో ఉంది. దీనిలో భారీగా కాలుష్య నిబంధనలను ఉల్లంఘించారని తేలడంతో ఇటీవల దానిని పీసీబీ సీజ్ చేసింది. ప్రత్తిపాడు మండలం లంపకలోవలోని మరో కంపెనీలోనూ భారీ కాలుష్య ఉల్లంఘనలను అధికారులు జూలై 11న గుర్తించారు. కంపెనీ రియల్‌టైం పొల్యూషన్ తెలిపే ఆర్‌టీపీఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండా వ్యర్థజలాలను నేరుగా బయట పంట కాలువల్లోకి వదిలేస్తోంది. ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ) లాగ్‌బుక్‌ను జూలైలో తనిఖీ చేయగా కంపెనీ రోజుకు వాడాల్సిన 2,059 యూనిట్ల విద్యుత్‌లో 200 నుంచి 400 యూనిట్ల వరకు తేడాగా ఉందని, దీనికి కారణం ఈటీపీ వ్యవస్థను వాడకపోవడమేనని తేల్చారు. లోపల 20టీపీడీ సామర్థ్యంతో కూడిన ఐస్‌ప్లాంట్‌ను అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వ్యర్థజలాలను బయటకు విడుదల చేసే పైపులైన్ పలుచోట్ల దెబ్బతింది. కంపెనీ విడుదల చేస్తున్న ఏడు రకాల వ్యర్థజలాలను పరిశీలించగా.. పీసీబీ ప్రమాణాలకు లోబడి శుద్ధి చేయడం లేదని తేలింది. రొయ్యల శుద్ధిలో భాగంగా వచ్చే వ్యర్థాలను డిస్పోజ్ కంపెనీకి ఇవ్వాల్సి ఉండగా చాలా తక్కువ అప్పగించారని, మిగిలినదాన్ని అనధికారికంగా బయటకు పంపేస్తున్నారని వెల్లడైంది. ఈ లోపాలపై వివరణ కోరుతూ ఆగస్టు 8న నోటీసు జారీచేశారు. వీటికి కంపెనీ బదులిస్తూ.. రియల్‌టైం పొల్యూషన్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌టీపీఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చి.. త్వరలో పీసీబీ సర్వర్‌కు కనెక్ట్ చేస్తామని.. ఇందుకు నవంబరు వరకు గడువివ్వాలని కోరింది. సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకూ మూడు నెలల వ్యవధి అడిగింది. వ్యర్థ జలాలను మూడురోజులపాటు నిల్వ చేసేలా స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తామన్నారు. నవంబరు నెల ముగుస్తున్నా... వీటిలో ఏ ఒక్కటీ కంపెనీ సరిద్దిలేదు. ఈనెల 21న పీసీబీ కమిటీ ఫ్యాక్టరీకి వచ్చి ఈ విషయాన్ని నిర్ధారించుకుంది. గడువులోగా లోపాలను సరిదిద్దని నేపథ్యంలో ప్లాంట్‌ను సీజ్ చేస్తూ పీసీబీ అధికారులు ఆదేశాలు జారీ చేయాలి. కానీ దీనికి విరుద్ధంగా మళ్లీ గడువివ్వడంపై విస్మయం వ్యక్తమవుతోంది. గురజనాపల్లి ప్లాంట్‌ను ఇదే కారణాలతో సీజ్ చేసిన అధికారులు.. దానికంటే పెద్దదైన లంపకలోవ ఫ్యాక్టరీ విషయంలో మౌనం దాల్చడం చూస్తే తెరవెనుక ఏదో జరిగిందన్న అనుమానాలు కలుగుతున్నాయి.

ప్రజలు అత్యంత ఎక్కువగా ఇబ్బందులు, బాధలు పడేది రెవెన్యూ శాఖ చర్యలతోనే. వారిని తమ చుట్టూ తిప్పించుకోవడం, వేధించడం కొందరు రెవెన్యూ అధికారులకు అలవాటుగా మారింది. భూముల రికార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి ప్రజలు మీ చుట్టూ ఎందుకు తిరగాలి? ఇంకా మీపైనే ఆధారపడాలా?

తప్పుడు అధికారులు చట్టాల నుంచి తప్పించుకోలేనంతగా వారిపై సివిల్, క్రిమినల్ కేసులు పెట్టండి. సర్వీసు రూల్స్ ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపండి. తప్పుడు దారిలో నడిచి ప్రభుత్వానికి, ప్రజలకు తీవ్రనష్టం కలిగించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదు.

\- సీఎం చంద్రబాబు

ఇన్ని లక్షల ఎకరాలా.. సీఎం విస్మయం

సీసీఎల్‌ఏ నివేదిక ప్రకారం.. జగన్ జమానాలో 13,59,805 ఎకరాల అసైన్డ్, చుక్కల, ఇనాం, షరతుగల పట్టా భూములను నిషేధ భూముల జాబితా 22ఏ నుంచి డీ-నోటిఫై చేశారు. కూటమి ప్రభుత్వం ఆ భూముల రికార్డులను డిప్యూటీ కలెక్టర్ల బృందాలతో పునఃపరిశీలన చేయిస్తోంది. ఇప్పటి వరకు 13,48,254 ఎకరాల భూముల రికార్డుల పరిశీలన జరిగింది. ఇంకా 11,551 ఎకరాల రికార్డుల పరిశీలించాల్సి ఉంది. అసైన్డ్ భూముల (బదిలీ నిషేధం-పీవోటీ) చట్టం, జీవో 596, ఇనాం చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా 22ఏ జాబితా నుంచి డీ-నోటిఫై చేసిన భూమి 4,21,433.97 ఎకరాలుగా తేల్చారు. ఈ గణాంకాలను చూసి ముఖ్యమంత్రి నివ్వెరపోయినట్లు తెలిసింది. 'ఇన్ని లక్షల ఎకరాలను అక్రమంగా డీ-నోటిఫై చేశారా? ఎంత దారుణం' అని ఆయన విస్మయం వ్యక్తం చేసినట్లు సమాచారం.

జగన్ జమానాలో ఫ్రీహోల్డ్ అయిన భూములు.. (ఎకరాల్లో)

అసైన్డ్	9,93,285
చుక్కల భూములు	1,94,232
ఇనాం	1,38,846
షరతుగల పట్టా భూమి	33,442
మొత్తం	13,59,805

(ఇందులో అక్రమంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన భూమి 4,21,433.97 ఎకరాలు కాగా.. రిజిస్ట్రేషన్ అయిన భూములు 25,284.89 ఎకరాలు. అక్రమంగా రిజిస్ట్రేషన్ అయినవి 7,827.82 ఎకరాలుగా సీసీఎల్‌ఏ నివేదించింది)

'భూ'చోళ్ల భరతం పడదాం!

(మొదటి పేజీ తరువాయి)

కీలక భాగస్వాములుగా మారిన అధికారులపై పక్కా ఆధారాలతో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. అక్రమార్కులు ఎంతటివారైనా వదిలిపెట్టకూడదని, ప్రభుత్వ భూములను దోచిపెట్టినందుకు బాధ్యులైన వారు ఎట్టిపరిస్థితుల్లో తప్పించుకోకుండా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రిమినల్ కేసు పెట్టినట్లుగా ఉండకూడదని, ఫిర్యాదును చూడగానే అభియోగాలు ఎదుర్కొనే అధికారి ఎంతటి చట్టఉల్లంఘనలకు పాల్పడ్డారో తెలిసేలా స్పష్టమైన ఆధారాలు జతచేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియా, సీసీఎల్‌ఏ జయలక్ష్మి, అదనపు సీసీఎల్‌ఏ ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అసైన్డ్, చుక్కల, షరతుగల పట్టా భూముల ఫ్రీహోల్డ్‌పై సీఎం చర్చించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో గత ఆరు నెలలుగా జరుగుతున్న భూ రికార్డుల పునఃపరిశీలన (రీవెరిఫికేషన్) నివేదికను సీసీఎల్‌ఏ ముఖ్యమంత్రికి అందించారు.నివేదిక ప్రకారం.. పలువురు రెవెన్యూ అధికారులు ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1977(పీఓటీ యాక్ట్), ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ చట్టం-1908తోపాటు పలు రెవెన్యూ చట్టాలను ఉల్లంఘించి విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టినట్లు తేలింది. ఫైళ్ల పునఃపరిశీలనలో అక్రమార్కులకు పాల్పడిందెవరో కూడా తేలింది. అలాంటివారిపై.. పీవోటీ చట్టం, రిజిస్ట్రేషన్ చట్ట ఉల్లంఘనలు, సర్వీసు రూల్స్ అతిక్రమణ, అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వానికి నష్టం కలిగించడం, తప్పుడు నివేదికలు ఇవ్వడం, తప్పుడు రిపోర్టులు సృష్టించడం, ఫోర్జరీకి పాల్పడడం, ఫైళ్లను తారుమారు చేయడం వంటి అభియోగాలతో క్రిమినల్ కేసులు పెట్టాలని రెవెన్యూశాఖ ప్రాథమికంగా ప్రతిపాదించింది. ఇందుకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తప్పు చేసిన అధికారి ఏ స్థాయిలో ఉన్నా చర్యలు తప్పవన్నారు. 'గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన వారు ఎంజాయ్‌చేశారు. మాకేం కాదులే అన్న ధీమా ప్రదర్శించారు. ఇప్పుడు చట్టం తన పని తాను చేయాలి. అక్రమార్కులను వదిలిపెట్టకూడదు" అని సీఎం దిశానిర్దేశం చేశారు. భూముల గోల్‌మాల్, ధ్రువీకరణ పత్రాల జారీ, అవినీతి కేసుల ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన రెవెన్యూ శాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. తాను రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు శాఖ తీరే మారడం లేదన్నారు. ఒక్కసారి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశాక.. ఆ సర్టిఫికెట్ డేటానే అవసరం ఉన్న ప్రభుత్వ శాఖలు ఉపయోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

డిసెంబరులో రెవెన్యూ సదస్సులు..

రెవెన్యూ సదస్సులను డిసెంబరులో నిర్వహించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే విన్నపాలను, వాటి పరిష్కారానికి అధికారులిచ్చే ఆదేశాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. ఆ విన్నపాల పరిష్కారంపై థర్డ్‌పార్టీ సంస్థతో ప్రత్యేక ఆడిటింగ్ నిర్వహించాలన్నారు. దీనివల్ల ప్రజా సమస్యల పరిష్కారం నిజంగా జరిగిందా.. లేదా? ఒక వేళ జరిగితే ప్రజలకు మేలు జరిగిందో లేదో నిర్ధారణ జరగాలని తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు.

అసైన్డ్‌గా చూపి మరీ డీ-నోటిఫై 1,665 ఎకరాలు కొట్టేసిన వైనం

జగన్ పాలనలో ప్రభుత్వ భూముల పరాధీనానికి పరాకాష్ఠ ఇది. అసైన్‌మెంట్ చేయకుండానే రికార్డులు సృష్టించి, ఆ భూములను అసైన్డ్‌గా చూపి వాటిని 22ఏ నుంచి డీ-నోటిఫై చేశారు. ఈ కేటగిరీలో ఏకంగా 1,665.80 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు కొట్టేశారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సంపూర్ణంగా సహకరించారు. చెరువుశిఖం, కాలువ పోరంబోకు, ప్రభుత్వ భూమి, అసైన్‌మెంట్ పరిధిలో లేని మరో 6,500 ఎకరాలను కూడా అసైన్‌మెంట్ కింద చూపించి 22ఏ నుంచి అక్రమంగా డీ-నోటిఫై చేయించారు. రికార్డుల పునఃపరిశీలన తర్వాత భూముల అక్రమాలకు సంబంధించి తొలి పది స్థానాల్లో ఉన్న 10 మండలాలను రెవెన్యూ శాఖ ఎంపిక చేసింది. ఇవి శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్నాయి. ప్రభుత్వ భూములను అక్రమంగా, చట్టవిరుద్ధంగా పరుల పాల్జేసిన రెవెన్యూ అధికారులపై అసైన్డ్, ఇనాం, రిజిస్ట్రేషన్ చట్టాల ఉల్లంఘన కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారిపై సీసీ రూల్స్ ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. తొలుత భూముల అక్రమాలు జరిగిన టాప్-10 మండలాలు, డివిజన్ల పరిధిలోని అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్డ్ భూములను అక్రమంగా డీ-నోటిఫై చేసినందుకు, భూములను పరాధీనం చేసినందుకు పీవోటీ చట్టంలోని సెక్షన్ల ఆధారంగా కేసులు పెట్టనున్నారు. రిజిస్ట్రేషన్ చట్టంలోని 22(ఏ) ఉల్లంఘనకు పాల్పడినందుకు కూడా కేసులు పెడతారు. వేల ఎకరాల భూములను అక్రమంగా డీ-నోటిఫై చేయడంతోపాటు రిజిస్ట్రేషన్ చేసినందుకు సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లపైనా కేసులు పెట్టనున్నారు. ఇందుకు తొలుత రెండు కేటగిరీల్లో టాప్ 10 మండలాల జాబితానే ప్రామాణికంగా తీసుకోనున్నారు.

భూ అక్రమాలు జరిగిన పది మండలాలు..(ఎకరాల్లో)

జిల్లా	మండలం	ఫ్రీహోల్డ్ భూమి	అక్రమంగా తొలగించిన భూమి
శ్రీసత్యసాయి	ముదిగుబ్బ	14,509.88	13,538.48
శ్రీసత్యసాయి	అమరాపురం	18,281.76	10,781.27
శ్రీసత్యసాయి	రామగిరి	19,877.20	10,410.83
చిత్తూరు	వి.కోట	12,226.51	9,243.48
చిత్తూరు	కుప్పం	8,674.10	8,399.50
శ్రీసత్యసాయి	కనగానపల్లి	14,039.31	8,300.00
శ్రీసత్యసాయి	సోమందేపల్లి	10,582.38	7,785.90
అన్నమయ్య	గుర్రంకొండ	11,774.23	7,740.97
శ్రీసత్యసాయి	పెనుకొండ	16,205.06	7,501.68
చిత్తూరు	బంగారుపాళ్యం	8,042.01	7,197.81

అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగిన టాప్-10 మండలాలు..

పెనుకొండ (శ్రీసత్యసాయి జిల్లా), నందలూరు (అన్నమయ్య జిల్లా), వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా), ధర్మవరం (శ్రీసత్యసాయి), వీరబల్లి (అన్నమయ్య), సోమందేపల్లి (శ్రీసత్యసాయి), యేర్పేడు (చిత్తూరు), దోర్నాల (ప్రకాశం), రొద్దం (అనంతపురం), రామాపురం (అన్నమయ్య).

7న మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్

- తల్లిదండ్రులతోపాటు రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలి: మంత్రి లోకేశ్ లేఖ



అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో డిసెంబరు 7న జరిగే మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. పండుగ వాతావరణంలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులకు శుక్రవారం లేఖ రాశారు. పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల వికాసానికి, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశాలు దిక్సూచిగా మారుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఓ ఆత్మీయ వారధిని నిర్మిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. "ఎడ్యుకేట్, ఎంగేజ్, ఎంపవర్ లక్ష్యాలతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రమంతా ఒకేరోజున తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిస్తున్నాం. వార్డు సభ్యుల నుంచి ఎంపీ వరకు, సర్పంచ్ నుంచి సీఎం వరకు ప్రజాప్రతినిధులంతా రాజకీయాలకు అతీతంగా వారి గ్రామాల్లోని పాఠశాలల్లో జరిగే సమావేశాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నా. పిల్లల సమస్యలు, అభ్యసనా సామర్థ్యాలు, క్రీడలు- కళల పట్ల ఆసక్తులను టీచర్ల ముందుంచి మరింత పరిణతి సాధించేలా ప్రోత్సహించవచ్చు. విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచడం, పిల్లలు వారి తల్లిదండ్రులను బడులకు దగ్గర చేయడం మన ప్రభుత్వ లక్ష్యం. పేరెంట్- టీచర్స్ సమావేశాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందినవారైనా వారి పార్టీ జెండాలు, కండువాలు లేకుండా పాల్గొనాలని కోరుతున్నా. పాఠశాలల అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన దాతలు, పాఠశాలల అభివృద్ధికి దోహదపడే పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇందులో భాగం కావాలని విజ్ఞప్తి చేస్తున్నా" అని లేఖలో పేర్కొన్నారు.

విశాఖ డెయిరీపై సభా సంఘం చైర్మన్‌గా జ్యోతుల

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలపై విచారణకు సభా సంఘం ఏర్పాటైంది. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుక్రవారం దీని కూర్పును ప్రకటించారు. సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దీనికి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. బొండా ఉమా మహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, దాట్ల సుబ్బరాజు ఇందులో సభ్యులుగా వ్యవహరిస్తారు. అసెంబ్లీలో విశాఖ డెయిరీ వ్యవహారాలపై చర్చ తర్వాత ఆర్థిక అక్రమాలపై విచారణకు ప్రత్యేక సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఈ నెల 20న నిర్ణయం తీసుకున్నారు. దాని ప్రకారం ఈ కమిటీ ఏర్పడింది.

రహదారిపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ చైర్మన్‌గా ఆర్‌అండ్‌బీ మంత్రి

రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులకు ఎదురవుతున్న అడ్డంకులు, సవాళ్లను సత్వరమే అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. రోడ్లు భవనాల శాఖ మంత్రి చైర్మన్‌గా ఉండే ఈ టాస్క్‌ఫోర్స్‌లో 12 మంది అధికారులు సభ్యులుగా ఉంటారు.

జస్టిస్ దేవీందర్ గుప్తాకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల అవిభాజ్య హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవీందర్ గుప్తాకు శుక్రవారం హైకోర్టు ఘన నివాళి అర్పించింది. ఇటీవల మరణించిన ఆయనకు నివాళి అర్పించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఇతర న్యాయమూర్తులు మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం.. జస్టిస్ దేవీందర్ అందించిన న్యాయసేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన పలు కీలక తీర్పులు ఇచ్చారని వారు కొనియాడారు. జస్టిస్ దేవీందర్ గుప్తా ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, ప్రభుత్వ న్యాయవాదులు, రిజిస్ట్రార్లు, కోర్టు ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రికి 20 ఎకరాలు

మరిన్ని సంస్థలకూ భూ కేటాయింపులు



- కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం
- డిసెంబరు చివరికి భూ కేటాయింపులన్నీ పూర్తి!


వివరాలు వెల్లడిస్తున్న మంత్రులు నారాయణ, కొల్లు

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై వేసిన కేబినెట్ సబ్ కమిటీ సచివాలయంలో శుక్రవారం సమావేశమైంది. మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, అధికారులు నేరుగా హాజరవగా.. మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, దుర్గేష్, సంధ్యారాణి జూమ్ ద్వారా పాల్గొన్నారు. అమరావతిలో భారీ స్థాయిలో నిర్మించే ఈఎస్ఐ ఆసుపత్రి, మెడికల్ కాలేజీకి 20 ఎకరాలు కేటాయిస్తూ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అలాగే సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్స్ అండ్ డిజైన్‌కు 5 ఎకరాలు, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీకి 0.8 ఎకరాలు, బసవతారం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు 15 ఎకరాలు, ఎల్‌అండ్‌టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు 5 ఎకరాలు, బ్రహ్మకుమారీ ఎడ్యుకేషన్ సొసైటీకి 10 ఎకరాలు కేటాయించింది. ఇక టీటీడీకి గతంలో కేటాయించిన 25 ఎకరాలకు పూర్తి అంగీకారం తెలిపింది. సమావేశం అనంతరం కొల్లు రవీంద్రతో కలసి మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ మూడు ముక్కలాటతో రాజధానిలో కార్యాలయాల ఏర్పాటుకు సంస్థలు ముందుకు రాలేదని మండిపడ్డారు. 2019కి ముందు 131 సంస్థలకు భూములు కేటాయించామన్నారు. వాటికి కాల పరిమితి ముగియడంతో తిరిగి వారి నుంచి రాతపూర్వకంగా అంగీకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో భూములు పొందిన సంస్థలకు పూర్తి అంగీకారం తెలుపుతూ ఉప సంఘం నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో ఇచ్చిన వారికి అప్పటి ధరలకే భూములు ఇస్తున్నామన్నారు. దీంతో పాటు ఆయా సంస్థలకు ఇతర రాష్ట్రాల్లో ఎంత భూమి కేటాయించారు.. ప్రస్తుతం ఎంత అవసరం అనే దానిపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొత్తగా భూ కేటాయింపులు చేసే సంస్థలకు ధరల అంశంలో ఓ పాలసీ తయారు చేస్తామన్నారు. అన్ని సంస్థలకు వచ్చే నెలాఖరులోగా భూ కేటాయింపులు పూర్తవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు.

త్వరలో పాత టెండర్లు రద్దు

జనవరి నుంచి రాజధానిలో నిర్మాణ పనులు మొదలవుతాయని నారాయణ చెప్పారు. ఈ డిసెంబరు నెలాఖరుకల్లా 360 కిమీ ట్రంక్ రోడ్లు, మిగతా టవర్ల నిర్మాణాలకు టెండర్లు పూర్తవుతాయన్నారు. గతంలో పనులు నిలిచిపోయిన వాటికి సంబంధించి టెండర్ ఒప్పందాలు రెండు మూడు రోజుల్లో రద్దు చేసి.. ఆ వెంటనే కొత్తగా టెండర్లు పిలుస్తామని తెలిపారు. జగన్ రాజధానిపై గందరగోళం సృష్టించడంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని కొల్లు రవీంద్ర విమర్శించారు.

తుంగభద్ర బోర్డు ఖాతా ఫ్రీజ్ సడలింపు

- జీతాలు, పరిపాలన ఖర్చుల నిధుల డ్రాకు చాన్స్
- కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులపై కొనసాగుతున్న ఫ్రీజ్
- 'ఆంధ్రజ్యోతి' కథనాల ఎఫెక్ట్



కర్నూలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అకౌంట్ ఫ్రీజ్‌ను తొలగిస్తూ ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 3 నెలలుగా జీతాలందక ఇబ్బందులు పడుతున్న బోర్డు ఉద్యోగులు, వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం బోర్డు అకౌంట్ ఫ్రీజ్ చేయడం వల్ల జీతాలు అందక ఉద్యోగులు, కార్మికులు పడుతున్న ఆర్థిక అవస్థలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. ఈ నెల 22న జరిగిన టీబీపీ బోర్డు సమావేశంలో కూడా చర్చించారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు, పరిపాలన ఖర్చులకు నిధులు డ్రా చేసుకోవడానికి సడలింపు ఇచ్చారు. అయితే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు చేయవద్దని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర కాలువ ఆధునికీకరణ పేరిట రూ.919 కోట్లకు టెండర్లు పిలిచారు. తొలి దశలో రూ.519.80 కోట్లతో ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేశారు. రూ.350 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాలి. రెండో దశలో రూ.400 కోట్లకు కాంట్రాక్టర్లతో ఒప్పందం కూడా చేసుకున్నారు. ఈ పనుల్లో బళ్లారిలో స్థిరపడిన ఓ బడా కాంట్రాక్టర్ పెత్తనం చేశారు. వైసీపీ హయాంలో బోర్డులో పనిచేసిన ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, అప్పటి ఈఎన్‌సీ అండతో ఆ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా రెచ్చిపోయారనే ఆరోపణలు ఉన్నాయి.

మాజీ మంత్రి ఫిర్యాదుతో..

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.115 కోట్లు తుంగభద్ర బోర్డుకు కేటాయించారు. నిధులు రాగానే వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్‌కు మెజార్టీ బిల్లులు చెల్లించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అదే క్రమంలో టీబీపీ బోర్డు పరిధిలో జరిగిన కాలువల మరమ్మతులు, ఆధునికీకరణ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిని నిగ్గు తేల్చాలని రాయదుర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ వెంటనే బోర్డు ఖాతాను ఫ్రీజ్ చేసింది. దీంతో 250 మందికి పైగా ఇంజనీర్లు, వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులు, సిబ్బంది సెప్టెంబరు నుంచి జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంపై వారంతా టీబీ బోర్డు వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి టీకే గోపాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

రోత పత్రిక విషపు రాతలు

45.72 మీటర్ల ఎత్తులో పోలవరం కట్టి తీరుతాం

అబద్ధాలకు జగన్ పేటెంట్.. అవినీతిలో అనకొండ: నిమ్మల



అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్ అవినీతి, అసత్యాలతో పుట్టిన రోత పత్రిక పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంపై నిత్యం విషం కుమ్మరిస్తోందని, అడ్డగోలు రాతలు రాస్తోందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించి తీరతామని స్పష్టం చేశారు. శుక్రవారమిక్కడ అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019-24 నడుమ జగన్ విధ్వంసానికి బలైన ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతుంటే.. తట్టుకోలేక జగన్ పత్రిక విషపు రాతలు రాస్తోందన్నారు. విషబీజాలు నాటుతోందని ధ్వజమెత్తారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టు ఫేజ్-1, 2 అని గానీ, ఎత్తు 41.15 మీటర్లు అని గానీ డిజైన్లలో, అంచనాల్లో, రికార్డుల్లో ఎక్కడైనా చెప్పినట్లు ఒక్క సాక్ష్యం చూపించాలని శాసనమండలిలో వైసీపీ సభ్యులకు సవాళ్లు విసితే వారి నుంచి స్పందన లేదని చెప్పారు. 'ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలసంఘం, సాంకేతిక సలహా మండలి (టీఏసీ) రికార్డులున్నాయి. 2019 ఫిబ్రవరి 18న టీఏసీ ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.55,548 కోట్లకు ఆమోదించింది. దీని ఆధారంగా 2021లో జగన్ పాలనలో కుడికాలువ, ఎడమకాలువ నీటి సామర్థ్యం తగ్గించి, తద్వారా రూ.47,617 కోట్ల సవరణ అంచనాకు సాంకేతిక కమిటీ ఆమోదముద్ర వేసింది. ప్రాజెక్టు చరిత్రలో చెన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి దగ్గర నుంచి చంద్రబాబు వరకు ఎక్కడా ఫేజ్-1, 2.. ఎత్తు 41.15 మీటర్లు అని లేదు. ఇదే విషయాన్ని సమాచార హక్కు చట్టం కింద పలువురి ప్రశ్నలకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. ఇది వైసీపీ నేతలకు, మొసలి కన్నీరు కారుస్తున్న మాజీ ఇరిగేషన్ మంత్రులకు చెంపదెబ్బ. 2021లో 41.15 మీటర్ల ఎత్తు అనే దానికి బీజం వేసింది జగనే. ప్రధాన డ్యాంలో 45.72 మీటర్లు కాకుండా 41.15 మీటర్ల ఎత్తునే నీటి నిల్వను పరిమితం చేయాలని నాడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపిందని పీపీఏ వివరణ ఇచ్చింది. అయినా 100 సార్లు అబద్ధం చెప్పి.. దానిని నిజం చేయాలని జగన్ అండ్ కో చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు గమనించాలి' అని కోరారు. అబద్ధాలకు జగన్ పేటెంట్ అని, అవినీతిలో అనకొండ అని విమర్శించారు. అదానీతో విద్యుత్ ఒప్పందాల అవినీతి కేసులో తన పేరు లేదంటూ జగన్ లాజిక్‌గా మాట్లాడుతున్నారని, మరి అప్పుడు సీఎం భారతీరెడ్డా.. సజ్జలా.. పెద్దిరెడ్డా అని నిమ్మల నిలదీశారు.


ఆర్టీసీ విలీనానంతర సమస్యలను పరిష్కరించండి

- సీఎంకు ఎన్ఎంయూఏ నేతల లేఖ

విజయవాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విలీనానంతర సమస్యలను ఏకరువు పెడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ ప్రజారవాణా సంస్థ-ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులు ఏ విధంగా సమస్యలను చవిచూశారన్న అంశాలను తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఈ లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. పాత పెన్షన్ సాధన కోసమే విలీన ప్రతిపాదన తీసుకువచ్చినా అది అమలు చేయకుండా వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని వాపోయారు. ఆర్టీసీ ఉద్యోగులు 2003 కంటే ముందుగానే ఉద్యోగాల్లో చేరామని, తమకు పాత పెన్షన్‌ను వర్తింపజేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్టీసీలో ఉండగా.. కార్మికుల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న హెల్త్ స్కీమ్‌ను మార్చివేశారని, ఈహెచ్ఎస్‌ను అమలు చేస్తున్నా, సరిగ్గా వైద్యం అందటం లేదని, ఎంతో మంది కార్మికులు సరైన వైద్యం అందక చనిపోతున్నారని పేర్కొన్నారు. పాత వైద్యసదుపాయాలను పునరుద్ధరించాలని కోరారు.

కాలుష్య నియంత్రణ మండలికి సభ్యుల నియామకం

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులను సభ్యులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అటవీ పర్యావరణ, మున్సిపల్, వైద్యఆరోగ్యశాఖల ముఖ్యకార్యదర్శులు, పరిశ్రమలు, రవాణాశాఖల కమిషనర్లు, పారిశ్రామిక మౌళిక సదుపాయాలు, ఖనిజాభివృద్ధి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సభ్యులుగా, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా నియమితులయ్యారు.



12న విజన్ డాక్యుమెంట్ విడుదల

స్వర్ణాంధ్ర విజన్-2047పై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష

డాక్యుమెంట్ రూపకల్పనకు పలువురి సూచనలు.. పది సూత్రాలు ప్రకటించిన ముఖ్యమంత్రి

ఆ లక్ష్యాలను సాధించేలా డాక్యుమెంట్‌లో ప్రణాళికలు

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2047 నాటికి అన్ని రంగాల్లో నంబర్ 1గా నిలపడం కోసం సిద్ధం చేస్తున్న విజన్ డాక్యుమెంట్‌పై సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 ముసాయిదా డాక్యుమెంట్‌ను ఇటీవల అసెంబ్లీ సమావేశాల ద్వారా ప్రభుత్వం ప్రజల ముందు ఉంచింది. నీతి ఆయోగ్‌తో పాటు పలు ప్రతిష్ఠాత్మక సంస్థల భాగస్వామ్యంతో ఆ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే నిపుణులు, వివిధ ఏజెన్సీలు, మేధావులతో పాటు 17 లక్షల మంది ప్రజల నుంచి విజన్ డాక్యుమెంట్‌పై సూచనలు, సలహాలు తీసుకొన్నారు. అందరి అభిప్రాయాలు, ఆలోచనలను పరిశీలించి పరిగణనలోకి తీసుకుని రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేసింది. స్వర్ణాంధ్ర విజన్- 2047 డాక్యుమెంట్‌ను డిసెంబరు 12న విద్యార్థులు, సామాన్య ప్రజల సమక్షంలో ఆవిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డాక్యుమెంట్‌కు సంబంధించి సీఎం చంద్రబాబు ఇప్పటికే 10 సూత్రాలను ప్రకటించారు. పేదరికం లేని సమాజం, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవవనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయంలో సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్ అనే ఆ సూత్రాలు, వాటి లక్ష్యాలను సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో వివరించారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపైనా స్పష్టంగా విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. రాష్ట్రంతో పాటు జిల్లా, నియోజకవర్గం, మండలస్థాయి వరకు అభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నారు.

ఏఎన్‌యూలో విద్యార్థినుల ఆందోళనబాట

» పురుగుల అన్నం పెడుతున్నారంటూ రోడ్డెక్కిన విద్యార్థినులు


వీసీ చాంబర్ ఎదుట నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

పెదకాకాని, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు ఆందోళన బాటపట్టారు. శుక్రవారం రాత్రి వర్సిటీలోని హాస్టల్ విద్యార్థినులు మహిళా హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి వెళ్లి వీసీ చాంబర్ ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. హాస్టల్‌లో ఆహారం నాసిరకంగా ఉండడమే కాకుండా వారంక్రితం భోజనంలో కాళ్లజెర్రి వచ్చిందని, నాలుగు రోజుల క్రితం భోజనంలో కప్ప వచ్చిందని, గురు, శుక్రవారాలు రెండు రోజులు వరుసగా అన్నంలో పురుగులు వస్తున్నాయని ఆరోపించారు. భోజనం ఇలా ఉంటే ఎలా తినాలని విద్యార్థినులు ప్రశ్నించారు. వందలాది మంది విద్యార్థినులు రాత్రి 9గంటల నుంచి వీసీ చాంబర్ ఎదుటే బైఠాయించి నినాదాలు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలోనూ విద్యార్థినుల ఆందోళన కొనసాగుతూనే ఉంది.

పారిశ్రామిక హబ్‌గా ఏపీ

» విజన్-2047తో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు: మంత్రి కొల్లు

» విజయవాడలో ఏపీ చాంబర్స్ 'బిజినెస్ ఎక్స్‌పో' ప్రారంభం

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిని సర్వనాశనం చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏపీని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీనికోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలో విజన్-2047తో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే 'బిజినెస్ ఎక్స్‌పో-2024' శుక్రవారం విజయవాడలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం పెట్టుబడిదారులను వేధింపులకు గురిచేసి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టిందని, కూటమి ప్రభుత్వం ఇక్కడ పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు అందిస్తూ అండగా ఉంటోందని చెప్పారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్ శేఖర్ బాబు, కాంటినెంటల్ కాఫీ సీఎండీ సీహెచ్ రాజేంద్రప్రసాద్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్ అధ్యక్షుడు, ఎండీ రాజేష్ మిట్టల్, ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు తదితరులు మాట్లాడారు. ఈ బిజినెస్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు. డిసెంబరు ఒకటో తేదీ వరకు ఈ ఎక్స్‌పో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఏపీలో పర్యాటక అభివృద్ధికి సహకరించండి

» కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో టీడీపీ ఎంపీల భేటీ


కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశ పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరినట్లు పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. అరకు, లంబసింగితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరామని చెప్పారు. శుక్రవారం ఇక్కడ కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో రామ్మోహన్‌నాయుడితో పాటు టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, శ్రీభరత్, నాగరాజు, హరీశ్ భేటీ అయ్యారు. గండికోట, రాజమండ్రిలోని హేవలాక్ వంతెన, పుష్కర ఘాట్ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిధుల కేటాయింపే నిదర్శనమన్నారు.

అన్ని శాఖల సమాచారం ఒకేచోట: పార్థసారథి

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలోని అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు, మీడియాకు అందుబాటులో ఉండేలా త్వరలో వెబ్ పోర్టల్‌ను తీసుకురానున్నట్లు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన జర్నలిస్టు సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమంపై చర్చించారు. త్వరలో అక్రిడిటేషన్ పాలసీ రూపొందించి, అర్హులైన వారికి అక్రిడిటేషన్ మంజూరుతో సహా ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఇల్లు కట్టించి ఇచ్చే విషయంలో ఆలోచన చేస్తామని చెప్పారు. పీఎంఏవై 2.0లో అర్హులైన వారికి ఇల్లు కట్టించి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకు విన్నవించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. హెల్త్‌కార్డులు అందించడం, జర్నలిస్టులపై దాడులను నిరోధించడం, ఇతర సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు.

మోసానికి చొక్కా, ఫ్యాంటు వేస్తే జగన్: డొక్కా

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మండిపడ్డారు. 'జగన్ హయాంలో జరిగిన దానికి ఆయన కాక ఎవరు బాధ్యత వహించాలి? అదానీ డబ్బు జగన్ తినకపోతే ఎవరు తిన్నారు? జగన్ నిజమైన క్రైస్తవుడు కాదు. క్రైస్తవ సోదరులను భ్రష్టు పట్టిస్తున్నారు. ఆయన పేరు కచ్చితంగా చార్జిషీట్‌లో ఉంది. అందులో అనుమానం లేదు. మోసానికి చొక్కా, ఫ్యాంటు వేస్తే అచ్చం జగన్‌లానే ఉంటుంది. సెకీతో ఒప్పందాన్ని చూపి తప్పించుకోవాలనుకుంటే కుదరదు. జగన్ తప్పు చేయకపోతే ఒకసారి అమెరికా వెళ్లి రావాలి' అని డొక్కా సవాల్ విసిరారు.

జగన్.. శిక్ష అనుభవించక తప్పదు: సోమిరెడ్డి

నెల్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'సోలార్ విద్యుత్తు కొనుగోళ్లలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు తన పేరు లేదంటూ బుకాయిస్తే కుదరదు. ఆయనకు శిక్ష తప్పదు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. "సోలార్ విద్యుత్తు అవినీతికి సంబంధించి ఎఫ్‌బీఐ చార్జిషీటులో తన పేరు లేదని జగన్ మాట్లాడటం హాస్యాస్పదం. చేసిన తప్పుకు సిగ్గుపడకపోగా చంద్రబాబుపై నిందలు వేయడానికి ప్రయత్నించడం దారుణం. 'అదానీ నాకు లంచం ఇచ్చినట్లు ఎక్కడుంది?' అని జగన్ బుకాయించడం విచిత్రంగా ఉంది. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) దర్యాప్తు నివేదికలో 'ఏపీ చీఫ్ మినిస్టర్' అని స్పష్టంగా పేర్కొంది. ఈ కేసులో జగన్‌కు శిక్ష పడుతుంది" అని సోమిరెడ్డి అన్నారు.

ఆ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: చలసాని

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అదానీ ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అదానీపై అవినీతి ఆరోపణలు రాగానే తెలంగాణకు ఆయన ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నట్లు అక్కడి సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం అభినందనీయం. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలి. మా పోరాటం ప్రత్యేక హోదా కోసమే కాదు, మొత్తం విభజన హామీల అమలు, రాయితీలు అడుగుతున్నాం' అని చలసాని స్పష్టం చేశారు.

మాఫియాకు 'ద్వారం'

బియ్యం బొక్కేసి.. కోట్లు కొట్టేసి!.. రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

» జగన్ హయాంలో రూ.వెయ్యి కోట్ల బియ్యం కాకినాడ నుంచి విదేశాలకు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



పేదలకు ఉచితంగా ఇచ్చే రేషన్ బియ్యం కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు తరలిపోతోంది. ఒకరకంగా చెప్పాలంటే రేషన్‌బియ్యం ఎగుమతి మాఫియాకు కాకినాడ పోర్టు కేరాఫ్‌గా మారిపోయింది. ప్రతి నెలా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఇచ్చే రేషన్ బియ్యం రోజుల వ్యవధిలోనే కాకినాడకు చేరి అక్కడి నుంచి ఆకర్షణీయమైన పేర్లు, ప్యాకింగ్‌తో విదేశాలకు చేరుతోంది. దీని వెనుక పెద్ద మాఫియానే ఉంది. కాకినాడలో పాతుకుపోయిన రేషన్‌బియ్యం మాఫియా రాష్ట్రవ్యాప్తంగా వీటిని కొనుగోలు చేసి, ఇక్కడకు తరలించేలా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. ఈ బియ్యాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని తమ మిల్లుల్లో రహస్యంగా పాలిష్ చేసి, ఆకర్షణీయమైన సంచుల్లో ప్యాక్ చేసి అక్కడ నుంచి పోర్టు ద్వారా గుట్టుచప్పుడు కాకుండా ఆఫ్రికా దేశాలకు తరలించేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం.. గత వైసీపీ హయాంలో మరింత రెట్టింపైంది. కొందరు ప్రభుత్వ పెద్దల సహకారంతో గడచిన అయిదేళ్లలో పోర్టునుంచి వెళ్లిన బియ్యం ఎగుమతుల విలువ రూ.950 కోట్లు పైగానే ఉందని అంచనా. కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన వైసీపీ కీలకనేత ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం చేతిలో ఉన్న రైస్ మిల్లులు, పౌరసరఫరాలశాఖ అధికారుల సహకారంతో ఈ మాఫియా విస్తరించింది. ఎక్కడా తనిఖీలు, దాడులు లేకుండా అధికారులను మామూళ్ల మత్తులో ముంచి బియ్యాన్ని దేశాలు దాటించేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎంత అడ్డుకట్టవేద్దామన్నా అదుపులోకి రానంత స్థాయికి ఈ మాఫియా ఎదిగిపోయింది.

వైసీపీ హయాంలో విదేశాలకు వెళ్లిన విధమిదీ!

- 2019-2020లో 19 లక్షల టన్నులు
- 2020-2021లో 27 లక్షల టన్నులు
- 2021-2022లో 29 లక్షల టన్నులు
- 2022-2023లో 38 లక్షల టన్నులు
- 2023-2024లో 24లక్షల టన్నులు

వైసీపీ అభయంతో!

కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యం కొన్నేళ్లుగా విదేశాలకు తరలిపోతోంది. ప్రధానంగా యాంకరేజ్ పోర్టు నుంచి లక్షల టన్నుల బియ్యం అక్రమంగా సముద్రాలు దాటుతోంది. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం, ఆయన అనుచరులు లక్షల టన్నుల బియ్యాన్ని తరలించారు. రేషన్ బియ్యాన్ని వైసీపీ అండదండలున్న 16 కంపెనీల వ్యాపారులు అనేక ప్రాంతాల నుంచి కిలో రూ.6కి కొనుగోలు చేసి కాకినాడకు తరలించారు. వీటిని ద్వారంపూడి కుటుంబం, ఆయన మనుషులు కొనుగోలు చేసి మిల్లుల్లో పాలిష్ చేసి కిలో రూ.70 చొప్పున విదేశాలకు ఎగుమతి చేశారు. ఇలా రూ.కోట్లకు కోట్లు సంపాదించారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతుందని తెలిసినా గడచిన అయిదేళ్లపాటు సదరు కీలకనేతకు ఎదురుచెప్పే ధైర్యం చేయలేక వ్యవస్థలు నిస్సహాయంగా మారాయి. పైగా సదరు నేత అప్పటి ప్రభుత్వాధినేతకు అత్యంత సన్నిహితుడు కావడంతో రేషన్ బియ్యం ఎన్ని రూపాలు మారినా అడ్డుకునే నాథుడే లేకపోయాడు. రేషన్ బియ్యంతోపాటు అనేక జిల్లాల్లో పేదలకు రాష్ట్రప్రభుత్వం పౌష్టికాహారం కింద పంపిణీ చేసిన పోర్టిఫైడ్ బియ్యాన్ని సైతం మాఫియా పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసింది.

ఒక్కసారిగా రెట్టింపు

వైసీపీ అధికారంలోకి రాకముందు కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి మాత్రమే విదేశాలకు బియ్యం ఎగుమతి అయ్యేది. 2014-2019 మధ్య ఏడాదికి పోర్టు ద్వారా 16 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి కాగా, దీనిలో రేషన్ బియ్యం తక్కువ పరిమాణంలో ఉండేది. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం ఎగుమతులు రెట్టింపయ్యాయి. అదే సమయంలో రేషన్ మాఫియా ప్రభుత్వ పెద్దల పరోక్ష సహకారంతో తన నెట్‌వర్క్‌ను విస్తరించింది. ఫలితంగా కాకినాడకు నిత్యం వేల లారీల్లో రేషన్ బియ్యం గోదాముల్లోకి రహస్యంగా చేరేది. ఎక్కడా వీటిని తనిఖీలు చేయకుండా అప్పటి పౌరసరఫరాల కార్పొరేషన్ సైతం సహకరించింది. ఈ విభాగం కూడా సదరు కాకినాడ కీలకనేత తండ్రి చేతుల్లో ఉండేది. అటు రాష్ట్ర విల్లర్ల సంఘం కూడా సోదరుడి చేతులోనే ఉంది.

5 నుంచి 14 దేశాలకు

జగన్ అధికారంలోకి రాకముందు కాకినాడ పోర్టు ద్వారా 5 దేశాలకు బియ్యం ఎగుమతి అయ్యేది. 2019 తర్వాత ఈ ఎగుమతులు ఏకంగా 14 దేశాలకు విస్తరించాయి. వీటిలో ఎక్కువగా పశ్చిమ ఆఫ్రికా దేశాలు, ఇండోనేషియా, చైనాకు ఎగుమతయ్యాయి. ఆఫ్రికా దేశాలకు బియ్యం వెళ్లిన తర్వాత అక్కడ బిల్లులు వేగంగా రావడం లేదని భావించిన ద్వారంపూడి ఏకంగా ఆయా దేశాల్లో గోదాములు నిర్మించేయడం గమనార్హం.

షిప్పులు దగ్గరకు రావడం లేదని

కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి మాత్రమే జరిగే బియ్యం ఎగుమతులకు ఎక్కువ సమయం పడుతుంది. డ్రెడ్జింగ్ సదుపాయం లేకపోవడంతో నౌకలు పోర్టు బెర్త్ వద్దకు రావు. పోర్టుకు 9 నాటికల్ మైళ్ల దూరంలో ఆగిపోతాయి. అక్కడకు బార్జిల్లో బియ్యం బస్తాలను లోడ్ చేసి నౌకవద్దకు తీసుకువెళ్లి లోడింగ్ చేస్తారు. దీనివల్ల ఎగుమతులకు సమయం తీసుకుంటుంది. దీంతో వైసీపీ హయాంలో ద్వారంపూడి చక్రం తిప్పారు. పక్కనే ఉన్న ప్రైవేటు పోర్టు.. డీప్‌వాటర్ పోర్టు నుంచి ఎగుమతులకు అనుమతుల కోసం అప్పటి ప్రభుత్వాధినేతను ఒప్పించారు. దీంతో 2021లో తొలిసారిగా డీప్ వాటర్ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

కూటమి వచ్చినా

కూటమి అధికారంలోకి రాగానే రేషన్ మాఫియాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విదేశాలకు అక్రమంగా పాలిష్ చేసి ఎగుమతి చేస్తున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపింది. స్వయంగా మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడకు వచ్చి పోర్టుతో సహా గోదాములను జూలైలో తనిఖీ చేశారు. రూ.157 కోట్ల విలువైన 50,647 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 26,488 టన్నులను రేషన్ బియ్యంగా గుర్తించారు. కొత్తగా పోర్టు పరిసరాల్లో రెండు సమీకృత చెక్‌పోస్టులు రేయింబవళ్లు పనిచేసేలా ఏర్పాటు చేశారు. ప్రతి లారీని తనిఖీ చేసి శాంపిళ్లు సేకరించేలా నిఘాపెట్టారు. అయినప్పటికీ రేషన్ మాఫియా ఒత్తిళ్లతో రాత్రివేళ తనిఖీలు నిలిచిపోయాయి. పాతిక లారీలకు రెండు లారీలను కూడా తనిఖీ చేయకుండా అధికారులు లోపలకు పంపేస్తున్నారు. చెక్‌పోస్టులో సిబ్బంది ఫోన్ నెంబర్లు సేకరించిన బియ్యం మాఫియా వారికి మామూళ్లు ఇచ్చి పోర్టులోకి రేషన్ బియ్యాన్ని తరలించేస్తోంది.

స్మగ్లింగ్‌కు అడ్డాగా కాకినాడ పోర్టు

(మొదటి పేజీ తరువాయి)


అధికారుల తీరుపై ఆగ్రహిస్తూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుతో మాట్లాడుతున్న పవన్

పేలుడు, మత్తు పదార్థాలు దిగుమతి కావని గ్యారెంటీ ఏంటని ప్రశ్నించారు. కాకినాడ అత్యంత ప్రమాదకరమైన పోర్టు అని ప్రధాని, కేంద్ర హోంశాఖకు లేఖ రాస్తానని పేర్కొన్నారు. పోర్టులో తనిఖీలకు వెళ్లాలనుకుంటే రెండునెలలుగా తనను అధికారులు అడ్డుకుంటున్నారని, తానొస్తే పదివేల కుటుంబాల జీవితాలు అతలాకుతులం అయిపోతాయని చెబుతూ తనకు సహకరించడం లేదని మండిపడ్డారు. తనిఖీల కోసం శుక్రవారం సముద్రం లోపల నౌకపైకి వెళ్తానంటే అక్కడా అధికారులు అడ్డుకున్నారని, ఏంటని నిలదీస్తే వాతావరణం బాగోలేదంటూ డిప్యూటీ సీఎం అయిన తనకే కథలు చెప్పారన్నారు. కాకినాడ పోర్టులో శుక్రవారం ఉపముఖ్యమంత్రి పర్యటించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులోని ఓ బార్జిలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలకు ఎగుమతి అవుతుంటే ఏం చేస్తున్నారని, మాఫియాకు కొమ్ము కాస్తున్నారా అని మండిపడ్డారు. అనంతరం డీప్‌వాటర్ పోర్టు నుంచి సముద్రం లోపలకు అల్లకల్లోల వాతావరణంలోనే 9 మైళ్లు సాహసంతో కూడిన ప్రయాణం చేశారు. అక్కడ నౌక ద్వారా పశ్చిమ ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడానికి సిద్ధంగా ఉన్న బియ్యాన్ని తనిఖీ చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు.

మాఫియాది పెద్ద నెట్‌వర్క్

"కాకినాడ పోర్టు బియ్యం స్మగ్లింగ్‌కు హబ్‌గా తయారైంది. హోప్ ఐలాండ్‌ను అడ్డంపెట్టుకుని బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. గతంలో ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై పోరాడితే మమ్మల్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత డ్రోన్ల ద్వారా వీడియోలు తీయించి బియ్యం మాఫియా బండారం బయటపెట్టాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ మాఫియాను అరికడతామని చెప్పాం. దానికి తగ్గట్టుగా 51 వేల టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నాం. ఇక్కడి నుంచి రోజుకు 1,100 లారీల బియ్యం వెళ్తుంటే తనిఖీ చేయడానికి 11 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. ఈ ముసుగులో రేషన్ బియ్యం వెళ్లిపోతున్నా ఆపేవారు లేరు. అడ్డుకోవాలని మేం ప్రయత్నిస్తుంటే అధికారులు సహకరించడం లేదు. బియ్యం మాఫియా చాలా పెద్ద నెట్‌వర్క్ నడుపుతోంది. పోర్టు ఉన్నది ఎగుమతుల కోసం.. అంతేకానీ స్మగ్లింగ్ కోసం కాదు. దీనిపై పదివేల మంది కార్మికుల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ తనిఖీల కోసం వస్తానని నేను అధికారులకు సమాచారం ఇస్తే రావద్దని రెండు నెలలుగా అడ్డుకుంటున్నారు. డిప్యూటీ సీఎం అయిన నాకే అధికారుల నుంచి అసలు సహకారం లేదు. శుక్రవారం తనిఖీల కోసం సముద్రంలో నౌక వద్దకు వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లాక షిప్‌లో తనిఖీలకు వాతావరణం అనుకూలంగా లేదన్నారు. నన్ను వెళ్లకుండా అడ్డుకున్నారు. అయినా బలవంతంగా వెళ్లి భారీ నౌకలో తనిఖీ చేశా. నౌకలో తనిఖీలను అధికారులు ఏదో ఒక సాకు చెప్పి తప్పించాలని చూడడం ఆశ్చర్యం కలిగించింది. దీన్నిబట్టి బియ్యం మాఫియా ఎంత లోతుగా ఉందో అర్థమవుతుంది. నేను తనిఖీలకు వస్తే కేఎస్‌పీఎల్ తరఫున అరబిందో సంస్థ సీఈవో కనీసం రాలేదు. దీన్నిబట్టి ఇక్కడ పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. పీడీఎస్ బియ్యం ఉన్న భారీనౌకను సీజ్ చేయడంతోపాటు పోర్టు సీఈవోకు కూడా నోటీసులు ఇవ్వాలని ఆదేశించాను" అని పవన్ కల్యాణ్ అన్నారు.

మారీటైం పోలీసింగ్ బలహీనం

కాకినాడ పోర్టు నుంచి తనిఖీలు లేకుండా రేషన్ బియ్యం ఎలా ఎగుమతి అవుతోందని చెక్‌పోస్టులో సెక్యూరిటీ, డీఎస్‌వోను ప్రశ్నించినా సమాధానం చెప్పలేదని డిప్యూటీ సీఎం చెప్పారు. "బియ్యం మాఫియాలో 16 కంపెనీలు పాలుపంచుకుంటున్నాయి. దీనిలో కింగ్‌ఫిష్ కంపెనీల పాత్ర కీలకంగా ఉంది. మానస ట్రేడింగ్ కంపెనీ కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోదరుడిదిగా చెబుతున్నారు. పెద్ద నెట్‌వర్క్‌గా మారిన బియ్యం మాఫియాపై అసలు ఎవరిపై వేటు వేయాలనేది కూడా అర్థం కావడం లేదు. అంతలా ఈ మాఫియా వేళ్లూనుకుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని కిలో రూ.43.50 కొనుగోలు చేసి పేదలకు ఇస్తుంటే మాఫియా ఈ బియ్యాన్ని ఆఫ్రికా దేశాల్లో కిలో రూ.70 చొప్పున విక్రయిస్తోంది. బియ్యం సముద్రం దాటి వెళ్లిపోవడానికి తీరప్రాంతంలో మారీటైం పోలీసింగ్ చాలా బలహీనంగా ఉండడమే కారణంగా కనిపిస్తోంది. కాకినాడ తీర ప్రాంతంలో కేజీ బేసిన్ ఉంది. ఓఎన్‌జీసీ వంటి కంపెనీలు ఆయిల్ ఉత్పత్తి చేస్తున్నాయి. మారీటైం సెక్యూరిటీ బలహీనంగా ఉండడంవల్ల ఈరోజు రేషన్ బియ్యం యథేచ్ఛగా ఎగుమతవుతోంది. రేపు ఆర్‌డీఎక్స్, ఆయుధాలు, డ్రగ్స్ దిగుమతి అయ్యే అవకాశం కూడా ఉంది. అసలే రాష్ట్రం గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా ఉంది. కాకినాడ పోర్టు నుంచి కూడా ఎంత డ్రగ్స్ ఎగుమతి, దిగుమతి అయిందో తెలియదు" అని పవన్ వ్యాఖ్యానించారు.

పీడీ యాక్ట్!

రేషన్ బియ్యం మాఫియాపై పీడీ యాక్ట్ పెట్టే ఆలోచన ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. దీనిపై మంత్రివర్గంలో చర్చించిన అనంతరం గవర్నర్, రాష్ట్రపతి ఆమోదానికి పంపాల్సి ఉంటుందని, దీనిపై సమీక్షిస్తామని తెలిపారు. "సీఎం చంద్రబాబు దృష్టికి ఈ వ్యవహారం తీసుకువెళ్తా. బియ్యం మాఫియాపై సీఐడీ, సీబీఐ విచారణ చేసే విషయమై మంత్రివర్గంలో ఆలోచిస్తాం. కాకినాడపోర్టు ప్రమాదకరంగా ఉందని, భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీకి చెప్పాను. కలెక్టర్ స్పందించారు. కానీ, జిల్లా ఎస్పీ నుంచి అసలు స్పందనే లేదు. నేను జిల్లాకు ఎప్పుడు పర్యటనకు వచ్చినా ఎస్పీ సెలవులో ఉండడం చిత్రంగా ఉంది" అని అన్నారు.

పెద్దిరెడ్డి సోదరులపై చర్య తీసుకోండి

» తప్పుడు కేసు పెట్టి, జైలుపాలు చేశారు

» పోలీసులకు బాధితుడు మనోహర్ నాయుడు ఫిర్యాదు


శుక్రవారం బి.కొత్తకోట సీఐకి ఫిర్యాదు చేస్తున్న మనోహర్ నాయుడు, గత ఏడాది ఆగస్టు4న నాసిక్‌లో మిలిటరీ పరేడ్‌లో కుమారుడు హరికృష్ణనాయుడుతో మనోహర్‌నాయుడు దంపతులు

రాయచోటి /బి.కొత్తకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'అన్నమయ్య జిల్లా అంగళ్లు దాడి ఘటన కేసులో నన్ను అక్రమంగా ఇరికించారు. తప్పుడు కేసు పెట్టి, నన్ను జైలుపాలు చేసినందుకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, అప్పటి మదనపల్లె డీఎస్పీ కేశప్ప, మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు తదితరులపై చర్య తీసుకోండి' అంటూ బాధితుడు ఒకరు తాజాగా పోలీసులను ఆశ్రయించారు. ప్రతిపక్ష నేత హోదాలో 2023, ఆగస్టు 4న చంద్రబాబు అన్నమయ్య జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా బి.కొత్తకోట మండలం అంగళ్లులో వైసీపీ నాయకులు చంద్రబాబుపై రాళ్లదాడికి పాల్పడ్డారు. అయితే అప్పటి పోలీసులు ఈ ఘటనపైన చంద్రబాబుతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలపై ఐదు కేసులు నమోదు చేశారు. సంఘటన జరిగిన రోజు అసలు ఊర్లో లేని వ్యక్తులు పలువురిని ఈ కేసుల్లో ఇరికించారు. సుమారు 250 మందిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వీళ్లంతా చేయని తప్పునకు సుమారు 50 రోజుల పాటు జైలులో గడిపారు. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం బావగారిపల్లెకు చెందిన బి.మనోహర్ నాయుడూ ఆ బాధితుల్లో ఒకరు. తనను అన్యాయంగా కేసులో ఇరికించి, జైలుపాలు చేసి వేధించిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ సీఐ రాజారెడ్డికి శుక్రవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. 'నా పెద్దకొడుకు బి.హరికృష్ణనాయుడు ఆర్మీలో ఉన్నాడు. మిలిటరీ పరేడ్‌ను చూసేందుకు ఆయన ఆహ్వానం మేరకు భార్యతో కలసి నాసిక్‌కు వెళ్లా. గత ఏడాది ఆగస్టు 3న వెళ్లి 6వ తేదీ రాత్రి తిరిగి స్వగ్రామానికి వచ్చాను. నేను మన రాష్ట్రంలోనే లేని సమయంలో అంగళ్లు సంఘటన జరిగింది. అయితే నేను ఇంటికి వచ్చిన మరుసటి రోజు మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు పిలుస్తున్నారంటూ బి.కొత్తకోట పోలీసులు అప్పటి డీఎస్పీ కేశప్ప వద్దకు తీసుకెళ్లారు. ఆయన కులం పేరుతో దుర్భాషలాడారు. క్రైం నంబరు 75/2023లో నన్ను ఇరికించి అటు నుంచి అటే రిమాండ్‌కు తరలించారు. రిమాండ్‌లో 50 రోజులపాటు మదనపల్లె సబ్ జైలులో అనేక చిత్రహింసలకు గురయ్యాను. వైసీపీ నాయకులు తిరుమల అమరనాథ్, లోకనాథరెడ్డి ప్రోద్బలంతో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కేసులో ఇరికించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని మనోహర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, మనోహర్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి మీడియాకు తెలిపారు.

బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో స్కిల్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని జగన్ సర్కారు కేసు నమోదు చేసింది. గతేడాది సెప్టెంబరు 9న సీఐడీ ఆయన్ను అరెస్టు చేసింది. 52రోజులు రాజమహేంద్రవరం జైలులో ఉన్న ఆయనకు హైకోర్టు గత నవంబరు 20న బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఆ వ్యాజ్యం శుక్రవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వర్చువల్‌గా హాజరయ్యారు. తాను ప్రస్తుతం ఢిల్లీలో లేనని, స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని భావిస్తున్నట్లు చెప్పారు. విచారణను వాయిదా వేయాలని అభ్యర్థించారు. ప్రతిసారీ వాయిదా వేయడంలో అర్థం లేదని.. ఇదే చివరిసారిగా ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను జనవరి రెండోవారంలో చేపడతామని స్పష్టం చేసింది.

పీటీ వారెంట్ వివరాలు నిందితులకు ఇవ్వక్కర్లేదు

» స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వైసీపీ సానుభూతిపరుడు ఇంటూరి రవికిరణ్‌పై నమోదైన కేసుల వివరాలను కోర్టు ముందు ఉంచాలని హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. పీటీ వారెంట్ వివరాలు నిందితుడికి తెలియజేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. అయితే పీటీ వారెంట్‌పై హాజరుపర్చినప్పుడు న్యాయసహాయం కోసం సంబంధిత మేజిస్ట్రేట్‌ను అభ్యర్థించేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు ఇచ్చింది. తదుపరి విచారణను డిసెంబరు 9కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తన భర్త ఇంటూరి రవికిరణ్‌పై దాఖలైన కేసుల వివరాలతో పాటు పీటీ వారెంట్ దాఖలు సమాచారాన్ని ముందస్తుగా తెలియజేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఇంటూరు సుజన పిటిషన్ దాఖలు చేశారు.





దేశ పర్యాటక రంగానికి ఊతం

3,295 కోట్లతో 40 ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా.. ఏపీలోని గండికోట, అఖండ గోదావరి- రాజమహేంద్రవరాలకు చోటు

'సాస్కి' కింద 172.35 కోట్లు కేటాయింపు.. తెలంగాణలోని రామప్ప, సోమశిల ప్రాంతాల అభివృద్ధికి రూ.141.84 కోట్లు



న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి)' పథకం కింద ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనుంది. ఇందుకు సంబంధించి 23 రాష్ట్రాల్లోని 40 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం రూ.3,295.76 కోట్ల నిధులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వనుంది. 50 ఏళ్ల కాలవ్యవధితో వడ్డీ రహిత రుణాల రూపంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ నిధులను విడుదల చేస్తుంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ప్రోత్సాహం లభిస్తుందని, సుస్థిరమైన పర్యాటకంతో కొత్తగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా 40 ప్రాజెక్టుల వివరాలను పంచుకున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రెండేసి చొప్పున పర్యాటక ప్రాంతాలు కేంద్రం ప్రకటించిన ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి గండికోటతో పాటు అఖండ గోదావరి-రాజమహేంద్రవరం ప్రాజెక్టుల అభివృద్ధికి సాస్కి కింద కేంద్రం రూ.172.35 కోట్లు కేటాయించింది. గండికోటకు రూ.77.91 కోట్లు, అఖండ గోదావరి-రాజమహేంద్రవరం ప్రాజెక్టుకు రూ.94.44 కోట్లు కేటాయించింది. అఖండ గోదావరిలో భాగంగా హేవలాక్ వంతెన, పుష్కర్ ఘాట్‌ను అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణలోని రామప్ప, సోమశిల పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.141.84 కోట్లు కేటాయించింది. రామప్ప రీజియన్ సుస్థిర పర్యాటక సర్క్యూట్ పేరుతో చేపట్టే ప్రాజెక్టుకు రూ.73.74 కోట్లు, సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల కింద చేపట్టే ప్రాజెక్టుకు రూ.68.10 కోట్లను కేంద్రం కేటాయించింది.

వాసుదేవరెడ్డికి షరతులతో ముందస్తు బెయిల్

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ మద్యం షాపు లీజు అగ్రిమెంట్ వ్యవహారంలో సీఐడీ నమోదు చేసిన కేసులో బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి, ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ఆయన బంధువు వరప్రసాద్‌రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ, గాంధీనగర్‌లోని అలంకార్ కాంప్లెక్స్‌లో మద్యం షాపు ఏర్పాటుకు లీజు అగ్రిమెంట్ కోసం అడిగినంత ఇవ్వలేదనే కారణంతో తన సంతకం ఫోర్జరీ చేసి అర్ధంతరంగా లీజు అగ్రిమెంట్‌ను రద్దు చేశారని విజయవాడకు చెందిన వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల వాదనలు ముగియగా.. శుక్రవారం తీర్పు వెల్లడించారు.

సజ్జల అరెస్టుపై మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి కేసులో సజ్జల రామకృష్ణారెడ్డికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. తదుపరి విచారణను డిసెంబర్ 12కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సజ్జల భార్గవ్ 'బెయిల్' విచారణ వాయిదా

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టారనే ఆరోపణలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తనపై దాఖలైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు డిసెంబర్ 6కి వాయిదా వేసింది. అప్పటివరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో నిందితుడు సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై పిటిషనర్ల తరఫు వాదనలు శుక్రవారం ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరఫు వాదనల కోసం విచారణను డిసెంబర్ 6కి న్యాయమూర్తి వాయిదా వేశారు.

వర్రాను పోలీస్ కస్టడీకి ఎందుకు ఇవ్వకూడదు?

- ఆధారాలివ్వాలంటూ వర్రా లాయర్లకు కడప కోర్టు ఆదేశం


బాపట్ల కోర్టులో వర్రా రవీంద్రారెడ్డిని హాజరుపరచి తిరిగి కడప సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

కడప రూరల్, బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కో కన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డి పోలీస్ కస్టడీ పిటిషన్ విచారణను స్థానిక ఎస్సీ, ఎస్టీ కోర్టు (నాల్గవ అదనపు జిల్లా కోర్టు) డిసెంబరు 2కు వాయిదా వేసింది. ఈ మేరకు జడ్జి వెంకటేశ్వరరావు ఉత్తర్వులు ఇచ్చారు. వర్రాను పోలీస్ కస్టడీకి ఇవ్వాలనే పిటిషన్‌పై శుక్రవారం కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వర్రా తరుఫున న్యాయవాదులు స్పందిస్తూ.. పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిన అవసరంలేదని విన్నవించారు. దీనిపై జడ్జి స్పందిస్తూ.. కస్టడీకి ఎందుకు ఇవ్వకూడదో తగిన ఆధారాలు అందజేయాలన్నారు. దానికి సమయం కావాలని వర్రా తరఫు న్యాయవాదులు కోరగా కోర్టు సోమవారం వరకు గడువు ఇచ్చింది.

బాపట్ల కోర్టుకు వర్రా

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వ్యవహారంలో గతం లో గుంటూరు జిల్లా పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విచారణ నిమిత్తం వర్రా రవీంద్రారెడ్డిని శుక్రవారం బాపట్ల కోర్టులో హాజరుపరిచారు. అతనికి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి 14 రోజులు రిమాండ్ విధించారు. రిమాండ్ ఖైదీగా కడప సెంట్రల్ జైల్లో ఉన్న వర్రాను పీటీ వారెంట్‌పై ఇక్కడికి తీసుకొచ్చారు. అయితే నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టేటప్పుడు సమర్పించాల్సిన డాక్యుమెంట్ల విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల జడ్జి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

విజయ్‌పాల్ కస్టడీ పిటిషన్ రిటర్న్

గుంటూరు(లీగల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విశ్రాంత అడిషనల్ ఎస్పీ విజయ్‌పాల్‌ను విచారణ కోసం ఐదు రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ గుంటూరు నగరంపాలెం పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు రిటర్న్ చేసింది. మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో అరెస్టయి జిల్లా జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న విజయ్‌పాల్‌ను పోలీస్ కస్టడీకి అప్పగించాలని కోరుతూ నగరంపాలెం పోలీసులు గురువారం గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టులో పిటిషన్ వేశారు. అయితే ఆ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి కొన్ని కారణాలను ఉటంకిస్తూ విచారణకు స్వీకరించలేదు. తగిన వివరణతో శనివారం తిరిగి కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా, రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐదో నిందితురాలిగా ఉన్న అప్పటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసుకున్న పిటిషన్ డిసెంబరు 2కు వాయిదా పడింది.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు వైఎస్ భాస్కర్‌రెడ్డికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. ఆయనకు ఇటీవల తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ తీర్పును అక్టోబరు 25న సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఆ పిటిషన్ శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ కేసులో భాస్కర్‌రెడ్డి సహనిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించిందని, ఆయనకు మాత్రం బెయిల్ ఇచ్చిందని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టు అన్నారు. వివేకా కుమార్తె సునీత తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. మిగతా నిందితులకు కూడా బెయిల్ రద్దు చేయాలని పిటిషన్లు దాఖలయ్యాయని, భాస్కర్‌రెడ్డికి సంబంధించిన పిటిషన్‌ను వాటికి జత చేయాలని కోరారు. అన్ని పిటిషన్లనూ కలిపి విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. అనంతరం భాస్కర్‌రెడ్డికి నోటీసులు జారీచేశారు.

ఆర్జీవీపై కాపునాడు నేతల ఫిర్యాదు

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కాపునాడు నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సమావేశమైన నేపథ్యంలో ఆర్జీవీ సోషల్ మీడియాలో విమర్శలు చేసి కాపు సామాజిక వర్గాన్ని కించపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్జీవీపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంకట్రామిరెడ్డికి 41ఏ నోటీసులు

- పిలిచినప్పుడు విచారణకు రావాలని ఎక్సైజ్ పోలీసు అధికారుల ఆదేశం



అమరావతి/గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని కొండపావులూరి గార్డెన్స్‌లో ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించి ఏర్పాటు చేసిన మందు, విందు పార్టీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి పరువును బజారున పడేసింది. ఈ మందు విందుపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు 41ఏ నోటీసు జారీ చేయడంతోపాటు పోలీసు స్టేషన్‌కు పిలిచారు. విచారణకు ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని ఆదేశించి ఆయన్ను వదిలిపెట్టారు. ఈ విందు ద్వారా వెంకట్రామిరెడ్డి ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా డిసెంబరు 4న జరిగే సచివాలయ క్యాంటిన్ కమిటీ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న ఉద్యోగులను ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తోంది. దీంతో సివిల్ పోలీసులు ఆ కోణంలో కూడా కేసు నమోదు చేసే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. ఎక్సైజ్ పోలీసులు ఈ దాడుల్లో 5 ఫుల్ బాటిల్స్ విస్కీ, 2 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. విస్కీ బాటిల్స్ ఐదులో మూడు సీల్ ఓపెన్ చేసి ఉన్నాయి. ఈ విందులో సుమారు 30 మంది సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నప్పటికీ వారంతా వెంకట్రామిరెడ్డి పిలిస్తేనే వచ్చామని చెప్పారు. విందుకు అనుమతులు తీసుకున్నదీ, లేనిదీ తమకు తెలియదని ఎక్సైజ్ పోలీసు అధికారులకు వివరించారు. దీం తో వారిని కేసు నుంచి మినహాయించారు.

నాపై దుష్ప్రచారం

తనపై దుష్ప్రచారం చేస్తున్నారని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయం గేటు బయట మీడియాతో ఆయన మాట్లాడారు. "డిసెంబరు 4న జరిగే క్యాంటీన్ ఎన్నికలు సంబంధించిన సమావేశానికి వెళ్లా. కానీ.. అక్కడేదో తీవ్ర నేరం జరుగుతున్నట్టు 5 ఎక్సైజ్ స్టేషన్ల నుంచి పోలీసులు వచ్చారు. అనుమతి లేకుండా మందు పార్టీ ఇస్తున్నారు, కేసు పెడతామని అన్నారు. 120 మంది ఉద్యోగులకు 3 విస్కీ బాటిళ్లతో పార్టీ ఇవ్వడం సాధ్యమవుతుందా? సచివాలయ చరిత్రలో ఇలాంటి దాడులు చూడలేదు. రైతుల వేషంలో వచ్చిన పోలీసులు మాతోనే ఉన్నారు. మందు పార్టీ ఇచ్చి ఉంటే వారికి కనిపించలేదా?. క్యాంటిన్ ఎన్నికల్లో గెలవడానికి ప్రతీకార రాజకీయాలకు తెరతీసేలా చేస్తారా? నన్ను అరెస్టు చేశారంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. నాకు కేవలం 41ఏ నోటీసులు ఇచ్చి పంపారు. దీనిపై వారికి వివరణ ఇస్తా. నన్ను మీడియాతో మాట్లాడకుండా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు" అని వెంకట్రామిరెడ్డి అన్నారు.

నీ స్వార్థం కోసం: ఉద్యోగులు ఫైర్

ఉద్యోగ సంఘం నేత వెంకట్రామిరెడ్డి తీరుపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. మందు పార్టీకి పర్మిషన్ తీసుకోవాలని తెలిసీ ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ఎదుర్కొన్న పరాభవానికి తోటి ఉద్యోగులను ఇరికిస్తారా? అని నిలదీస్తున్నారు. "ఉద్యోగుల సంక్షేమం పూర్తిగా వదిలేసి, ఒక పార్టీకి తొత్తుగా మారి.. మీ రాజకీయ ప్రయోజనాల కోసం పదవిని పట్టుకుని వేలాడడం రాక్షసానందం కాదా?" అని వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్నిస్తున్నా రు. అధ్యక్ష స్థానంలో ఉండి ఒక వర్గం వారికి మద్దతుగా వెళ్లి.. వంతపాడడం ఏమిటని నిలదీస్తున్నారు. సస్పెన్షన్ సమయంలో నిఘా ఉంటుందని తెలిసీ పార్టీకి వెళ్లి 30 మంది ఉద్యోగులను భయాందోళనలోకి నెట్టేశారని, అనుమతులు లేకుండా ఇచ్చిన పార్టీపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకున్నారని, దీనికి సహచర ఉద్యోగులపై నిందలు వేయడం తగదని మండిపడుతున్నారు. ఉద్యోగుల పరువు తీయడంతోపాటు, అసోసియేషన్ గుర్తింపునే ప్రభుత్వం రద్దు చేస్తామనే పరిస్థితికి తెచ్చారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు కోర్టుకు బోరుగడ్డ

పట్టాభిపురం కేసులో 14 రోజులు రిమాండ్

తిరిగి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలింపు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను శుక్రవారం గుంటూరు పట్టాభిపురం పోలీసులు పీటీ వారెంటుపై కోర్టులో హాజరుపరిచారు. ఈ ఏడాది జూన్ 1న ఓ సంస్థ ఎగ్జిట్ పోల్ సర్వే విడుదల చేయగానే బోరుగడ్డ చెలరేగిపోయాడు. 'మా వైసీపీ ప్రభుత్వం రాబోతోంది' అంటూ ఓ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేశాడు. తీవ్ర వ్యాఖ్య లు చేస్తూ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. చంద్రబాబును, ఆయన కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించాడు. ఆయన సామాజిక వర్గానికి చెందిన మహిళలను అత్యాచారం చేస్తానని, ఇళ్లల్లోకి వచ్చి చంపేస్తా.. అంటూ రాయడానికి వీలు లేని భాషలో దూషించాడు. దీనిపై గుంటూరు నగరంలోని విజయపురి కాలనీ నాలుగో లైన్‌కి చెందిన గని వెంకటేశ్వర్లు జూన్ 3న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నమోదైన పలు కేసుల్లో నిందితుడైన బోరుగడ్డ అనిల్ రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. దీంతో తాజాగా శుక్రవారం పట్టాభిపురం పోలీసులు రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి స్పందన, 14 రోజులు రిమాండ్ విధించడంతో బోరుగడ్డను తిరిగి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. ఇక, అనిల్‌ను వారం రోజుల పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేయాలని పట్టాభిపురం పోలీసులు నిర్ణయించారు.

ఏమిటిదంతా? ఏం చేస్తున్నారు మీరంతా?

- వెంకటరెడ్డికి జైల్లో రాజభోగాలపై సీఎం చంద్రబాబు సీరియస్

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'ఏమిటిదంతా? మీరంతా ఏం చేస్తున్నారు? మీ శాఖ పరిధిలో జైళ్లలో ఏం జరుగుతోందో తెలుసుకొనే బాధ్యత మీకు లేదా? అవినీతితో రాష్ట్రాన్ని దోచుకొన్నవాళ్లు అందులో నాలుగు రూపాయలు విసిరేస్తే జైళ్లలో ఏం కావాలంటే అది జరిగిపోతుందా? మీపై నమ్మకంతో బాధ్యత అప్పగిస్తే ఇలాగేనా చేసేది?' అని జైళ్ల శాఖ ఉన్నతాధికారిపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి కేసులో అరెస్టయిన గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి విజయవాడ జైల్లో రిమాండ్‌లో ఉన్న సమయంలో అధికారులు రాజభోగాలు సమకూర్చారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తను చూసిన ఆయన ఆ శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. నారావారిపల్లిలో తన సోదరుడి దశ దిన కర్మలకు హాజరైన చంద్రబాబు... శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయానికి వచ్చారు. పత్రికలో వార్తను చూసిన ఆయన దీనిపై తనకు తక్షణమే నివేదిక ఇవ్వాలని, అలాగే జైళ్ల శాఖ డీజీ విశ్వజిత్, నిఘా విభాగం అధిపతి లడ్డాను పిలిపించాలని ఆదేశాలు జారీ చేశారు. వారిద్దరూ కలిసే సమయానికే సీఎంకు ప్రాథమిక నివేదిక అందింది. వెంకటరెడ్డి జైల్లో ఉన్న సమయంలో ఆయన గదిలో కొత్త టీవీ, కొత్త ఫ్రిజ్ ఏర్పాటు చేశారని, జైలు కోసం దాతలు ఇచ్చిన వాటిని అధికారులు వెంకటరెడ్డి గదిలో పెట్టారని ఆ నివేదికలో పేర్కొన్నారు. అలాగే కోర్టు అనుమతి లేకపోయినా బయటి నుంచి భోజనం తెప్పించుకోవడానికి జైలు అధికారులు అనుమతించారని తెలిపింది. బయటి నుంచి వెంకటరెడ్డి భోజనం తెప్పించుకోవడానికి కోర్టు అనుమతి ఉందా అని సీఎం ప్రశ్నించడంతో లేదని విశ్వజిత్ అంగీకరించారు. ఎవరి ప్రమేయంతో ఈ వ్యవహారం జరిగిందో తనకు పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని, బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, జగన్ చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న సమయంలో అక్కడ పని చేసిన ఒక అధికారి ప్రస్తుతం విజయవాడ జైల్లో ముఖ్య బాధ్యతల్లో ఉన్నారని, వైసీపీ నేతలతో ఆయనకున్న సాన్నిహిత్యం వెంకటరెడ్డికి ఉపయోగపడిందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. సీఎం ఆగ్రహం నేపథ్యంలో ఆ శాఖలో ఒకరిద్దరిపై వేటు పడే సూచనలున్నాయి.

అబద్ధాల అల్లికలో జగన్ సిద్ధహస్తుడు

- అదానీ కలవడమూ, సీఎంకు నేరుగా ముడుపులు ఇవ్వడమూ చరిత్రే
- అసత్య ఆరోపణలు అయితే బైబిల్‌పై ప్రమాణం చేయండి: షర్మిల



అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'అబద్ధాలను అందంగా అల్లడంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధహస్తుడు. ఆయనకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలి' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం ఆమె ఎక్స్‌లో స్పందిస్తూ, జగన్‌కు పలు ప్రశ్నలు సంధించారు. శాలువలు కప్పాలని, సన్మానాలు చేయాలని, అవార్డులు ఇవ్వాలని కోరుకునే ముందు తన ప్రశ్నలకు సమధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "2021, మేలో సెకీ వేసిన వేలంలో యూనిట్ గరిష్ఠ ధర రూ.2.14 ఉంటే.. తమరు రూ.2.49కు కొన్నందుకు శాలువాలు కప్పాలా? అదానీ వద్ద యూనిట్ రూ.1.99 చొప్పున గుజరాత్ కొనుగోలు చేస్తే అదే కంపెనీ నుంచి 50 పైసలు ఎక్కువకు కొన్నందుకు సన్మానాలు చేయాలా? ట్రాన్స్‌మిషన్ చార్జీల భారం అక్కడ ఎక్కడా లేకుంటే గుజరాత్‌కు ఇచ్చిన రేటు ప్రకారం ఏపీకి రూ.1.99కే అదానీ ఎందుకు ఇవ్వలేదు? ట్రాన్స్మిషన్ చార్జీలు గరిష్ఠంగా యూనిట్‌కు రూ.1.70 పడతాయంటూ వైసీపీ సర్కారు జమానాలోని ఇంధన శాఖ అధికారులే చెబుతుంటే.. ఎటువంటి చార్జీలూ లేవని చెప్పే మీ మాటలు శుద్ధ అబద్ధం కాదా? ఒక సీఎంని పారిశ్రామికవేత్త, అధికారికంగా కలిస్తే గోప్యత ఎందుకు పాటించారు? నిజమే... అదానీ కలవడం ఒక చరిత్ర. రూ.1,750 కోట్లు నేరుగా సీఎంకి ముడుపులు ఇవ్వడమూ చరిత్రే. ఎవరూ కొనని విద్యుత్తును కొన్నాక బంపర్ ఆఫర్‌గా ప్రకటించుకోవడం చరిత్ర. గంటల్లోనే కేబినెట్ ముందు పెట్టడమూ చరిత్రే. ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్ అంటే ఆరోజు తమరు కాదా? జగన్ అవినీతి చేశారని చెప్పింది మేం కాదు. అమెరికా అధికారిక దర్యాప్తు సంస్థలు ఎఫ్‌బీఐ, ఎస్‌ఈసీ వెల్లడించాయి. ముడుపులు ముట్టాకే ఒప్పందాలు చేసుకున్నారని నివేదికలో పేర్కొన్నాయి. గంగవరం పోర్టును అదానీకి రూ.640 కోట్లకు అమ్మేసినప్పుడే తమరి ముడుపుల భాగోతం తెలిసిపోయింది. అదానీతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి లేకపోతే, అమెరికా దర్యాప్తు సంస్థలు మీ మీద తప్పుడు ఆరోపణలు చేసి ఉంటే.. 'నేను దానివల్ల ఆర్థికంగా లబ్ధి పొందలేదు' అని బైబిల్ మీద ప్రమాణం చేయండి. దమ్ముంటే జగన్ ఈ సవాల్‌ను స్వీకరించాలి" అని షర్మిల అన్నారు.

బ్యాలెట్ విధానం ఉండాలి: పల్లంరాజు

న్యూఢిల్లీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బ్యాలెట్ పేపర్ విధానం రావాలని కాంగ్రెస్ సీనియర్ నేత పల్లంరాజు, గిడుగు రుద్రరాజు డిమండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత వారు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహార శైలి అధికార పార్టీకి అనుకూలంగా ఉందని ఆరోపించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లు రెండూ సరిపోలడం లేదన్నారు. గతంలోనూ సీడబ్ల్యూసీ సమావేశంలో బ్యాలెట్ పేపర్ విధానం రావాలని చర్చించామని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఓటమిపై పునఃపరిశీలన, భవిష్యత్తులో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంపై సమావేశంలో చర్చించినట్టు తెలిపారు.

జనవరి నుంచి జగన్ రాష్ట్ర పర్యటన!

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలతో జగనన్న - పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం' పేరుతో సంక్రాంతి నుంచి జిల్లాల పర్యటనలకు వెళ్లాలని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. శుక్రవారం పార్టీ నేతలతో తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జనవరి నుంచి చేపట్టబోయే కార్యక్రమాన్ని ప్రకటించారు. 'జనవరి 3వ వారం నుంచి లోక్‌సభ నియోజకవర్గం కేంద్రంగా 25 లోక్‌సభా నియోజకవర్గాల్లో పర్యటిస్తా. ప్రతి బుధ, గురువారాల్లో వాటి పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తలతో మమేకమవుతా' అని ప్రకటించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.